ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 125 పేజీలు: 8+16 వెల: 6.50

తెలంగాణ సర్కార్, డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు 2
రాష్ట్రంలో హ్యుందాయ్ భారీ పెట్టుబడులు 7

# ఉద్యోగులకు 2 డిఏలు


గురువారం హైదరాబాద్‌లో కేబినెట్ వివరాలు వెల్లడిస్తున్న డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్

వారికి బకాయిలు ప్రతినెల రూ. 700 కోట్లు చెల్లింపు
హెల్త్ కార్డులు, హెల్త్ కేర్ ట్రస్టు ఏర్పాటు
ప్రమోషన్ల కోసం యేటా డిపిసి నిర్వహణ
**ప్రభుత్వ ఉద్యోగులకు భారీ వరాలు ప్రకటించిన కేబినెట్**
హెచ్ఎఎం పద్ధతిలో విస్తృతంగా రోడ్ల అభివృద్ధి
రూ.19,579 కోట్లతో మెట్రో ఫేజ్ 2-బి
సన్న వడ్లకు బోనస్ కొనసాగింపు
**కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన డి.సిఎం భట్టి, మంత్రులు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్5:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్‌రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఒక డీఏను వెంటనే చెల్లించాలని, రెండో డీఏను మరో ఆరు నెలల్లో చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1వ తేదీ నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను వెంటనే చెల్లిస్తుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు బకాయి పడ్డ ఎరియర్స్‌ను 28 వాయిదాల్లో చెల్లిస్తారు.మరో డీఏను వచ్చే ఏప్రిల్ లో ప్రకటించాలని నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేబినెట్ కు నివేదించారు.ఉద్యోగుల డిమాండ్ల పై మే 6 వ తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది.ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం, అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించగా, కొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం ఐదు గంటలకు పైగా జరిగిన కబినెట్ సమావేశం పలు కీలక నిర్నయాలు తీసుకుంది. ఈ వివరాలను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాత్రి సచివాలయంలో మీడియాకు వివరించారు.ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని, ప్రతి నెలా రూ.700 కోట్లు వీటికి చెల్లింస్తామని చెప్పారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల కు సంబంధించి మంత్రి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందజేస్తామని, ప్రతినెల ఉద్యోగులు రూ.500 చొప్పున జమ చేస్తారు అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుందని, చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ఒక ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. ట్రస్టులో అధికారులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. మొత్తం ఉద్యోగుల్లో సెక్రటేరియట్లో 12.5శాతం కోట ఉండాలన్న ఉద్యోగ సంఘాల డిమాండ్‌కు ఆమోదం. మెడికల్ ఇన్ వాలిడేషన్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖం. రిటైర్ అయిన ఉద్యోగుల సేవలు తిరిగి వినియోగించుకోవద్దని కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామపంచా యతీలో పనిచేసే ఉద్యోగులకు >>2

కేబినెట్ మీటింగ్‌కు వెళ్తూ.. అస్వస్థతకు గురైన మంత్రి కొండా సురేఖ 2



సుధాకర్ (ఫైల్)

మావోయిస్టు అగ్రనేత సుధాకర్
# ఎన్‌కౌంటర్‌లో హతం
ఒక్కొక్కరుగా రాలుతున్న కేంద్ర కమిటీ సభ్యులు
**సుధాకర్ మృతిని ధ్రువీకరించిన బస్తర్ ఐజి సుందర్ రాజ్**

**చర్ల, జూన్ 5, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉధృతం చేసాయి. 2026 మార్చి 31 మావోయిస్టుల అంతమే లక్షంగా చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అడుజాడల్లో భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి.
తాజాగా నేషనల్ పార్క్ ఏరియాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటి సభ్యుడు టెంట్ లక్ష్మీనర సింహాచలం ఆలియాస్ సుధాకర్ (65) మృతిచెందారు. ఇతనిపై కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు సమాచారం. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రొగడవరం గ్రామం తండ్రి రామకృష్ణ నాయుడు. సుమారు మాడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంలో అనేక హోదాల్లో పనిచేసి కేంద్రకమిటీ సభ్యుడైయ్యాడు. ప్రస్తుతం ఉన్న కేంద్ర కమిటీ సభ్యుల్లో ఈ సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్నాడు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై బస్తర్ ఐజీ విడుదల చేసిన ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నారు. నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి సభ్యుడు పాపారావుతోపాటు మరికొందరు సభ్యులు ఉన్నట్లు నిఘావర్గాలకు సమాచారం అందిందని ఈ క్రమంలో వారినే లక్షంగా చేసుకొని డిఆర్జీ ఎస్టీఎఫ్ కొబ్రా సంయుక్త బలగాలు నేషనల్ పార్క్ ఏరియాలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయని అన్నారు. మావోల స్థావరాన్ని గుర్తించిన భద్రతా బలగాలు వారిపై కాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతిచెందాడని ఘటన ప్రాంతంలో >>2

# తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ





బెంగళూరు పోలీసు కమిషనర్, డిసిపిల సస్పెన్షన్
సుమోటోగా కేసు విచారణను స్వీకరించిన కర్ణాటక హైకోర్టు
మృతుల కుటుంబాలకు ఆర్సీబీ రూ.10 లక్షల పరిహారం
కెసిఎ సభ్యులు, ఆర్సీబీ, ఈవెంట్‌మేనేజర్లపైనా కేసులు
**ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశాలు**

**బెంగళూరు, జూన్ 5:** ఐపిఎల్‌ఛాంపియన్ టీమ్ ఆర్సీబీ విక్టరీ పెరేడ్‌లో నెలకొన్న విషాదంపై సమగ్ర విచారణకోసం కర్ణాటక ప్రభుత్వం సిఐడి విచారణకు ఆదేశించింది. నగరంలోని చిన్న స్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మరోవైపు హైకోర్టు సువోమోటోగా కేసును స్వీకరించింది. అంతేకాకుండా సంఘటనకు బాధ్యులుగా బెంగళూరు నగర కమిషనర్ దయానంద్‌ను సస్పెండ్‌చేస్తూ సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. అలాగే అదనపు కమిషనర్, ఆప్రాంత డిప్యూటికమిషనర్లను కూడా సస్పెండ్‌చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. భారీ సంఖ్యలో ఫ్యాన్స్ వస్తున్నందును ముందస్తు జాగ్రత్తగా మరింతగా బలగాలను పెంచి కట్టడిచేయడంలో విఫలం అయినట్లు సిద్ధరామయ్య సర్కారు భావించింది. తదుపరి ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లపైనా చర్యలుంటాయని దర్యాప్తు నివేదిక అందిన తర్వాత వారిపైనా చర్యలుంటాయన్నారు. ముందుగా వీరిని సస్పెండ్‌చేయడంతో పాటు కేసును సిఐడికి బదలీచేసింది. చిన్నస్వామి స్టేడియం ఇన్‌ఛార్జిపైనా చర్యలకు ఆదేశం. అలాగే ఆర్సీబీ ఈవెంట్ సంస్థ, ఆర్సీబీ ప్రతినిధిపైనా కేసులు నమోదుచేయాలని సీఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. ఈకేసులో మొత్తం ఐదుగురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటువేసారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సభ్యులను కూడా >>2



# నేటి నుంచి బడిబాట
19 దాకా కొనసాగింపు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం కోసం నేటి(జూన్6-శుక్రవారం) నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్టుగా ఈ ఏడాది కూడా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం కోసం.. అందుకు సంబంధించి రోజువారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను, మార్గదర్శకాలను ఇప్పటికే పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి జారీ చేశారు. దీంతో నేటి నుంచి బడిబాటను ప్రారంభించనున్నారు. బడిబాట కార్యక్రమంలో >>2

# జిల్లాలకు వెళ్లండి
మంత్రులను ఆదేశించిన ప్రధాని మోడీ
మన లక్ష్యాలు పెద్దవి.. సమయం పరిమితం
వికసిత్ భారత్ లక్ష్య సాధనకు మంత్రుల కృషి కీలకం


ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం న్యూఢిల్లీలోని తన నివాసంలో మొక్కను నాటుతున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 5:** మంత్రులు మరింత మెరుగైన పాలన అందించడంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర మంత్రులకు పధానమంత్రి నరేంద్ర మోదీ దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో కీలకవ్యాఖ్యలు చేశారు. నాలుగు గంటల పాటు కేంద్ర మంత్రి మండలి సమావేశంలో మోదీ మంత్రులను ఉద్దేశించి మాట్లాడారు. మన ముందు పెద్ద లక్ష్యాలు వున్నాయని సమయం మాత్రం పరిమితంగానే ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో భారత్ పెద్ద వ్యాపార, వాణిజ్య దేశంగా మారబోతోందని, ప్ఫూర్తిదాయక జిల్లాలో పథకంలో భాగంగా కేంద్ర మంత్రులంతా విధిగా ఆయా ప్రాంతాల్లో ఒక్క రోజు గడపాల్సిందేనని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలు, పథకాలు, కార్యక్రమాలు, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాల్లో వస్తున్న ఫలితాలపై ప్రధానంగా చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయని, 11 ఏళ్ళ పాలన, ప్రభుత్వం సాధించిన విజయాలపై కేబినెట్ కార్యదర్శి స్వామి నాథన్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే వైద్య, నీటి వనరుల శాఖలపై ఆరోగ్య కార్యదర్శి పూన్య శ్రీవాస్తవ, జలవనరుల కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ప్రజెంటేషన్ ఇచ్చారు. రహదారులు సహా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ఆ శాఖ కార్యదర్శి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రాస్ఫూర్తిదాయక జిల్లాల పథకంపై నీతి ఆయోగ్ నివేదికను ప్రస్తావించారు. ఈ జిల్లాల్లో పర్యటించని ఐదుగురు మంత్రులపేర్లను నీతిఅయోగ్ సిఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రస్తావించారు. >>2

'కాళేశ్వరం' విచారణకు
# నేడు ఈటల
9న హరీష్,
11న కెసిఆర్ హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్5:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతలోపాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలోని కాళేశ్వరం కమిషన్ శుక్రవారం నుంచి రాజకీయ ప్రతినిధులను విచారించనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, డిజైన్, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక అంశాలు వంటి వాటిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ ఇంజినీర్లను, రిటైర్డ్ ఇంజినీర్లను, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి అఫిడవిట్లను స్వీకరించి వాటి ఆధారంగా జస్టిస్ పిసి ఘోష్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా కంట్రోలర్ అండ్ అడిటర్ >>2

# అర్హత మేరకే పదవులు

గాంధీభవన్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని సూచన


గురువారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. గురువారం గాంధీభవన్‌లో మహబూబ్‌నగర్, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నాయకులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షీ నటరాజన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని రాబోయే ఎన్నికల్లో అనుకూలతగా మలచుకోవాలంటూ నేతలకు సూచించారు. పార్టీ నేతలంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు సూటిగా వివరించాలని, సీనియర్లు >>2



# ప్రభాకర్‌రావు 9న హైదరాబాద్ రాక?
**న్యాయవాదులతో కలిసి సిట్‌విచారణకు హాజరయ్యే అవకాశం.. ఫోన్‌ట్యాపింగ్ కేసు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్5:** తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణపై సస్పెన్స్ కొనసాగుతోంది. గురువారం ఆయన సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే దీనిపై సింగిల్ ఎంట్రీ పర్మిట్ ఇంకా ఆయన తీసుకోలేదని దర్యాప్తు అధికారులు అంటున్నారు. సింగిల్ ఎంట్రీ పర్మిట్ తీసుకుంటే మూడు రోజులలోపు ప్రభాకర్ రావు విచారణకు హాజరు కావాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయి. కాగా గత 14 నెలలుగా ప్రభాకర్ రావు అమెరికాలోనే తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ఆయన ఇండియాకు వస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడుగా ప్రభాకర్ రావు ఉన్న విషయం విధితమే. అమెరికా నుంచి బుధవారం రాత్రి ఆయన హైదరాబాద్ చేరుకోవచ్చని సమాచారం మొదట ఉంది. కానీ ఈయన చేరుకులేదు. అయితే 9వ తేదీన హైదరాబాద్‌కు చేరు కోవచ్చని సామాచారం. ఆయన రాగానే మూడు రోజుల్లో న్యాయవాదులతో కలిసి సిట్ విచారణకు హాజరవుతారని తెలుస్తోంది. కాగా ఎట్టకేలకు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావును విచారణ చేయడానికి సెట్ అధికారులకు లైన్ క్లియర్ అయింది. ప్రభాకర్ రావు >>2

# రాఫెల్ విడిభాగాలు ఇక హైదరాబాద్‌లో తయారీ
టాటా, డసో సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం
2028 నాటికి ఉత్పత్తి చేసే లక్ష్యం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్5:** భారత వైమానిక దళంలో కీలకంగా వ్యవహరిస్తున్న రఫేల్ యుద్ధవిమానాల తయారీకి సంబంధించి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్, ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్ సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రఫేల్ యుద్ధ విమానాలకు చెందిన ప్రధాన భాగాలు హైదరాబాద్‌లో తయారు చేయాలని రెండు సంస్థలు ఒప్పందానికి వచ్చాయి. రఫేల్ ఎయిర్ క్రాఫ్ట్ విడిభాగాలు ఫ్రాన్స్‌కు వెలుపల తయారు కావడం ఇదే మొదటిసారి. హైదరాబాద్‌లోని టీఏఎస్ రఫేల్ ప్రధాన భాగాలను తయారుచేయనుంది. 2028సంవత్సరం నాటికిఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాలను ఉత్పత్తి చేసే లక్ష్యంతో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థ ఏర్పాట్లు చేయనుంది. నెలకు 2 ఫ్యూజ్‌లేజ్‌లు ఉమ్మడి సంస్థ అందించనుంది. భారత్‌లో తమ ఉత్పత్తిని బలోపేతం చేయడంలో ఇది నిర్ణయాత్మక అడుగని డసో ఏవి యేషన్ ఛైర్మన్ అండ్ సీఈవో ఎరిక్ ట్రాపియర్ తెలిపారు. భారత రక్షణ రంగంలో తమ సేవలను విస్తరిస్తున్నందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం రఫేల్ విస్తరణకు మరింత దోహదం చేస్తుందని, అంతేకాకుండా నాణ్యమైన సేవలు అందిస్తూ సైనిక అవసరాలను తీర్చేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భారత రక్షణ రంగ చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయిగా నిలుస్తుందని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెట్ సీఎండీ సుకరన్ సింగ్ తెలిపారు. డసో ఏవియేషన్ సంస్థతో చేసుకున్న ఈ ఒప్పందం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సామర్థ్యాలను గుర్తు చేస్తుందని అన్నారు. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎయిర్ బస్, బోయింగ్ కంపెనీల విడి భాగాలు తయారు చేస్తోంది. మరోవైపు యుద్ధ విమానాల తయారీ దిశగా హైదరాబాద్ పరిశ్రమలు ముందడుగు వేశాయి. తేజస్ మార్క్ 1ఏలో 5 భాగాలు ఉంటే అందులో మధ్య భాగాన్ని హైదరాబాద్ నగరంలోని వెమ్ టెక్నాలజీస్ డెవలప్ చేసింది. ప్రస్తుతం మరింత అధునాతన తేజస్ మార్క్1ఏ కి మధ్య భాగాన్ని సిద్ధం చేశారు. మొదటి ఉత్పత్తిని మే 30న హెచ్ఏఎల్‌కు అందజేశారు.

# ఉద్యోగులకు 2 డిఏలు

>> పంచాయతీని అనుసరించి గ్రేడింగ్ ఇవ్వాలని, ఉద్యోగుల ప్రమోషన్స్‌కు సంబంధించి ప్రతి సంవత్సరం సెప్టెంబర్లో డీపీసీ వేయనుంది. ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన ఉద్యోగులు అధికారులను వెనక్కి పంపాలని నిర్ణయం నర్సింగ్ డైరెక్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం. అంగన్వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలకు పెంపు. అధికారులు వినియోగించే అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల క్లియర్ తో పాటు వాహనాల హద్దులు పెంచాలని నిర్ణయం. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకున్నామని, ఉద్యోగులను మా కుటుంబ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేర్చడంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనది. వారి సంక్షేమానికి సంబంధించి క్యాబినెట్ సమావేశంలో లోతుగా చర్చించామన్నారు. అధికారులు నివేదించిన అంశాలు, క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ఉద్యోగ సంఘాలు పెట్టిన డిమాండ్లను క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా వివరించానని డిప్యూటీ సిఎం తెలిపారు. ఉద్యోగుల డిమాండ్లను క్యాబినెట్‌సహచరులు పెద్ద మనసుతో అర్థం చేసుకొని ఆమోదం తెలిపారని, సిఎం రేవంత్‌తో పాటుక్యాబినెట్ సహచరులందరికీ ఉద్యోగుల సబ్ కమిటీ చైర్మన్ గా ధన్యవాదాలు తెలిపినట్లు ప్రకటించారు. కేబినెట్ తీసుకున్న వివరాలు ఇలా ఉన్నాయి. స్టేట్ లెవల్ మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను రికగ్నిషన్ చేసేందుకు ఒప్పుకుంది. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన స్వర్గీయ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులను ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. సన్నాలకు బోనస్ తో రైతులకు లబ్ధి చేకూరిందని, సన్న వడ్లకు బోనస్ కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాలకు ప్రమాద బీమా పథకం అమలుకు రూ.38.5 కోట్లు స్త్రీనిధికి కేటాయించాలని నిర్ణయం. ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా నేరుగా స్త్రీనిధి ద్వారా 385 మంది బాధిత కుటుంబాలకు ప్రమాదబీమా పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయం. రాష్ట్రంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హెచ్ఏఎం (హైబ్రీడ్ అన్యూటీ మోడల్) విధానంలో అన్ని నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. గ్రామాలకు బీటీరోడ్లు, మండలాల్లో డబుల్ రోడ్లు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు లైన్ల రోడ్లు వేస్తామని పొంగులేటి తెలిపారు. పంచాయతీరాజ్ పరిధిలో 7947 కిలోమీటర్లు, ఆర్ అండ్ బీ పరిధిలో 5190 కిలోమీటర్లు.. మొత్తం 13137 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తుంది. పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.16 వేల 780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16 వేల 414 కోట్లు ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఖర్చు పెడుతుందని పేరొర్కొన్నారు.. హ్యామ్ విధానంలో రెండేండ్లలో నిర్మాణంతో పాటు 15 ఏండ్ల మెయింటెనెన్స్ కూడా ఏజెన్సీలదే బాధ్యత ఉంటుంది. పార్లమెంట్ ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా ఒక్కో ప్యాకేజ్‌గా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం. హైదరాబాద్ సిటీలో మెట్రో ఫేజ్ 2బి ప్రాజెక్టుకు 86.1 కిలోమీటర్లకు రూ.19,579 కోట్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ తో చేపట్టాలని కేబినేట్ నిర్ణయించింది. కారిడార్-1లో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ, కారిడార్2 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ, కారిడార్ 3 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కి.మీ మెట్రో విస్తరించనుంది.



న్యూఢిల్లీలో గురువారం ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కిర్గిజ్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రి జీన్‌బెక్ కులుబాయేవ్

## కేబినెట్ మీటింగ్‌కు వెళ్తూ.. అస్వస్థతకు గురైన మంత్రి కొండా సురేఖ

### పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి, ఇంటికి వెళ్లి రెస్ట్ తీసుకోవాలని సూచన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్5:** రాష్ట్ర సచివాలయంలో తన ఛాంబర్ నుంచి 6వ అంతస్తులోని కేబినెట్ మీటింగ్‌కు వెళ్తూ.. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరిగి ఆమె కింద పడిపోయారు. అక్కడే ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టీం మంత్రికి ప్రథమ చికిత్స అందించారు. లో బీపీ కారణంగా కళ్లు తిరిగిపడిపోయినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండా సురేఖను పరామర్శించారు. ఆమె ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. విరామం లేకుండా గత కొద్ది రోజులుగా వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో విస్తృతంగా కార్యక్రమాలకు హాజరు కావడం, గురువారం) ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాదు పీసీబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రోగ్రాంలో పాల్గొనడం... అటు తర్వాత సచివాలయంలో జరిగే క్యాబినెట్ సమావేశానికి హాజరు అయ్యేందుకు అవసరమైన డేటాను అధికారుల నుంచి సేకరిస్తున్న నేపథ్యంలో సకాలంలో ఆహారం తీసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ సచివాలయంలో స్వల్ప అస్వస్థతకు గురి అయ్యారు. అయితే, ఎటువంటి ఆందోళన అక్కర్లేదని వైద్యులు స్పష్టం చేశారు. అనంతరం అక్కడే వైద్యులు ప్రథమ చికిత్సను మంత్రికి అందించారు. విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.. సీఎం రేవంత్ రెడ్డి మంత్రి చెంతకు వచ్చి పరామర్శించారు. కొద్ది సేపు మంత్రి వద్దనే ఉండి ఆమె యోగక్షేమాలు సీఎం వైద్యులను అడిగి తెలుసుకోగా.. ఒకటి, రెండురోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు ముఖ్యమంత్రికి చెప్పారు. కాగా, ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని, ఇంటికి వెళ్ళి రెస్టు తీసుకోవాలని మంత్రి సురేఖకి సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రి సురేఖ విశ్రాంతి తీసుకునేందుకు తన హైదరాబాద్ నివాసానికి వెళ్ళారు. కాగా, ఈ విషయం మీద తన వరంగల్ ఈస్ట్ నియోజకవర్గవాసులు, జిల్లాకు చెందిన వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సురేఖ ఉద్ఘాటించారు. గత కొన్ని రోజులు బిజీబిజీ షెడ్యూల్ నేపథ్యంలో ఆహారం సకాలంలో తీసుకోకపోవడంతోనే ఇబ్బంది తలెత్తిందని సురేఖ చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల సందర్భంగా తన ఆరోగ్య నిమిత్తం వాకబు చేసిన మిత్రులు, సోదరులందరికీ మంత్రి సురేఖ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్‌కౌంటర్‌లో హతం

>> మావోయిస్టు ఆయుధాలు ఇతర సామాగ్రి లభ్యంఅయ్యాయని తప్పించుకున్న మావోల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు. కాగా ఈ ఎన్‌కౌంటర్‌పై బిన్న కథనాలు వినిపిస్తున్నాయి.? ఎదురుకాల్పులు జరిగితే కేంద్ర కమిటీ సభ్యుడు ఒక్కరే ఎలా చనిపోతారని ఆయనకు ఉన్న భద్రతా వలయంలో ఎవ్వరికీ ఎమి కాకుండా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.
మావోయిస్టు ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న అగ్రనేతలను కేంద్ర కమిటీ సభ్యులను టార్గెట్ చేస్తు ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. అగ్రనేతలను హతమార్చితే క్రింది స్థాయి కేడర్ నిస్తేజం అలుముకొని లొంగుబాట్లు అధికంగా ఉంటాయని కొందరు ప్రాణభయంలో ఉద్యమాన్ని వీడి స్వచ్ఛందంగా జన జీవనంలో కలుస్తారనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన విధానం లాగా కనిపిస్తుంది. గడిచిన ఐదు నెలల కాలంలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు చలపతి మనోజ్ సుధాకర్ తోపాటు మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు మృతిచెందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక గుడ్డు మరికొందరు నేతలు ఉండటం గమనార్హం.

## తెలంగాణ సర్కార్, డిజిపికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్5:** తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల సంఘం నోటీసులు జారీ చేసింది. ఇటీవల రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో యువకుడి మరణంపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలంటూ నోటీసులు ఇచ్చింది. పోలీసుల టార్చర్ కారణంగా యువకుడు మరణించాడంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఎన్‌హెచ్‌ఆర్సీ పరిగణలోకి తీసుకుంది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న జాతీయ మానవ హక్కుల సంఘం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ డీజీపీకి కూడా ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు పంపింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని కోరింది. మీడియా కథనాల్లో విషయాలు నిజమైతే, బాధితుడి మానవ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించినట్లుగా భావించాల్సి వస్తుందని కమిషన్ పేర్కొంది. నగరంలోని టోలీచౌకికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు. ఈ క్రమంలో అతడు మరో మహిళతో సన్నిహితంగా ఉండటంతో.. విషయం తెలుసుకున్న రెండో భార్య నిలదీసింది. ఈ విషయంపై భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. అలాగే మే 13న కూడా పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా.. అది ఎంతకీ తెగకపోవడంతో ఇరు వర్గాలు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.
ఈ క్రమంలో భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తను లోపలికి తీసుకెళ్లిన పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇర్ఫాన్ కుప్పకూలిపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ అతడు మరణించాడు. అయితే పోలీసులు కొట్టడం వల్లే అతడు మరణించాడంటూ ఇర్ఫాన్ సోదరుడు ఆరోపించాడు. ఇర్ఫాన్‌ను తాము కొట్టలేదని పోలీసులు తెలిపారు. పోలీసుల టార్చర్ వల్లే యువకుడు మృతిచెందాడంటూ మీడియాలో కథనాలు రావడంతో ఈ ఘటనను ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వానికి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.

## ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కట్టుబడి ఉందాం

### -సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్5:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం కాపాడితే అదేమనల్ని కాపాడుతుందన్నారు. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కట్టుబడి ఉందామన్నారు. సహజ వనరుల సంపదను రాబోయే తరాలకు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ ధృక్పథమని పేర్కొన్నారు.

## బడిబాట

>> ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూఓలు, ఎఎపిసి సభ్యులు ప్రతిరోజూ ఇంటింటికి ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేయడం ద్వారా విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. జిల్లా/మండల/గ్రామ స్థాయిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో చేర్పించాలి. నేడు గ్రామసభను నిర్వహించాలి, 7న ప్రతీ ఇంటిని సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాలన్నారు. 8నుంచి 10వ తేదీ వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించి.. అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారిని అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. జూన్ 11న.. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. 12వ తేదీన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాలి.. అదేరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలను అందించి విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానిస్తూ వెల్‌కమింగ్ డేగా నిర్వహించాలి. 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభను నిర్వహించాలి, 16న ఎఫ్ఎల్ఎన్ దినోత్సవం నిర్వహించాలి, 17న విలీన విద్య, బాలిక విద్యాదినోత్సవం నిర్వహించాలి. 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన కల్పిస్తూ.. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి. 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించేలా బడిబాట కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు.

### వారం - వర్జ్యం

తేది : 06-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి తె.4.48
హస్త ఉ.6.33
వర్జ్యం మ.3.35-సా.5.24
దు.ఉ.8.12-9.04, 2) మ.12.33-1.25
శుభ సమయం : ఉ.9.10-9.45
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం :** వివాహ, ఉద్యోగయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెట్టినా ముందుకు సాగుతారు.

**వృషభం :** కుటుంబ సభ్యులతో అకారణంగా విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కర్కాటకం :** భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా వుండదు. వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. పారిశ్రామిక, కళారంగాలవారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. వస్తులాభం.

**వృశ్చికం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన చికాకులు పెడతాయి. ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటుకాగలదు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురవుతాయి.

**మకరం:** వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.


**కుంభం:** ఎదుటివారిని ఆకట్టుకొని ముందుకుసాగుతారు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మీనం:** మిత్రులసాయంతో ముఖ్యమైన పనులు కొంతవరకు పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 5 వేలకు చేరుతున్న కరోనా కేసులు

**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన మహమ్మారి, ఇప్పుడు మళ్లీ విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది, మరణాలు కూడా నమోదవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం... నిన్నటి వరకు 4,302గా ఉన్న యాక్టివ్ కేసుల సంఖ్య, ఈరోజు 4,866కు చేరింది. కేవలం 24 గంటల వ్యవధిలో 564 కొత్త కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇదే సమయంలో గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఏడుగురు కోవిడ్ కారణంగా మరణించారు. మృతుల్లో ఢిల్లీకి చెందిన ఐదు నెలల చిన్నారి కూడా ఉండటం గమనార్హం. ఆ చిన్నారికి ముందే శ్వాసకోశ సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఆరుగురు మృతులు వృద్ధులు కాగా, వీరు మధుమేహం, అధిక రక్తపోటు, న్యూమోనియా వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెపుతున్నారు. మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో ఇద్దరు చనిపోయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ 562, పశ్చిమ బెంగాల్ 538, మహారాష్ట్ర 526, గుజరాత్ 508 రాష్ట్రాలు నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఒక్కరోజే 105 కొత్త కేసులు వెలుగుచూడటం గమనార్హం. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తం 44 కోవిడ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయని, వీరిలో ఎక్కువ మంది ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారేనని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు స్వల్ప లక్షణాలతో ఉన్నాయని, బాధితులు హోమ్ కేర్‌లోనే కోలుకుంటున్నారని ఆరోగ్య అధికారులు చెబుతున్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు రద్దీ ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు. శ్వాసకోశ సంబంధిత లక్షణాలు కనిపిస్తే, పరిస్థితిని గమనిస్తూ, లక్షణాలు తీవ్రమైతే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని కోరారు. తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి అధికారిక సమాచార వనరులపైనే ఆధారపడాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.



అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయంలో గురువారం శ్రీ రామ దర్బార్, ఇతర దేవతా విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

## తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

>> అరెస్టుచేయాలని సీఎం ఆదేశించారు. అలాగే రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర నివేదికను 30 రోజుల్లో అందచేయాలనినిర్దేశించామని సీఎం వెల్లడించారు. విజయోత్సవాలవేళ జరిగిన తొక్కిసలాట ఆపై మరణాలు, తీవ్ర గాయాలపాలయిన సంఘటనపై సమాచార హక్కుకార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదుపై కబ్బన్‌పార్కు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. ఆర్సీబీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డిఎన్ఎ ఎంటర్‌టైన్‌మెంట్స్, కర్ణాటకక్రికెట్ అసోసియేషన్‌సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న అందరిపైనా కేసులునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. నేరపూరిత నిర్లక్ష్యం ఈకకేసులో సంస్థలను నిందితులుగాచేర్చింది. బిఎన్ఎస్‌లోని ఐదు సెక్షన్లకింద కేసులునమోదుచేసామన్నారు. మరోవైపు ఈకేసు దర్యాప్తును సిఐడికి బదలీచేస్తున్నట్లు సిద్ధరామయ్య సర్కారుప్రకటించింది. కోర్టుకు ఇచ్చిన ప్రగతినివేదికలో కూడా స్పష్టంచేసింది. తదుపరి దర్యాప్తుకోసం సిట్ ఏర్పాటుకావాలన్న ఆదేశాలతోపాటు ఎఫ్ఐఆర్ కాపీని సిఐడికి అప్పగించింది. ఇప్పటికే మెజిస్టీరియల్ విచారణజరుపుతున్నామని తొక్కిసలాటకు కారణాలు, లోపాలు జవాబుదారీతనం వంటి అంశాలుపరిశీలించేందుకు డిప్యూటి కమిషనర్ బెంగళూరు, జిల్లామేజిస్ట్రేట్‌లో 15రోజుల్లోపు విచారణనివేదిక ఇస్తారని తెలిపింది.
స్టేడియం వద్ద 2.5 లక్షలమంది గుమికూడారని, బెంగళూరు నగర పోలీసులు 1380, కెస్ఆర్‌పి ప్లాటూన్లు 325 మందిని మొహరించి భారీ బందోబస్తు ఏర్పాట్లుచేసామన్నారు. కానీ జనం భారీగా తరలిరావడంతో పలుగేట్లవద్ద తొక్కిసలాట జరిగి 11 మందిచనిపోయారని, 56 మంది గాయపడినట్లు వివరించింది. 1,6,7,17నుంచి 21 గేట్లవద్దనే ప్రాణనష్టంజరిగింది. వైద్యసాయం వెంటనే అందించామని, క్షతగాత్రుల్లో 50 మంది ఔట్‌పేషెంట్లుగా చికిత్సపొందారని, మరో ఆరుగురికి ఇంకా చికిత్స జరుగుతోందని తెలిపింది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితోపాటు మూడు ఫైర్ ఇంజన్లు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి-శ్వాట్‌యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్‌వాహనం ఏర్పాటుచేసినట్లు కోర్టుకు వివరించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారంప్రకటించామని, క్షతగాత్రుల వైద్యఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌సైతం మృతులకు రూ.5 లక్షలచొప్పునపరిహారం చెల్లించనున్నట్లుప్రకటించింది.

**మృతులకుటుంబాలకు రూ.10 లక్షలు..ఆర్సీబీ**

విజయోత్సవాల విషాదంపై రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం స్పందించింది. తన అధికారిక సోషల్‌మీడియా హ్యాండిల్‌పై పోస్టుపెట్టి వరుసగా అప్‌డేట్లు ఇచ్చింది. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10 లక్షలచొప్పున పరిహారం ఇస్తామని వెల్లడించింది.
అలాగే గాయపడిన వారి సహాయార్థం ఆర్సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటుచేస్తున్నట్లుప్రకటించింది. ప్రభుత్వంనుంచి మృతులు ఒక్కొక్కరికి రూ.10 లక్షలుపరిహారం ప్రకటించగా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌కూడా ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షలచొప్పున పరిహారం అందిస్తామని ముందుకువచ్చింది.

## ప్రభాకర్‌రావు 9న హైదరాబాద్ రాక?

>> వ్యవహారం, ఎన్నో మలుపుల మీద మలుపులు తిరిగింది. ఎట్టకేలకు ఆయన విచారణ కోసం హైదరాబాద్ వస్తున్నారు. కాగా ఆయన చేసుకున్న ముందస్తు బెయిలును హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీం కోర్టుకు వెళ్లారు. అక్కడ ఊరట లభించింది. తాము చెప్పే వరకూ ప్రభాకర్ రావును అరెస్టు చేయవద్దంటూ న్యాయస్థానం తీర్పు ఇస్తూ.. అధికారుల విచారణకు హాజరు కావాలని చెప్పడంతో ప్రభాకర్ రావు హైదరాబాద్‌కు వస్తున్నారు.

## 'కాళేశ్వరం' విచారణకు నేడు ఈటల

>> జనరల్(కాగ్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్ఎ) నివేదికలను కూడా కమిషన్ పరిగణలోకి తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్‌ను శుక్రవారం కమిషన్ ముందు హాజరుకానున్నారు. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది. రాజకీయప్రతినిధుల విచారణలు తదుపరి కమిషన్ తుది నివేదికను ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి అందజేస్తుంది.

## జిల్లాలకు వెళ్లండి

>> మంత్రులు తప్పని సరిగా పర్యటించాలని కనీసం ఒక్క రోజైనా సంబంధిత జిల్లా, బ్లాక్‌లో గడపాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. స్థానిక సమస్యలను అర్థం చేసుకునేందుకు ప్రజలతో మమేకం కావాలి అంటే ఇది తప్పనిసరి అని ఆయన అన్నారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, తయారీ రంగ ప్రాజెక్టులు లక్ష్యాలు సాధించాలని, గత 10 ఏళ్ళ పాలన సాధించిన విజయాలు అంతకుముందు 10 ఏళ్ళ ప్రభుత్వాలతో పోల్చుకోవద్దని అన్నారు. రానున్న రోజుల్లో అనేక భారీ లక్ష్యాలను సాధించాలని ప్రధాని మోదీ మంత్రులకు సూచించారు. నీటి సంరక్షణకు కార్యక్రమాలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ పథకంకు ప్రస్తుతం ఉపాధి హామీ పథకం నిధుల వినియోగిస్తారన్నారు. అనేక రుగ్మతలకు కారణం స్థూల కాయమని, స్థూలకాయం, ఊబ కాయంకు వంట నూనెల వినియోగమే ప్రధాన కారణంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజలు రోజు వారీ ఆహార వినియోగంలో కనీసం 10 శాతం వంట నూనెల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో భారత్ పెద్ద వ్యాపార దేశంగా మారబోతోందని అందుకు అనుగుణంగా ఉత్పత్తుల నాణ్యత, మెరుగైన పాలన అవసరం అని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు రెండితలు అయిన విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్ళాలని ప్రధాని మోదీ కేంద్ర మంత్రులకు సూచించారు.

## అర్హత మేరకే పదవులు

>> జూనియర్ల సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దేశాన్ని ఆశ్చర్యపరిచే విధంగా పథకాలు అమలవుతున్నాయన్నారు. కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్న బియ్యం పంపిణీ, భూ భారతి పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందన్నారు.

**వరంగల్ నియోజకవర్గ సమావేశం...**

వరంగల్ నియోజకవర్గం సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కమిటీల ఆలస్యం వల్ల కార్యకర్తల్లో నైరాశ్యం చెందిన మాట వాస్తవం అన్నారు. త్వరలోనే అర్హతల ప్రకారం పదవులు దక్కుతాయన్నారు. 17 నెలల పాలనలో ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవలసిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని, తెలంగాణ ఇంచార్జ్‌గా మీనాక్షి నటరాజన్ రావడం మనందరి అదృష్టం అన్నారు. చురుకైన నాయకుల్ని పిసిసి అబ్జర్వర్లతో గుర్తించి తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఉందని, కార్యకర్తలు - నాయకులు ప్రజలతో అనుసంధానంగా పని చేయాలన్నారు. పార్టీకి ప్రభుత్వానికి నాయకులు వారధిగా పనిచేయాలన్నారు. సీనియర్, జూనియర్ల సమన్వయంతో పని చేయాలని, కులసర్వే, ఎస్సీ వర్గీకరణ, సన్న బియ్యం, భూ భారతి పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు.

## నకిలీ, కల్తీ విత్తుల జోరు

### ఎక్కువగా వరి, మిర్చి, పత్తి

### ప్రముఖ బ్రాండ్‌ల పేరుతో అమ్మకాలు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణలో నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా సాగుతోంది. రాష్ట్రంలో ప్రతీ ఏటా నకిలీ, నాసికరం మిర్చి, పత్తి, వరి తదితర విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోతుండడం సర్వసాధారణమైంది. ప్రైవేట్ మార్కెట్‌లో ఐఆర్ 64 పేరుతో వరి విత్తనాలను అమ్ముతున్నారు. 30 కేజీల బ్యాగుల్లో అమ్ముతున్న ఈ విత్తనాలు నాసికరం కావడంతో ఇది తెలియక కొనుగోలు చేసిన రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. ఒక్క బ్యాగు వరి విత్తనాల ద్వారా ఎకరంన్నర పొలంలో సాగు చేయవచ్చని, అయితే ఈ బ్యాగులను కొనుగోలు చేసి వేస్తే అవి అర ఎకరాకు కూడా సరిపోయే పరిస్థిది లేదని అంటున్నారు. మరోవైపు నాసిరకం, నకిలీ మిర్చి, పత్తి, కూరగాయలు ముఖ్యంగా టమాటా, బెండ, వంకాయ, క్యాప్సికం నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు నాణ్యత కలిగినవని చెప్పి అమాయక రైతులతో వాటిని కొనుగోలు చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనుమతి లేని హైబ్రీడ్ మిర్చి విత్తనాలను బహిరంగంగా అమ్మి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. అలాగే తెలంగాణలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ, జగిత్యాల, ఆదిలాబాద్, కామారెడ్డి తదితర జిల్లాల్లో బెంగుళూరు నుండి వీటిని తెస్తున్న దళారులు కొన్ని షాపుల ద్వారా రైతులకు అమ్ముతున్నట్లు చెబుతున్నారు.
ఈ విత్తనాలను పది గ్రాములు చొప్పున ప్యాకెట్లను తయారు చేస్తున్నారు. 341 హైబ్రీడ్ మిర్చి, 5531 బాడిగ రకం, ఎండామ్5 రకాలను అనుమతి లేకుండానే ఇటీవల కొందరు వ్యాపారులు రైతులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఎవరికి అనుమానం రాకుండా వ్యాపారులు మిర్చి విత్తనాలను గిఫ్ట్ ప్యాక్‌ల్లో అమ్మినట్లు పలువురు సమాచారం.

# యూనివర్సిటీల్లో పరిశోధనలు, విద్యానైపుణ్యాల పెంపు

### ఇంజినీరింగ్ సిలబస్‌లో కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థుల్లో పరిశోధనలు, విద్యా నైపుణ్యాలను పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు హైదరాబాద్ నగరంలోని మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం రెండు రోజులపాటు జరగనున్న .. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్ కంప్యూటింగ్‌లో పురోగతిపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. బహుళ విభాగ రంగాలలో పెరుగుతున్న కృత్రిమ మేధస్సు(ఏఐ) యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. అలాగే భవిష్యత్తును రూపొందించడంలో ఏఐ పాత్రపై ఆయన స్ఫూర్తి దాయకమైన ప్రసంగం చేశారు. తెలంగాణ విశ్వ విద్యాలయాలు, వాటి అనుబంధ సంస్థలలో పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని బలోపేతం చేయడానికి అధునాతన ఏఐ టెక్నాలజీ ఉపయోగాన్ని.. సిలబస్‌లో ఏఐ ప్రాముఖ్యతను వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పివి సుధ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను వివరించారు. కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ కె కృష్ణారావు, డైరెక్టర్ డాక్టర్ ఎం లక్ష్మీపతిరావు, అంతర్జాతీయ సదస్సుకు 18 రాష్ట్రాల నుంచి 200 సంస్థల నుండి 1,800 మందికి పైగా సహాయకులు 910 పరిశోధనా పత్రాలను సమర్పించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇథియోపియా, మలేషియా నుండి అంతర్జాతీయ సమర్పణలు కూడా సమర్పించారని.. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రచురణ కోసం 377 పత్రాలను ఎంపిక చేసినట్టు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణే మానవాళికి రక్ష

### పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణే మానవాళికి రక్ష అని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణే మానవాళికి రక్ష అని పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలన్నారు. పర్యావరణ దినోత్సవం కొత్త ఆలోచనలకు, హరిత జీవనశైలికి, చైతన్యానికి నాంది కావాలని పిలుపునిచ్చారు.

# నేడు లాసెట్-2025 పరీక్ష

### 76 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ..

### 57,715 మంది దరఖాస్తు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో యుజి, పిజి లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్-2025, పిజి లాసెట్-2025 పరీక్ష నేడు(శుక్రవారం) జరగనుంది. పరీక్ష కోసం 57,715 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకి నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రానికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 76 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు సెషన్‌లలో పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మూడు సంవత్సరాల లా కోర్సులో ప్రవేశ పరీక్షను నిర్వహించనుండగా.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులో ప్రవేశాలకు పరీక్షను నిర్వహిస్తారు. ఇక సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు పిజి లాసెట్ పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 76 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. సాయంత్రం సెషన్‌కి 65 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడు సంవత్సరాల లా కోర్సులో చేరడానికి 41,210 మంది దరఖాస్తు చేసుకున్నారు. 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులో చేరడానికి 11,695 మంది దరఖాస్తు చేసుకున్నారు. పిజి(ఎల్‌ఎల్‌ఎం) లా కోర్సులో చేరడం కోసం 4810 మంది దరఖాస్తు చేసుకున్నారు.

# మంత్రివర్గంలో మాకు అవకాశం ఇవ్వండి

### ఢిల్లీలో మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేల వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 5:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ త్వరలో జరుగుతుందన్న వార్తల నేపథ్యంలో ఆశావాహులు అప్రమత్తమయ్యారు. తమకు మంత్రి పదవులు ఇవ్వాలంటూ కాంగ్రెస్ హైకమాండ్‌కు వినతులు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మాదిగ సామాజికవర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు.. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. వీరిలో అడ్లూరి లక్ష్మణ్, మందుల సామేల్, కాలే యాదయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు. గత నెల రోజులుగా కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలు, పీసీసీ, సీఎం, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌ను కలిసి మంత్రి వర్గంలో తమ సామాజికవర్గం ఎమ్మెల్యేలకు స్థానం కల్పించాలని విజ్ఞాపనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నలుగురు ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో తప్పనిసరిగా తమకు స్థానం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను కోరామన్నారు. తమ సామాజిక వర్గం నేతలకు మంత్రివర్గంలో స్థానం పట్ల అధిష్ఠాన పెద్దలు సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరిగిన తమ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం ఉంటుందని భావిస్తున్నామని అన్నారు. ఇది మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన ఆరుగురు ఎమ్మెల్యేల అంశం కాదని, యావత్ మాదిగ ప్రజలకు సంబంధించిన అంశమని తెలిపారు. 200 శాతం న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సైతం లేఖ రాశామన్నారు. అపాయింట్‌మెంట్ దొరికితే రాహుల్ గాంధీని కలిసి డిమాండ్లు తెలియజేస్తామన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, మాదిగ సామాజిక వర్గీయులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయంగా కీలక పదవుల్లో ప్రాతినిధ్యం లేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న ఆరుగురు మాదిగ సామాజికవర్గం ఎమ్మెల్యేలలో అధిష్ఠానం ఎవరికి మంత్రి పదవి ఇచ్చినా అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. మంత్రివర్గంలో ఉన్న కొందరు తమ సామాజికవర్గం పేరు చెప్పుకుంటున్నారని.. తెలంగాణ మంత్రివర్గంలో ఇప్పటివరకూ ఎటువంటి మాదిగలు లేరన్నారు. నిజమైన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతున్నామని నలుగురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# సాకేత్‌కోర్టు లాకప్‌లో ట్రయల్ ఖైదీ హత్య

### పాతకక్షలే కారణమంటున్న పోలీసులు

**న్యూఢిల్లీ, జూన్ 5 :** ఢిల్లీలోని సాకేత్ కోర్టులో లాకప్ లోపల గురువారం ఇద్దరు తోటి ఖైదీలు ఒక ఖైదీని హత్య చేశారు. తీహార్ జైలు నంబర్ 8లో ఉన్న అమన్ అనే ఖైదీని విచారణ కోసం కోర్టుకు తీసుకువచ్చినప్పుడు ఈ సంఘటన జరిగింది. హత్యాయత్నం కేసులో విచారణ ఎదుర్కొంటున్న అమన్ (24) తీవ్ర గాయాల పాలయ్యాడు. అతన్ని ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. జితేందర్ అలి



యాస్ జిట్టే, జైదేవ్ అలియాస్ బచ్చా అమన్‌పై దాడి చేసి నప్పుడు అనేక మం ది విచారణ ఖైదీలు లాకప్ లో ఉన్నారని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సౌత్) అంకిత్‌చౌహాన్ అ న్నారు. లాకప్ లోని ఖార్జా నంబర్ 5లో జరిగిన ఘటనలో అమన్ ను ప్రొడ్యూస్ చేయడం కోసం సాకేత్ కోర్టుకు తీసుకువచ్చారని డిసిపి తెలిపారు. పాత శత్రుత్వం ఈ దాడికి ప్రేరణనిచ్చిందని ప్రాథమిక విచారణలో తేలింది. 2024లో, అమన్ జితేందర్ మరియు అతని సోదరుడిపై కత్తితో దాడి చేశాడని, అది గురువారం జరిగిన హత్యకు దారితీసి ఉండవచ్చు అని తెలుస్తోంది. వారి కస్టడీలో ఉన్న సమయంలో ఈ శత్రుత్వం కొనసాగి, తీవ్రరూపం దాల్చినట్లు కనిపిస్తోందని పోలీసులు తెలిపారు. గోవింద్‌పురి నివాసి అయిన అమన్‌కు ఈ దాడిలో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే వైద్య పరీక్షల కోసం తరలించారు, కానీ చికిత్స పొందుతూ మరణించినట్లు ప్రకటించారని ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపించి, హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసారు.

# ఎర్రగడ్డ ఫుడ్‌పాయిజన్ ఘటన

## డైట్ కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిపై కేసు నమోదు

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూన్ 5, ప్రభాతవార్త :** ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కలుషిత ఆహారం తినడం వలన ఇప్పటికే ఒక రోగి మృతి చెందగా సుమారు 92మంది తీవ్ర అస్వస్థతకు గురిఅయిన విషయం తెలిసిందే... ఈ క్రమంలోనే ప్రభుత్వం బాధ్యులపై చర్యలకు ఉపక్రమించింది. ఘటనకు కారణమైన ఉన్నతాధికారులతో పాటు డైట్ కాంట్రాక్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ప్రకటించారు. అదేవిధంగా విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆర్ఎమ్ఓ డాక్టర్ డి.పద్మజను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. అనంతరం ఆమె స్థానంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ డిప్యూటి సివిల్ సర్జన్ డాక్టర్ డి.శంకర్‌కు అదనపు భాధ్యతలు అప్పగించారు. ఈక్రమంలోనే ఎర్రగడ్డ ఫుడ్ పాయిజున్ ఘటనలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా డైట్ కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డిపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈమేరకు ఆఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి రోగుల అస్వస్థతకు గురి కావడానికి గల కారణలపై దర్యాప్తును ముమ్మరం చేశారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పరిస్థితి విషమం

### ఎఐజి ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స



**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్(62) తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. గుండె సంబంధిత సమస్యతో గురువారం మధ్యాహ్నం మాగంటి గోపీనాథ్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వచ్చారు. ఆయనను వెంటనే ఐసీయూకు తరలించి చికిత్స ప్రారంభించారు. కాగా ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించినట్లు తెలుస్తోంది. అయితే ఆయన వెంటీలేటర్‌పై చికిత్స పొందుతు న్నారని, ప్రస్తుతం చికిత్సకు స్పందిస్తున్నారని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఆయన అనారోగ్యంపై వస్తున్న వందతులను కొట్టి పారేశారు.

గోపీనాథ్‌కు ఐసీయూలో 48 గంటల అబ్జర్వేషన్ కొనసాగు తోందని, ఆయన మృతిచెందారంటూ వస్తున్న వార్తలు అసత్యం అన్నారు. కాగా మాగంటి గోపీనాథ్ కొంతకాలంగా గుండె, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. కిడ్నీ సమస్య కూడా ఆయన అనారో గ్యానికి కారణమైంది. ఏఐజీ ఆసు పత్రిలో గతంలో చికిత్స తీసుకున్న ఆయన కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. గురువారం ఆయన ఉన్నట్టుండి అస్వస్థతకు గురికావ డంతో కుటుంబ సభ్యులు ఆయనను ఏఐజీ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు గోపీనాథ్ అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న బిఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున ఆసుపత్రికి తరలివచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, కే.పీ.వివేకానంద, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఇతర నాయకులు గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి చేరుకున్నారు. మాగంటి గోపీనాథ్ ప్రస్తుతం ఐసీయూలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని, ఆయన క్షేమంగా రావాలని హరీశ్ రావు ఆకాంక్షించారు. మాగంటి గోపీనాథ్ ప్రస్తుతం జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహిస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఆయన టీడీపీ తరపున, 2018, 2023లో బీఆర్ఎస్ తరపున గెలుపొందారు.

**వైద్యానికి స్పందిస్తున్నారు..**

మాగంటి గోపీనాథ్ క్రమంగా కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. ఎవరూ మానసిక ఆందోళన గురికావద్దని, మీడియా తప్పుడు సమాజాన్ని అందించవద్దని కోరారు. ఇప్పటివరకు ఆయనకు ఎలాంటి ఇబ్బంది లేదని, వైద్యానికి స్పందిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన కొన్ని పరిస్థితుల వల్ల మాగంటి గోపీనాథ్ కొంత ఒత్తిడి కి గురయ్యారని అన్నారు. ఆయన పూర్తి ఆరోగ్యంగా బయటకు రావాలని కోరుకుంటున్నామని, అందరూ పూజలు చేయాలని కోరారు. 48 గంటలు వైద్యుల పర్యవేక్షణలో మాగంటి ఉంటారని తెలిపారు.

# వియత్నాంలో కాగజ్‌నగర్ యువకుడు మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన అర్షిద్ అశ్రిత్(21) బుధవారం వియత్నాం దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. మార్కెట్ ఏరియాలో బట్టల దుకాణం నిర్వహిస్తున్న అర్జున్‌కు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు వియత్నాంలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్నాడు. వియత్నాంలోని తన ఇంటి నుంచి స్నేహితుడితో కలిసి 150 సీసీ బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి గోడను ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అశ్రిత్ స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. అశ్రిత్ మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# కదులుతున్న 'కల్తీ నెయ్యి' డొంక

### సిట్ దర్యాప్తులో మరిన్ని సాక్ష్యాధారాలు లభ్యం

### టిటిడి ఉద్యోగుల సమాచారం ఆధారంగా

### దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు

**తిరుమల, జూన్ 5, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన పాపంలో సిబిఐ సిట్ అధికారులు మరింత కీలకసమాచారం సేకరించడంతో సూత్రధా రులను పట్టుకునే దిశగా చర్యలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఉత్తరాఖండ్ బోలేబాబా




డెయిరీకి చెందిన షోమిల్‌జైన్‌కు అనుచరుడుగా ఉన్న కోల్‌కత్తాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామికవేత్త జ్యోతిష్యను సిట్ విచారణ చేస్తోంది. అయితే అవసరం మేరకు కొన్ని రకాలనూనెలు సరఫరా చేసినట్లు వివరాలు రాబట్టినా దీనికి సంబంధించి ఎక్కడా నగదు లావాదేవీలు జరగలేదనేది సిట్ రాబట్టిన సమాచారం. రెండురోజులుగా తిరుపతి అలిపిరిలోని తాత్కాలిక సిట్ కార్యాలయంలో మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి వ్యక్తిగత సహాయకుడు (పిఎ)అప్పన్న నుండి కొంత సమాచారం సేకరించిన సిట్ అధికారులు తదుపరి ముగ్గురు ప్రముఖులను విచారణకు తాఖీదులు పంపనున్నారు. ఇదే జరిగితే కల్తీనెయ్యిలో అసలు సూత్రధారులు బాగోతం వెలుగుచూడనుందనేది టిటిడిలో సంచలనంగా మారింది.

గతంలోనే బోలేబాబాడైరీ, ఏఆర్‌డైరీ, వైష్ణవిడైరీలకు సంబంధించి 15మంది వరకు ముఖ్యులైన మేనేజర్ల నుండి అధికారులు, ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్‌లు, అధికారులు, సిబ్బందిని సిట్ అరెస్టుచేసింది.

టిటిడికి గత మూడునాలుగేళ్ళలో నెయ్యిసరఫరాకు సంబంధించి అనుమతిలిచ్చిన అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పుడు బయటకు రానుంది. ఇప్పటికే కల్తీనెయ్యిలో నిందితులు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను కస్టడీకి తీసుకుని కీలకమైన ఆధారాలు రాబట్టింది. ఈ డైరీలకు కాంట్రాక్టు ఎలా కేటాయించారు, నెయ్యిసరఫరాలో ఏదేని మతలబు చేశారనేది ఈ కల్తీ పాపంలో కీలక సూత్రధారులను తేల్చే పనిలో సిబిఐ సిట్ అధికారులు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. గత ఏడాది జూన్‌లోనే లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనేది గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబరేటరీ(పరిశోధనశాల)నుండి ఆధారాలు బయటకు వచ్చాయి.ఆ ఫలితాల్లో నెయ్యికల్తీ అయిన మాట వాస్తవమేనని,అయితే కొన్ని రకాల ఆహారపదార్థాల నూనెలు కలిపారనేది టిటిడి అధికారులు కూడా నివేదికలు వెల్లడించారు.గత ఏడాదిలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఉన్నతాధికారులు తిరుమలలో నెయ్యి తీసుకోకుండా ఆ ట్యాంకర్లను వెనక్కుపంపిన విషయం విదితమే. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు ఏఆర్ డైరీ నెయ్యిట్యాంకర్లను తిప్పిపంపారు. మరీ జులైలో కల్తీనెయ్యి వ్యవహారం వెలుగుచూస్తే గత సెప్టెంబర్ వరకు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదనేది ఇప్పుడు సిట్ ప్రధానంగా దృష్టి సారించింది. దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది.ఎందుకు మూడేళ్ళు మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించారనేది ఇప్పుడు సిట్ కీలక దర్యాప్తులో వెలుగుచూడనుంది. కల్తీనెయ్యి కేసులో ఇప్పుడు విచారణ తుది దశకు చేరుకోవడంతో అసలు సూత్రధారుల అరెస్టు తప్పదనేది తెలుస్తోంది.

# అత్యాధునిక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్

## రూ.850 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు



**ప్లాట్‌ఫాంల సంఖ్య 12కు పెరిగే అవకాశం**

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే అత్యాధునీక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్ రూపుదిద్దుకుంటోంది. వచ్చే మూడు దశాబ్దాల్లో పెరగనున్న ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించేందుకు నీతి ఆయోగ్ పచ్చజెండా ఊపింది. రైల్వేస్టేషన్ తాజాగా కేటగిరి1లో చేరడంతో రూ.850 కోట్లతో పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రోజుకు 1.14 లక్షలు, రద్దీ వేళల్లో గంటకు 9,120 మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 2061 నాటికి రోజుకు 2 లక్షలకు చేరుతారనేది అంచనా. దానికి తగ్గట్టుగా రద్దీ సమయాల్లో ఒకేసారి 20 వేల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రధాన మార్గం వైపు మాత్రమే అభివృద్ధి అంతా సాగుతుండగా కొత్త రైల్వేస్టేషన్‌లో పశ్చిమం వైపు కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోనే కీలకమైన స్టేషన్ విజయవాడ. నిత్యం లక్ష మంది, పండగలు, సెలవు రోజుల్లో 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. 10 ప్లాట్‌ఫాంలున్న స్టేషన్ నుంచి నిత్యం 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు బండ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోనే ముఖ్యమైన రైల్వేజంక్షన్ కావడంతో ఆదాయంలోనూ అగ్రస్థానంలో ఉంటోంది.

చారిత్రక, వారసత్వ సంపద కలిగిన స్టేషన్‌గా, ఐదు ప్రవేశ ద్వారాలతో విజయవాడ అరుదైన గుర్తింపు పొందింది. ఏడాదికి వచ్చే ఆదాయం రూ.500 కోట్లు దాటడంతో గతేడాది బెజవాడ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ 1 హోదా సాధించింది.ప్రయాణికుల రాకపోకలు, వారికి అందుతున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వేస్టేషన్లను వివిధ కేటగిరీలుగా విభజిస్తుంది. ఏటా రూ. 500 కోట్ల కన్నా ఎక్కువ వార్షిక ఆదాయం లేదా 20 మిలియన్ల ప్రయాణికుల రాకపోకలు సాగించే స్టేషన్లకు ఎన్ఎస జీ 1 హోదా కేటగిరీ ఇస్తారు. ఢిల్లీ సహా కొన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఉన్న టాప్ రైల్వేస్టేషన్లకు మాత్రమే ఇప్పటి వరకు ఈ హోదా ఉండగా తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్ ఆ జాబితాల చేరింది. కేంద్ర ప్రభుత్వం విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఎన్ఎస్‌జీ 1 హోదా కేటాయించింది. రాష్ట్రంలో ఈ హోదా కలిగిన ఏకైక రైల్వేస్టేషన్ ఇదొక్కటే. ఎన్ఎస్ జీ 1 హోదా కోసం విజయవాడ రైల్వే స్టేషన్ చాలా ఏళ్లుగా పోటీపడుతోంది. 201718లో కేవలం రెండు ప్రమాణాల్లో వెనకబడిపోయి హోదా చేజార్చుకుంది. ఐదేళ్ల తర్వాత 202324 రైల్వే బోర్డు తాజా సమీక్షలో రూ. 528 కోట్ల వార్షిక ఆదాయంతో ఎన్ఎస్ జీ 1 హోదా ఒడిసిపట్టుకుంది. 202324లో దాదాపు 16.84 మిలియన్ల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. కొత్తగుర్తింపుతో దేశంలోని టాప్ 28 స్టేషన్లతో ఉన్న ఎలైట్ గ్రూప్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ చోటు దక్కించుకుంది. దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ తర్వాత ఎన్ఎస్ జీ 1 హోదా కలిగిన స్టేషన్ విజయవాడ మాత్రమే. ఇక్కడ ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

# ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు కిమ్ పూర్తి మద్దతు

**ప్యాంగ్యాంగ్, జూన్ 5 :** ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న సైనిక చర్య విషయంలో రష్యాకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మరోసారి స్పష్టం చేశారు. రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు పాంగ్యాంగ్‌లో కిమ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీవ్‌తో జరుగుతున్న పోరులో రష్యాకు తాము బేషరతుగా మద్దతునిస్తున్నామని కిమ్ పునరుద్ఘాటించినట్లు ఉత్తర కొరియా వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం సహా అన్ని కీలకమైన అంతర్జాతీయ రాజకీయ సమస్యలలో రష్యా వైఖరినీ, ఆ దేశ విదేశాంగ విధానాలకు ఉత్తర కొరియా బేషరతుగా మద్దతు ఇస్తోందని కిమ్ జోంగ్ ఉన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో



ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకోవడం, కుర్స్క్ ప్రాంత పునర్‌నిర్మాణ అంశంతో పాటు పలు ఇతర విషయాలపై నేతలు చర్చించుకున్నారని సమాచారం.షోయిగు ఈ ఏడాది ఉత్తర కొరియాలో పర్యటించడం ఇది రెండోసారి. మార్చి నెలలో కూడా ఆయన కిమ్‌తో భేటీ అయ్యారు. ఆ సమయంలోనూ రష్యా తన సార్వభౌమాధికారాన్ని, ప్రాంతీయ సమగ్రతను కాపాడుకునేందుకు చేస్తున్న పోరాటానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని కిమ్ హామీ ఇచ్చారు. కాగా, రష్యా తరపున తమ సైనిక బలగాలు ఉక్రెయిన్ సైన్యంతో పోరాడుతున్నాయన్న విషయాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్తర కొరియా ధృవీకరించింది. దీనికి కొద్ది రోజుల ముందే రష్యా కూడా ఈ విషయాన్ని బయటపెట్టింది. ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర రక్షణ ఒప్పందంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఇరు పక్షాలు పేర్కొన్నాయి. అయితే ఎంతమంది సైనికులు ఈ పోరులో పాల్గొంటున్నారనే కచ్చితమైన సంఖ్యను వెల్లడించలేదు. సుమారు 10,000 నుంచి 12,000 మంది ఉత్తర కొరియా సైనికులు ఉండవచ్చని ఉక్రెయిన్ నిఘా వర్గాలు, దక్షిణ కొరియా అధికారులు గతంలో అంచనా వేశారు.

# ఫీజుల పేరుతో విద్యార్థులను అవమానించడం నేరమే

### ద్వారక ఢిల్లీ పబ్లిక్‌స్కూలుపై హైకోర్టు అసహనం

**న్యూఢిల్లీ, జూన్ 5 :** ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెనక్కి తగ్గింది. ఫీజు వివాదం నేపథ్యంలో 32 మంది విద్యార్థుల సస్పెన్షన్‌ను రద్దు చేసింది. ఢిల్లీ హైకోర్టుకు ఈ మేరకు సమాచారం ఇచ్చింది. పెరిగిన ఫీజులు చెల్లించనందుకు 32 మంది విద్యార్థులను ద్వారకలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సస్పెండ్ చేసింది. దీంతో ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమోదించని ఫీజులను వసూలు చేస్తున్నారని, గతంలో ఉన్న నెలవారీ ఫీజు రూ.7,000 నుంచి రూ. 9,000కు పెంచారని ఆరోపించారు.కాగా, పేరెంట్స్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సచిన్ దత్తా తీర్పును ప్రకటించనున్న తరుణంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వెనక్కి తగ్గింది. 'విద్యార్థులను తొలగించిన సస్పెన్షన్ ఉత్తర్వును మేం ఉపసంహరిం చుకున్నాం. ఆ మేరకు అఫిడవిట్ కూడా దాఖలు చేశాం' అని స్కూల్ తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. మరోవైపు స్కూల్ జాబితా నుంచి తొలగించిన 32 మంది విద్యార్థులను వెంటనే తిరిగి చేర్చుకోవాలని




ద్వారకా ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు విద్యా శాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది. స్కూల్ చర్యలు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించాయని, విద్యా శాఖ అనుమతి లేకుండా ఫీజు పెంపు నిషేధమని, ఫీజు సమస్యల పరంగా విద్యార్థులపై ఎలాంటి వివక్ష చూపకూడదని ఆ ఉత్తర్వులో పేర్కొంది. అయితే ఢిల్లీ హైకోర్టు డిపిఎస్ ద్వారకపై ఆగ్రహం వ్యక్తంచేసింది. డబ్బుల కోసం విద్యార్థులను బహిరంగంగా అవమా నించడం సరికాదని వ్యాఖ్యలు చేసింది. పాఠ శాలలు వాణిజ్య సంస్థల్లా వ్యవహరించకూడదని, విద్యార్థులను లోపలికి రానివ్వకుండాచేయడం విద్యాసంస్థల ప్రాథమిక ధర్మానికి విరుద్ధమని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు విలువలు కూడా నేర్పించడం ప్రధానవిధి అని పాఠశాల ఫీజుల చెల్లింపునకు సంబంధించి కోర్టు జారీచేసే ఆదేశాలు తల్లితండ్రులు తప్పక పాటించాలని న్యాయస్థానం పిల్లల తల్లితండ్రులకు కూడా సూచించింది

# ఆర్మీ కాన్వాయ్‌పై బెలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడి

### ఐదుగురు సైనికుల హత్య

**ముజఫరాబాద్, జూన్ 5:** పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో సింధ్ బెలూచిస్తాన్‌లోని బిఎల్ఎ మిలిటెంట్లు దాడిచేయడంతో ఐదుగురు పాక్ రేంజర్స్ సైనికులు మృతిచెందారు. బెలూచ్ లిబరేషన్ ఆర్మీ, విముక్తి పోరాట యోధులు రెండు వేరువేరు చోట్ల దాడులుజరిపారు. జమురాన్, క్వెట్టాల్లో జరిపిన దాడుల్లో మొత్తం ఐదుగురిని అంతంచేసినట్లు ప్రకటించుకున్నాయి. పాకిస్తానీ ఆర్మీ కాన్వాయ్‌ను చుట్టుముట్టి కాల్పులు జరిపారు. కెచ్ ప్రాంతంలోని జమురాన్‌పరిధిలోకి వచ్చే కుంద్ కాప్రాన్‌ప్రాంతంలో ఈ దాడిజరిగిందని బిఎల్ఎ ప్రకటించింది. రెండు ఆర్మీ వాహనాలను ధ్వంసంచేసామని ప్రకటించుకున్నాయి. ఈ దాడికారణంగానే స్పాట్‌లోనే ఐదుగురు సైనికులు చనిపోయారు. మరికొందరు పాక్‌రేంజర్ విభాగానికి చెందిన సిబ్బంది తీవ్ర గాయాలపాలయినట్లు ప్రకటించారు.


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ

భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, భద్రాచలం పరిధిలో O&M పనుల నిమిత్తము టెండర్ నోటీసు నం. 13/2025-26, తేది: 23.05.2025 (రెండవ పిలుపు), మరియు టెండర్ నోటీసు నం. 14/2025-26, తేది: 24.05.2025 (రెండవ పిలుపు)లో అంచనా విలువ మొత్తం: రూ.77.71 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్లు తేది: 05.06.2025 మ.03.30 గం.ల నుండి తేది: 12.06.2025 మ.03.30 గం.ల వరకు. గమనిక: మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడగలరు.
సం/- టి.ఎస్.ఎస్.రవి కుమార్, యం.టెక్, యం.ఐ.ఇ, సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, భద్రాచలం
DIPR.No.3187-PP/CL/Advt/1/2025-26, తేది: 05.06.2025


ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను కలిగి ఉండడాన్ని సామర్థ్యం అంటారు.

-హెచ్.గిల్బర్స్

# పర్యావరణంతో పరాచికాలా?


విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకు వస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి,చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగి పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం అత్యంత దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు కూడా చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు నుంచి మొదలు పెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్నివిధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో చేసే కార్యక్రమం కోసం నిత్యం అన్వేషణ కొనసాగుతున్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత్ జనాభా 145 కోట్లకు చేరుకోవడానికి ఇంకా ఎక్కువ కాలం పట్టదని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నదని, ప్రధానంగా అటవీ సంపద వేగంగా హరించుకుపోతున్నదని స్పష్టం చేసింది. భారత్‌లో రోజుకు దాదాపు మూడువందల ముప్పైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదికలో వివరించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకం నియంత్రించలేకపోతున్నారు. దీనివల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవికాగితాలకే పరిమితమైపోతున్నాయి. ఇక పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాల్ వాడకం గూర్చి చెప్పక్కరలేదు. వాహన కాలుష్యనియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. వీటితోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ వాయుకాలుష్యాన్ని పెంచుతున్నది. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు పడకపోడం అకాలంలో భారీ వర్షాలు ఒకేసారి, ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం లాంటివి ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. వ్యవసాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. అంతేకాదు వరదలు, తుఫాన్‌లతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతంఈశాన్య రాష్ట్రాలను అధికవర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరం, నాగాలాండ్, మేఘాలయాల్లో కుంభవృష్టి కురిసింది. ఫలితంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ వర్షపు బీభత్సానికి ఇప్పటికే నలభై మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. యేటాదాదాపు మూడువందల ఎనభైకిపైగా ప్రపంచ వ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార లెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాలతో యేటా లక్షలాది మంది ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇటీవల పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నారు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పొచ్చు. ఆర్థికంగానో,సాంకేతిక పరంగానో ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. భారీ వరదలతో ఎల్లోనదీ ఉగ్రరూపం దాల్చి నగరాలకు నగరాలనే ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈపరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. మొన్న బెంగళూర్ నగరం, నిన్న ముంబయి విపత్కరల పరిస్థితులను ఎదుర్కొన్నాయి. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు,పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సి ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంచేసినా ఇలాంటి ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

> గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు, గౌరవాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.



అరిస్టాటిల్

> ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితాలను ఇస్తుంది.



కె.స్టాన్‌స్లావిస్కి

# ప్రజావాక్కు



## యువతను ఆకర్షిస్తున్న డిజిటల్ విప్లవం

ఆధునిక డిజిటల్ విప్లవంతో ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. సమాచార మార్పిడిలో వేగం పెరిగింది. కానీ ఇదే డిజిటల్ ప్రపంచం నేటి యువతను, చిన్నారులను ప్రమాదకరమైన మార్గాలవైపు నడిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా, ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లలో అశ్లీల కంటెంట్ విపరీతంగా పెరిగిపోతుండటం ఆందోళనకరం. టీనేజర్ వయసులోనే లైంగిక ఆలోచనలు పెరగడం, అమ్మాయిలను వస్తువుల్లా చూడ దంవంటి పరిణామాలు ఆవిష్కృతమవుతున్నాయి. చిన్నా రులు కూడా మొబైల్ ద్వారా ఈ విషపూరిత కంటెంట్‌కు చేరువ అవుతుండటం మరింత భయంకరం. ఇది దేశ భవిష్యత్తుకు ముప్పు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పల్లెల్లో ఊపందుకోనున్న రాజకీయం

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి.ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్,ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పల్లెల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులు చొరవ చూపుతున్నారు.గ్రామాలలో మహిళాసంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలతో నిత్యం సమావేశమవుతున్నారు.

- సింగు లక్ష్మీనారాయణ, జయశంకర్ భూపాలపల్లి

## ఫీజుల పెంపు సమంజసం కాదు

ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ఫీజులు,పుస్తకాలు, యూనిఫాం,బ్యాగులు ఇతరసామగ్రి కొనాలంటే తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాఠశాలలపై నియంత్రణ లేకపోవడంతో ఫీజుల భారం పెరిగింది.ఏడాది సంపాదనంతా బడికే అని వాపోతున్నారు. కుటుంబంలో ఇద్దరు విద్యార్థులుంటే అంతే. దాదాపు రూ. లక్ష వరకు భారం పడుతోంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ విధించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లిజిల్లా

## ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వారు తహసిల్ పౌర సరఫరాల మొదలగు ప్రాథమిక పరిపాలన కార్యాలయాలు చాలా వరకు అధ్వాన్న స్థితిలో ఉన్నవి. ఈ భవనాలను శుభ్రపరచకపోవడం వలన అత్యంత భయంకర దృశ్యంగా కనిపిస్తుంటాయి. సున్నం రంగులు వేసినట్టు కనిపించడం లేదు. కిటికీలు తలుపులు మరీ దారుణంగా ఉన్నాయి. మూత్రశాలలు అధ్వాన్నస్థితిలో ఉన్నవి. కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్ల మార్గం నుండి పోవడం గగనంగా మారుతున్నది. కార్యాలయాల ఫర్నిచర్ ఇక్ష్వాకుల కాలంనాటివి ఇంకా ఉపయోగిస్తున్నారు. ఫైల్స్ భద్రపరచడానికి సరైన వ్యవస్థ లేదు. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి.ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారధులైన ఈ కేంద్రాల ఆలనాపాలన పట్టించుకోకపోవడం శోచనీయం.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## సైనికులను ఆదుకోవాలి

యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు సర్వ లాంఛనాలతో ప్రభుత్వ ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం గౌరవప్రదమైన సంస్కారం. యుద్ధాలలో పాల్గొని ప్రాణాలతో బయట పడ్డవారిని పట్టించుకునేదెవరు? వీరికి ఠంచనుగా పెన్షను యిస్తున్నారు. వీరిలో చాలామంది బయటకు వచ్చిన తరువాత సరైన ఉద్యోగాలురాక చిన్నాచితక కొలువులు చేసుకుంటూ సంసారాలను ఇడ్చుకొస్తున్నారు. యుద్ధ భూమిలో మరణించిన వారికి మాత్రం భార్యలకు ప్రభుత్వ పెన్షన్‌తోబాటు గుత్తగా అధికమొత్తం ఇవ్వడం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, కొన్ని వందల గజాలస్థలాన్ని ఉచితంగా ఇస్తున్నారు.యుద్ధాల్లో వీరోచితంగా పోరాడి ప్రాణాలతో బయట పడినవారికి రిక్తహస్తాలే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రజా ప్రతినిధులకు విద్యార్హతలు నిర్ణయించాలి

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికలలో ఎన్నికయ్యే ప్రజా ప్రతినిధులకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటుగా విద్య అర్హతలను కూడా నిర్ణయించాలి.పదవతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి విద్య అర్హతలను ప్రజా ప్రతినిధుల గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, హోదాలను బట్టి విద్యా అర్హతలను నిర్ణయించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిందే

**విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత,విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమర్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ యాజమాన్యాల కింద పనిచేస్తున్న ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించిన స్థాయిలో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు శాతం క్రమక్రమంగా తగ్గుతూ పోతున్నాయన్న విషయాన్ని విద్యాశాఖ గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుండి ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల స్థాయివరకు తరగతి గదికి అనువైనటువంటి విద్యార్థుల సంఖ్య లేని పాఠశాలలే ఎక్కువగా గోచరిస్తుండడం విశేషం. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల శాతమే ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా ఉంటుందనే భిన్న వాదనలు లేకపోలేదు. దీని కారణం గ్రామీణ, పట్టణ ప్రాంతాలు మొదలుకొని కనీస ఆర్థిక పరిస్థితులు ఉన్న కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల అనాసక్తి చూపడం, ప్రభుత్వ బడిలో తమ పిల్లల్ని చదివించడం అంటే కొందరు తమ హోదాకు దర్పణంగా లేదనే భావించేవారు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. మరికొందరిలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలపై అవగాహన లేకపోవడం, ప్రభుత్వ పాఠశాల ఆవశ్యకత గుర్తించలేకపోవడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడానికి కారణమైన ఉండొచ్చు అని భావన కొందరిలో లేకపోలేదు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు కలిగి అత్యున్నతమైన అనుభవం కలిగినటువంటి ఉపాధ్యాయులు ఉండడం, విశాలమైన క్రీడా ప్రాంగణం క్రీడా సామాగ్రి, సైన్స్ ప్రయోగశాల పరికరాలు,ప్రయోగశాల గదులు సరిపడా, తరగతి బోధనా గదులతో, మంచినీటి సౌకర్యం, బాల బాలికలకు వేరువేరు సానిటేషన్ వ్యవస్థలతో పాటు మౌలిక వసతులను సాధ్యమైనంత త్వరితగతిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గణనీయంగా ఉన్నతీకరించబడుతుండటం శుభ సూచకమే. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యావ్యవస్థకు పటిష్టమైనటువంటి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలతో సమావేశాన్ని నిర్వహిస్తుండడం, ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక బడిబాట లాంటి కార్యాచరణను చేపట్టడం గమనార్హం. ఈ క్రమంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచే విధంగా విషయ బోధన అభ్యసనలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం అనేక కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యంతో పాటు తరగతి గదులకు ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసిన సందర్భంలో వీటిని విషయ బోధనలో వినియోగించేందుకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని బోధన ఉపాధ్యాయులకు కావలసిన వృత్యాంతర శిక్షణ కార్యక్రమాలను



ఇటీవల ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించింది. అంతేకాకుండా ప్రభుత్వం కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నాణ్యమైన తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాల్లో మెరుగైన విద్యా బోధనతో సహా పాఠ్యాంశాలతో పాటు పౌష్టికాహార విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ, డాక్టర్లచే వైద్యపరీక్షలు నైతిక విలువలతో కూడిన మార్గదర్శకత యోగ అభ్యసనం, క్రీడలు సైన్సు సాహిత్య, సంస్కృతి కార్యక్రమాలలో అభిరుచి కలిగించడం, కంప్యూటర్ల వాడకం,అభ్యసనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన కల్పించడం ఇలాంటి అనేక సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్నప్పటికీ, కారణాలేవైనా ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల సంఖ్య మాత్రం ఒక్క సెక్షన్‌కే పరిమితమై ఉండడం గాని అంతకంటే తక్కువగానే ఉండడం శోచనీయం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మండలానికి ఒక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలతో పాటు సంక్షేమ హాస్టల్ కూడా విస్తరించడంతో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీటిపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. అలాంటప్పుడు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా నిలదొక్కుకుంటాయో అనే సందేహాలు కలగకమానవు. ముఖ్యంగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రైవేటు పాఠశాలలు ఎక్కువ అవుతుండడం ప్రాథమిక స్థాయి చదివే పిల్లలు ఎక్కువ శాతం ప్రవేట్ స్కూల్ వైపు ఆసక్తి చూపిస్తుండడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చాలావరకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. తద్వారా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉనికి అంతంత మాత్రంగానే ఉంటుంది. కారణాలేవైనా ప్రభుత్వ విద్యాశాఖ విద్యార్థులు చదువు కొరకు అనేక కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశాల ద్వారా, బడిబాట కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తెలియచేయాలి.ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అన్ని వర్గాల వారితో పాటు ఉపాధ్యాయుల సహకారంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏది ఏమైనప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత,విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు. •

# ప్రభుత్వానికి భూములిస్తే రైతులకు లాభదాయకమే!

గరిమెళ్ల రామకృష్ణ

అమరావతి రాజధాని చుట్టూ మరింత భూసేకరణపై భిన్న వాదనలు చేస్తున్నారు. రైతుల కోణం నుంచి చూస్తే భూమిని ప్రభుత్వ అవసరాల కోసం ఇవ్వడమే ఉత్తమం! ఒక్క అమరావతి ప్రాంతంలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ భూసేకరణ జరిగినా రైతులు తమకు ఆమోదయోగ్యమైన రీతిలో ప్రభుత్వానికి ఇవ్వడమే రైతులకు మేలు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వార్తలు నిత్యం పత్రికల్లో చూస్తున్నాం! వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం. ఈ జూదంలో ఓటమే కానీ గెలుపు లేదు! ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఎన్ని మాటలు చెప్పినా రైతుల తలరాతను మార్చే పరిస్థితి లేదు. విత్తనం దగ్గర నుంచి పండించిన పంట అమ్మే వరకు రైతులు కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన దుస్థితి నెలకొంది. పంటల బీమా వంటి పథకాల వలన రైతులకు పెద్దగా ఒరిగింది కూడా లేదు. ఏ పంట వేస్తే గిట్టుబాటు ధర వస్తుందో ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే ఒక సమగ్ర విభాగం మన వ్యవసాయ శాఖలో లేని పెద్దలోపం! ప్రభుత్వాలు కూడా రైతులకు న్యాయం చేసే పరిస్థితి లేదు. రాజకీయ పక్షాలు కార్పొరేట్ వర్గాలు ఇచ్చే విరాళాలతోనే మనుగడ కొనసాగిస్తున్న నేపథ్యంలో పాలకులు వాళ్లకు వ్యతిరేకంగా కానీ నష్టం కలిగే విధంగా కానీ నిర్ణయాలు చేయలేరు. చట్టాలు చేసినా, మద్దతు ధరలు ప్రకటించినా అమల్లో పూర్తిగా వైఫల్యమే! భూములు కోల్పోయిన రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించమని పాలకులను



కోరవచ్చు. అది కొంతవరకు సాధ్యం అవుతుంది కూడా. భూములు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా రైతులు షరతులు పెట్టవచ్చు. అలా ఉద్యోగాలు అవసరం లేనివారు, అవకాశం లేని కుటుంబాల వారు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. వ్యవసాయంపై ఆసక్తి, చేయగల సత్తా కలవారు కొత్తగా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందే ప్రాంతాలను అధ్యయనం చేసి, గుర్తించి, చౌకధరల్లో భూములు కొనుగోలు చేసి వ్యవసాయం కొనసాగించవచ్చు. ఈ విధానం, ఒరవడి నిజాం నవాబు పాలన కాలం నుంచి ఉన్నదే! ఇక రాజధాని ప్రాంతంలోని రైతులు రాజధాని నిర్మాణం, అందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అనుమానాలు, ఆందోళన పడవలసిన అవసరం లేదు. జరుగుతున్న పరిణామాలు తమకు మేలు చేస్తాయన్న సానుకూల దృక్పథంతో ముందుకు రావాలి. ఈ సందర్భంగా రైతులు 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించే వరకు తమ పిల్లలకు వివాహం జరిపించడం కూడా కష్టంగా ఉందన్న దైన్యస్థితి బహిరంగంగా చెప్పుకున్న వైనం మరచిపోకూడదు! ఇదే సందర్భంలో కొంతమంది దుర్బుద్ధి, దురాలోచనతో చెప్పే తప్పుడు మాటలను రైతులు నమ్మిమోసపోకూడదు! హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల మాదిరి అమరావతి కూడా బహుముఖంగా అభివృద్ధి చెందుతుంది. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు తప్పనిసరి. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టిగా కృషి చేస్తున్న పరిస్థితి స్పష్టంగా కనబడుతోంది. పలు అంతర్జాతీయ సంస్థలు ఆయనపై నమ్మకం, విశ్వాసంతో ముందుకు వస్తున్నాయి. ఇందుకు రైతుల సహకారంతోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు.అంతిమంగా అభివృద్ధి ఫలాలు రైతులకు కూడా దక్కుతాయి! •

# ట్రంప్ ఆర్థిక దోపిడి విధానాలతో ఆందోళన



డాక్టర్ కత్తి పద్మారావు

డొనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత ఆయన దుందుడుకు చర్యలకు అమెరికా అంతర్గతంగాను, అమెరికా బయట దేశాలు అతలాకుతలం అవుతున్నాయి.డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచానికి అమెరికా మరింత వేగంగా దూరమైపోతోంది. ఆర్థిక, విదేశాంగవిధానాలూ, సైనిక వ్యూహంలో మార్పులు వస్తున్నాయి. ట్రంప్ నేడు ప్రపంచ దేశాలన్నింటిపై ప్రతీకార సుంకాలు విధిస్తానంటున్నారు. పనామా కాల్వను, గ్రీన్లాండ్ను స్వాధీనం చేసుకుంటామన్నారు.కెనడా, మెక్సికోలు తమ దేశంలో కలిసిపోవాలనీ, గాజా నుంచి పాలస్తీనీయులు వెళ్లిపోవాలనీ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి వలసదారులను వెళ్లగొడతామంటూ గగ్గోలు రేపారు. ఇజ్రాయేల్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు ఏకంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనే ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు ట్రంప్! ఉక్రెయిన్‌కు సాయం చేస్తూపోతే మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనడం, ఇంతవరకు చేసిన సాయానికి ప్రతిగా ఆ దేశంలోని అరుదైన ఖనిజవనరులను తనకివ్వాలని ఆయన డిమాండ్ చేయడం ప్రపంచాన్ని నివ్వెరపరచింది. అన్నిదేశాల మీద సుంకాలు విధిస్తున్న విధానానికి ప్రపంచ దేశాలు అన్నికూడా విస్తుపోతున్నాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బాంబు పేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలువడ్డించారు. భారతదేశ ఉత్పత్తులపై 26శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34 శాతం, యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై 20శాతం, స్విట్జర్లాండ్‌పై 31, తైవాన్‌పై 32, జపాన్‌పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని 'విముక్తి దినం'గా ప్రకటించారు. ఈ విషయంగా ఆయన పన్నులు ప్రకటించకముందే ప్రపంచ దేశాల ఆర్థిక శాస్త్రవేత్తలంతా అనేక రూపాల్లో ఈ విషయాలను వెల్లడిస్తూనే వచ్చారు. వారు ఈ విధానాల వల్ల అమెరికా కూడా ఒంటరైపోతుందని, అమెరికాలోని ప్రజలు కూడా సంక్షోభానికి గురవుతారని ఒక వారంగా అనేక విశ్లేషణలు ఇలా వెలువడుతూనే వచ్చాయి. ట్రంప్ ఈసారి 1.4 లక్షల కోట్ల డాలర్ల విలువైన సుంకాలను పెంచేందుకు రంగం సిద్ధం చేస్తుండటం ఇండియానే కాదు, మొత్తం ప్రపంచ ఆర్థిక రంగాన్నే తీవ్రంగా ప్రభావితం చేయనుంది! విదేశాల నుంచి అమెరికా చేసుకున్న మొత్తం దిగుమతుల విలువ నిరుడు 6.6శాతం మేర పెరిగి 4.1 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అదే సమయంలో ఆ దేశ వస్తుసేవల ఎగుమతులేమో 3.2 లక్షల కోట్ల డాలర్లకే పరిమితమయ్యాయి. చైనా,వియత్నాం, మెక్సికో, తైవాన్, జపాన్, కెనడా, దక్షిణ కొరియా, ఇండియా, థాయ్‌లాండ్ తదితరాలతో పాటు యూరోపియన్ యూనియన్ దేశాలతోనూ అమెరికాకు భారీ వాణిజ్యలోటు ఉంది. దాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న డొనాల్డ్ ట్రంప్ దిగు



మతులపై ప్రతీకార సుంకాల ద్వారా వేలకోట్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. తన ఎన్నికల వాగ్దానమైన పన్నుల కోతలను అమలు చేయడానికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు. కానీ, ఆక్రమంలో ఆయన అమెరికాను ఏకాకిని చేస్తున్నారు.ఇప్పటికే ట్రంప్ విధించిన సుంకాలను ఎదుర్కోవడానికి చైనా, జపాన్, దక్షిణ కొరియా ఏకతాటిపైకి వస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈయూ దేశాలు సైతం గట్టిగా ప్రతిస్పందించడానికి సంసిద్ధమవుతున్నాయి. ఏతావతా అగ్రరాజ్య పరపతిని పణంగా పెట్టి మరీ ట్రంప్ ఆడుతున్న సుంకాల చదరంగం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో చూడాలి! దగ్గర దగ్గర ప్రపంచంలో ఉన్న ఏ ఆర్థిక మేధావి కూడా అమెరికాకు అనుకూలంగా ఒక్కవాక్యం కూడా రాయడం లేదు అనేది స్పష్టమైన అంశం. నిజానికి అమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న 'పది' ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి. అంతేకాక ఇప్పుడు అమెరికా అధ్యక్షునిపై అక్కడ వాణిజ్య సంస్థల భాగస్వామ్యం ఒత్తిడి కూడా బలంగానే ఉంది. ఈవిషయంగా వాషింగ్టన్ ఒక కథనాన్ని కూడా ప్రచురించింది. ఆ కథనం ఇలా ఉంది. అమెరికా ఎగుమతులను పెంచేందుకు, టారిఫ్స్, నాన్ టారిఫ్ల, నియంత్రణ అడ్డంకులను తగ్గించాలని భారత్ను ఒత్తిడి చేయాల్సిందిగా అమెరికా పరిశ్రమ సంఘాలు, కంపెనీలు ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాయి. యుఎస్ చాంబర్ ఆఫ్‌కామర్స్ (యుఎస్సిసి), కొలైషన్ ఆఫ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ (సిఎస్‌ఐఐ) ప్రముఖ బైక్ కంపెనీ హార్లే డేవిడ్సన్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఏప్రిల్ 2న పరస్పర సుంకాల విధింపు ప్రకటనకు ముందు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యుఎస్‌ఆర్)కి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. భాగస్వామ్య దేశాల చట్టవ్యతిరేక వాణిజ్య పద్ధతులపై యుఎస్టిఆర్ ఇటీవల సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. భారత వినియోగదారులకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలకు పొందేందుకు వీలుగా ఆరోగ్య సంరక్షణ రంగంలో వాణిజ్యాన్ని పెట్టుబడులను ప్రోత్సహించేలా ఔషధ తయారీ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాలని అమెరికాలోని అతిపెద్ద వాణిజ్య సంప్రదింపుల సంస్థ యుఎస్ఎస్సిసి కోరింది. ప్రపంచ సరఫరా గొలుసును బలోపేతం చేసే ఔషధ తయారీకి రెండవ స్థానంలోకి అనుమతించే నిబంధనలను చేర్చడానికి అవసరమైన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కోరింది. పేటెంట్ పొందిన మందులు, స్టెంట్లు, వైద్య పరికరాలపై జాతీయ ప్రాముఖ్య మెడిసిన్స్ జాబితా కింద ధరల నియంత్రణను, భారత్లో మెడిసిన్ తయారీ ఉత్పత్తుల పెట్టుబడులను నిరోధించే వాణిజ్య విధానాలను, నకిలీ మెడిసిన్ ముప్పును కూడా యుఎస్సిసి ప్రస్తావించింది. సిటిస్కానర్లు, ఇతర అధునాతన శస్త్రచికిత్సకు అవసరమైన పునరుద్ధరించబడిన పునర్వినియోగించే వైద్య పరికరాల దిగుమతిని భారత్ అనుమతించాలని కోరింది. అమెరికన్ కంపెనీల లాభదాయకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే సిన్ /డిమెరిట్ వస్తువుల వర్గీకరణ కింద ఆల్కహాల్ లేని పానీయాలపై 28 శాతం జీఎస్టిని తగ్గించాలని యుఎస్సిసి కోరింది. అమెరికా నిజానికి ప్రపంచ దేశాలకు ఎన్నో సాంకేతిక అంశాలను, సాంస్కృతిక విస్తృత అంశాలను నేర్పిందనే వాదన కూడా ఉంది. సాంకేతికంగా ప్రపంచానికి అనేక పరికరాలు అందించగలిగిన స్థాయిలో వుంది. అయితే నేడు ఇవన్నీ తిరగబడుతున్నాయి. ట్రంప్ పాలనలోని 'అమెరికా ఫస్ట్' విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. భారతదేశం ఇలాంటి ఒడిదుడుకులను ఎన్నింటినో ఎదుర్కొంది. ఎంతోమంది ప్రపంచనియంతలను చూసింది. భారతదేశం చేయాల్సిన పని దేశీయ సంపదను పెంచుకోవడం చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్,కెనడా వంటి దేశాలతో సంబంధాలను మరింతగా మెరుగుపరచుకోవడం భారతదేశంలో వున్న మేధావులకు, విద్యావంతులకు, సాంకేతిక పరిజ్ఞానులకు అవకాశాలు మెరుగుపరచుకోవడం. భారత దేశ ఔన్నతిని పునరుజ్జీవన శక్తితో అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగ స్ఫూర్తితో మహోజ్వలమైన జాతీయ భావనతో ముందుకు నడవవలసిన చారిత్రక సందర్భం ఇది. ఆ దిశగా ముందుకు నడుద్దాం. •

# 19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు

## ఉత్తర్వులు జారీచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధానకారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితులు వర్తిస్తాయి. పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విషయంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు. 2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది. కాగా, 2017లో ట్రంప్ విధించిన ప్రయాణ నిషేధం, ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలను లక్ష్యంగాచేసుకున్నప్పుడు అనేక న్యాయ స్థానాల్లో సవాళ్లను ఎదుర్కొంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి న్యాయ పరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు నెలల తరబడి జాగ్రత్తగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటువంటి ఆంక్షలు విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని ట్రంప్ వర్సెస్ హవాయి కేసులో సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిందని వైట్ హౌస్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ గుర్తు చేసింది. అయితే, ఈ కొత్త ప్రయాణ నిషేధంనుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు గ్రీన్ కార్డ్ హోల్డర్లు, ఇప్పటికే వీసాలు కలిగి ఉన్న వారు, కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీల వారికి, అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమైన వ్యక్తుల ప్రవేశానికిమినహాయింపులు కల్పించారు. ఈ చర్యను అధ్యక్షుడు ట్రంప్ విదేశీ తీవ్రవాదులు, ఇతర జాతీయ భద్రత, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే వారినుంచి అమెరికాను రక్షించడానికి ఉద్దేశించిన సాధారణ భద్రతా ప్రమాణాలు అని వివరించారు.

## బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్

**ముర్షిదాబాద్, జూన్ 4:** సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఓ జవాన్‌ను బంగ్లాదేశ్ వాసులు కిడ్నాప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ బీఎస్ఎఫ్ జవాన్‌ను బంగ్లాదేశీయులు కిడ్నాప్ చేసి అతడిని బందీగా ఉంచారు. కొన్ని గంటల తర్వాత అతడిని విడుదల చేశారు. నుర్పుర్ జిల్లాలోని కథాలియా అనే గ్రామం దగ్గర ఉన్న అంతర్జాతీయ సరిహద్దు దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. సుతిర బీఎస్ఎఫ్ క్యాంప్ సమీపంలోని చాందనిచౌక్ దగ్గర గల అంతర్జాతీయ సరిహద్దు నుంచి కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిని ఆ బిఎస్ఎఫ్ జవాన్ అడ్డుకున్నాడు. దాంతో అతడిని ఆ ముష్కరులు కిడ్నాప్ చేసి బందీ చేశారు. వారందరూ బంగ్లాదేశ్‌లోని చపాయ్ నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన వారేనని తెలుస్తోంది. బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్ అయిన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని గంటల్లోనే ఆ జవాన్‌ను ముష్కరులు విడిచిపెట్టేశారు. ప్రస్తుతం ఆ జవాన్ క్షేమంగానే ఉన్నాడని సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ బిఎస్ఎఫ్ వెల్లడించింది. అయితే ఈ కిడ్నాప్ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# తల్లిదండ్రులను పట్టించుకోని సంతానంపై కఠినచర్యలకు ప్రత్యేక చట్టం

## అసోం ప్రభుత్వం 2017 చట్టం పూర్తి స్థాయిలో అమలు



**గువాహతి, జూన్ 5:** అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2017లో తీసుకువచ్చిన ప్రాణం చట్టం అనేది ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు, దివ్యాంగ సోదరుల సంరక్షణ కోసం తీసుకువచ్చిన ప్రత్యేక చట్టం. ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న సంస్థలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , కంపెనీ చట్టం ప్రకారం నిర్వచించిన ప్రభుత్వ కంపెనీలు వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై వర్తిస్తుంది. ఈ చట్టం ద్వారా ఉద్యోగులపై తల్లిదండ్రుల పట్ల బాధ్యతను చట్టబద్ధంగా విధించడం జరిగింది. ఈ చట్టం ఎందుకు అవసరమైంది, సామాజిక మార్పులు, పట్టణీకరణ పెరగడంతో కుటుంబ వ్యవస్థలో మార్పులు వస్తున్నాయి. పెద్దలు కొడుకులపై ఆధారపడే పరిస్థితుల్లో, కొంతమంది వారి బాధ్యతను తేలికగా తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అనాధుల్లా మారకూడదన్న ఉద్దేశంతో అసోం ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది కేవలం కుటుంబ విలువలను పరిరక్షించడమే కాదు, ఉద్యోగులను ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా చేస్తుంది. ఈ చట్టం అన్ని స్థాయి ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, ప్రభుత్వ అనుబంధం ఉన్న సంస్థల్లో, కంపెనీ చట్టం కింద ఉన్న సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఈ ఉద్యోగులపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు, వివాహం కాని దివ్యాంగ సోదరులు ఈ చట్టం ద్వారా రక్షణ పొందవచ్చు. ఉద్యోగిపై ఆధారపడే తల్లిదండ్రులు లేదా దివ్యాంగ సోదరులు ఈ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చు. ఉద్యోగి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, లేదా మౌలిక అవసరాలు కలిగించకపోతే, వారు అధికారుల వద్ద రాయితీగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం "ఆధారిత తల్లిదండ్రులు" అంటే తమకు ఆదాయ మార్గాలు లేకపోయి, కొడుకు లేదా కుమార్తెపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు. వారు పెన్షన్ పొందకపోవడం, సొంత ఆదాయ మార్గం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఉంటే, వారిని ఈ చట్టం రక్షిస్తుంది. ఆధారిత దివ్యాంగ సోదరుడు/సోదరి అంటే వైకల్యం ఉన్న, వివాహం కాని వ్యక్తి. అటువంటి సోదరుడు/సోదరి తన జీవనాన్ని కొనసాగించడానికి తగిన ఆదాయం లేక, ఉద్యోగిపై ఆధారపడే వారిగా పరిగణించబడతారు.

వారిని తగిన విధంగా సంరక్షించడం ఉద్యోగి బాధ్యతగా ఈ చట్టం పేర్కొంటుంది. ఆధారిత తల్లిదండ్రులులేదా దివ్యాంగ సోదరులు ఫారమ్‌లో నియమిత అధికారికి ఫిర్యాదు ఇవ్వవచ్చు. ఇది రాతపూర్వకంగా ఉండాలి. ఎప్పుడు అయినా ఫిర్యాదు చేయొచ్చు. అధికారి దానిని స్వీకరించి విచారణకు తీసుకుంటారు. వారు ఫిర్యాదులను పరిశీలించి, 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# అమెరికాలో వలసదారుల అరెస్టులు

## ఒక్కరోజులోనే 2200 మంది

**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికాలో వలసదారుల అరెస్టులు ప్రారంభమైనాయి. ఆ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2,200 మందిని అరెస్ట్ చేశారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఒక్క రోజులోనే 3 వేల మందిని అరెస్ట్ చేయాలని ఆదేశించారని పేర్కొనడంతో ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయని తెలిపింది. అయితే ఒక్క రోజులోనే ఇంత మందిని అరెస్ట్ చేయడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమమని స్పష్టం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసిఇ అధికారులు అల్టర్‌నేటివ్ టు డిటెక్షన్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కింద పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా.. యాంకిల్ ద్వారా స్మార్ట్ యాప్స్‌తోపాటు జియో లోకేషన్ పరికరాల ద్వారా వారిని పర్యవేక్షిస్తుంటారు. అలాగే వారు తరచూ ఐసిఇ కేంద్రాలకు రావాల్సి ఉంటుందని ఇప్పటికే వారికి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఎడిటిలో నమోదైన వలసదారులు ఐసిఇ కార్యాలయాలకు రావాలంటూ సందేశాలు పంపుతున్నారు. అలా వచ్చిన వారిని అరెస్ట్ చేసి కార్లలో తరలిస్తున్నారు. గతంలో ఐసిఇ పిలుపు వచ్చినా హాజరు కానీ వారిని దేశం విడిచి వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో వలసదారులను వెనక్కి పంపిస్తామని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలికి బెయిల్



**కోల్‌కత్తా, జూన్ 5:** ఆపరేషన్‌సింధూర్‌పై అభ్యంతరకరపోస్టులుపెట్టిన న్యాయవిద్యార్థిని శర్మిష్ట పనోలికి కోల్‌కత్తా హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ఆమెపై కోల్‌కత్తాపోలీసులు కేసులు నమోదుచేసిన సంగతి తెలిసిందే. రూ.10 వేల పూచీకత్తుతో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గురుగ్రామ్‌లో అరెస్టు అయిన పనోలి ఈనెల 13వ రకూ జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆపరేషన్ సిందూర్‌పై బాలివుడ్ నటుల మౌనం ప్రశ్నిస్తూ ఆమె ఇన్‌స్టాలో విడియోను పోస్టు చేసింది. ఆపోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. అనేకమంది సోషల్‌మీడియా యూజర్లు ఆమెను హెచ్చరిస్తూ వ్యాఖ్యలుపెట్టారు. దీనితో ఆమె ఆ విడియోను తొలగించి బహిరంగ క్షమాపణలు చెప్పింది. బెంగాల్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో పనోలిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని ఆమె తరపు న్యాయవాది వాదించారు. వజాఖత్ ఖాన్ ఖాద్రి అనే వ్యక్తి గార్డెన్ రీచ్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదుచేసారు. విచిత్రం ఏమిటంటే ఫిర్యాదుచేసిన ఖాద్రికూడా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇపుడు అంశంపై ముమ్మర దర్యాప్తుచేస్తున్నారు. ఒక మతపరమైన ట్రస్టు శ్రీరామ్ స్వాభిమాన్ పరిషద్ సంస్థ గార్డెన్‌రీచ్‌పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదుచేసింది. ముంబయి, అస్సాం, దేశంలోని ఇతర ప్రాంతాల్లోకూడా ఖాద్రిపై కేసులు నమోదయ్యాయి. విద్వేషకర ప్రసంగాలు చేస్తున్నారని, దీనివల్ల ఉద్రిక్తతలు,హింస పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఫిర్యాదులు నమోదయ్యాయి.

# తొక్కిసలాట ఘటనను రాజకీయంచేస్తున్న బిజెపి

## కన్నీటి పర్యంతం అయిన కర్ణాటక డిప్యూటీ సిఎం



**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబీ విజయం సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటను ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని, ఇది రాజకీయాలుచేసే సమయం కాదని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతు జరిగిన సంఘటనపట్ల క్షమాపణలు చెపుతున్నానని, ఇది ఎంతో ఘోరమని ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. బెంగళూరు ప్రతిష్టను ప్రతిపక్షాలు మరింత దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. పోలీసులు అనుమతులివ్వలేదన్న వార్తలపై ఆయనస్పందిస్తూ బిజెపి నేతల విమర్శలపై తానుస్పందించబోనని నేను కర్ణాటక ప్రజలకు జవాబుదారీ అని దేశ ప్రజలకు జవాబుదారీ అని ఆయనఅన్నారు. బిజెపి నాయకులే ఇలాంటి విషప్రచారానికి కుట్రదారులని డికె ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు శవరాజకీయాలుచేసుకోనీయండి, ఎన్ని మృతదేహాలపై వారు శవరాజకీయాలు చేసారన్నదానిపై నేను జాబితారూపొందిస్తానని అన్నారు. ఎంతో బాధగాఉంది. బాధితులు మన రాష్ట్రంవారు, బెంగళూరువారు మన సొంతకుటుంబం వారే. బెంగళూరు, కర్ణాటక ప్రతిష్ట పూర్తిగా పోయిందని మేం బాధ్యత తీసుకుంటున్నాం, ఎవ్వరినీ నిందించడంలేదని ఈ సంఘటన అనూహ్యంగా జరిగిందని, ఇంత భారీస్థాయిలో అభిమానులు వస్తారని ఎవ్వరూ ఊహించలేదని ఆయన అన్నారు.



# నేరాల హబ్‌గా బీహార్!

## ఎఐసిసి నేత రాహుల్ ధ్వజం

**పాట్నా, జూన్ 5:** ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆధ్వర్యంలో బీహార్ నేరాల హబ్‌గా మారిపోయిందని, నిరుద్యోగం మరింతగా వృద్ధిచెందిందని దీనివల్ల ప్రజలంతా ఉపాధిలేక వలసలు పోతున్నారని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. గయలో ఇటీవల జరిగిన సంఘటనను పురస్కరించుకని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అత్యాచార బాధితురాలి తల్లి అస్వస్థతకు గురయితే చికిత్సచేసేందుకువెళ్లిన వైద్యుడిని చెట్టుకు కట్టి తీవ్రంగా కొట్టిన సంఘటనను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలుచేస్తూ పోస్టుపెట్టారు. అంతేకాకుండా చెట్టుకు కట్టేసి డాక్టర్‌ను కొట్టిన విడియోను కూడా ఆయన జతచేసారు. డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారని ఈకేసులో నిందితులే ఈ ఘాతుకానికి పాల్పడినా ప్రభుత్వంనుంచి స్పందనలేదని ఆయన దుయ్యబట్టారు. అత్యాచార బాధితురాలు తల్లికి చికిత్సచేసినందుకే ఈ రేప్‌కేసు నిందితులు దారుణంగా డాక్టర్‌ను కొట్టారని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రం నేరాలకు హబ్‌గా మారిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని, వలసలు అందుకే పోతున్నారని ఆరోపించారు. ఇవే నితీష్‌కుమార్ బిజెపి ప్రభుత్వం వాస్తవ స్వరూపమని రాహుల్ ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రతినిధి షమా మహ్మద్ కూడా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర స్థాయిలో విమర్శలుచేసారు. తొమ్మిదేళ్ల అత్యాచార బాధితురాలికి వైద్యం నిరాకరించడంవల్లనే ఆమె చనిపోయిందని ఆరో పించారు. బీహార్‌ను నేరస్తులే నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. మోడీని తీష్‌కుమార్ ప్రభుత్వం పూర్తిగా నేరస్తులకు, నేరముఠాలకు, దౌర్జన్యకారులకు లొంగిపోయిందని విమర్శించారు.

# పినాకిమిశ్రాను వివాహమాడిన మహువామొయిత్రా

## ఇద్దరూ ఎంపీలే, రెండురాష్ట్రాల్లో ప్రాతినిధ్యం



**కోల్‌కత్తా, జూన్ 5:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మోయిత్రా బిజెడి ఎంపి పినాకి మిశ్రాను వివాహమాడినట్లు తెలిసింది జర్మనీ నగరం బెర్లిన్‌లో గతనెల మూడో తేదీ జరిగిన ఈ వివాహానికి సంబందించిన వారి ఫోటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయింది. రెండు పర్యాయాలు లోక్‌సభ ఎంపిగా కృష్ణనగర్ నియోజక వర్గంనుంచి ఎన్నికైన మొయిత్రా పినాకి మిశ్రాను వివాహమాడారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంనుంచి మిశ్రా ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న మొయిత్రా ఒంటినిండా బంగారు నగలతో మిశ్రాతో నడుస్తున్నట్లు కనిపించారు. 1974 అక్టోబరు 12వ తేదీ అస్సాంలో జన్మించిన మొయిత్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత 2010లో టిఎంసిలో చేరారు. కృష్ణనగర్‌నుంచి 2019లో మొదటిసారి ఎన్నికకాగా మళ్లీ 2024లో కూడా ఎన్నికయ్యారు. పార్లమెంటులో నియంతృత్వానికి సంబంధించిన ఆరు సూచనలు అన్న అంశంపై ఆమెచేసిన ప్రసంగంతో అందరిదృష్టిలోకి వచ్చారు. ఇక పినాకి మిశ్రా 1959 అక్టోబరు 23న ఒడిశాలోని పూరిలోజన్మించారు. సీనియర్ రాజకీయవేత్త, న్యాయవాదికూడా ఢిల్లీ వర్సిటీ నుంచి లా డిగ్రీ సాధించారు. మిశ్రా తన రాజకీయ ప్రయాణం ఐఎన్‌సినుంచే ప్రారంభించారు. 1996లో పూరి సీటును ఎన్నికయ్యారు. ఆ తర్వాత నవీన్ పట్నాయక్ బిజుజనతాదళ్‌లో ఎన్నికయి అనేకసార్లు అంటే 2009, 2024, 2019ల్లో కూడా ఎన్నికయ్యారు.

# ఆర్సీబీ విజయోత్సవాల వేళ విధుల్లో 1000 మంది పోలీసులు

## హైకోర్టుకు వెల్లడించిన కర్ణాటక ప్రభుత్వం

**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబి విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే అంతకుముందు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ ఆర్సిబి ఈవెంట్‌కు 5 వేల మంది పోలీసులులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం. తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది.ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం. అన్నవి ఆలోచించాలి అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ ఈ స్టేడియం సామర్థ్యం 35 వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30 వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5 లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవగా సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# యుఎస్ వీసా కోసం సోషల్ మీడియా ఖాతాల తొలగింపు!

## 'వెట్టింగ్' ప్రభావం..



**వాషింగ్టన్, జూన్ 5:** వలసదారుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడానికి ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేస్తామని అమెరికా ప్రభుత్వం చెప్పింది. ఈ పరిణామాలు అమెరికాలో చదవాలని కలలు కంటోన్న భారతీయ విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. దాంతో వివాదానికి దారితీస్తాయని భావిస్తోన్న పోస్టులను వారి డిలీట్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగిస్తున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

వీసా ఇంటర్వ్యూల సమయంలో వారి రాజకీయ పరమైన అభిప్రాయాలు తప్పుగా అర్థం చేసుకుంటారేమోననే ఆందోళన ఇందుకు కారణమవుతోంది. మామూలుగా చేసే కామెంట్, ఎలాంటి హాని తలపెట్టని పోస్టును కూడా పరిగణనలోకి తీసుకొని వీసాను ఎక్కడ తిరస్కరిస్తారోనని వారు భయపడుతున్నారు. అమెరికా అధికారులు అనుమతించని కంటెంట్‌ను లైక్ లేక షేర్ చేయడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని, ఇలా ఆకస్మికంగా పోస్టులు, ఖాతాలు తొలగించడం కూడా అనుమానాలు రేకెత్తిస్తుందని వీసా కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు గత ఐదు సంవత్సరాల కాలానికి సంబంధించి సోషల్ మీడియా వివరాలు అందించాలని ఇమిగ్రేషన్ అధికారులు కోరతారని నిపుణులువెల్లడించారు. దాంతో వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుందన్నారు. వారినేపథ్యం వీసా లక్ష్యాలకు సరిపోతుందా లేదా?అని తనిఖీ చేస్తారు. చిన్నపాటి రాజకీయ కార్యకలాపాలు, వివాదాస్పద కామెంట్లను వీసా పరిశీలన సమయంలో అనుమానాస్పదంగానే పరిగణిస్తారని హెచ్చరిస్తున్నారు.

**ఏమిటీ సోషల్ మీడియా వెట్టింగ్..?**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్ని 'సోషల్ మీడియావెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

# పాక్ 'మేడమ్-ఎన్' వలలో భారత్ ఇన్‌ఫ్లూయెన్సర్లు!



**ఇస్లామాబాద్, జూన్ 5:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కింద పనిచేసే.. ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. షెహజాదకు నిఘా సంస్థ ఐఎస్ఐతో బలమైన సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'.

హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డులో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతో ఉన్న బలమైన సంబంధాలు తెలుస్తాయి. ఈమె సంస్థ భారత్‌లోని ఢిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని ప్రశ్నించగా.. షెహజాద పాత్ర వెలుగు చూసింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్‌సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, ఆర్మీనుంచి ఆమెకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. మన దేశంలోని దాదాపు 3,000 మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు గత ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడిఉంది. అక్కడి ఫస్ట్‌సెక్రటరీ (వీసా) సైహైల్‌కమర్,కౌన్సిలర్‌ఉమర్ ప్రేయర్‌తో బలమైన సంబంధాలున్నాయి. ఆమెనుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్‌రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసావచ్చేసేది. జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూడటంతో డానిష్‌ను భారత్‌నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే.

# పర్యావరణాన్ని రక్షిద్దాం.. భవిష్యత్ ప్రపంచాన్ని కాపాడుదాం

## అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణాన్ని పరిరక్షించుకుని, భవిష్యత్ ప్రపంచాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మన అందరిపై ఉందని అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం పిసిబి కార్యాలయంలో జరిగిన ఎన్విరాన్‌మెంట్ డే ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యావత్ ప్రపంచానికే సవాలుగా మారిన ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు సంయుక్త కృషి చేయాలన్నారు. ఈ సంవత్సరం ప్లాస్టిక్‌రహిత కాలుష్యాన్ని ప్రపంచవ్యాప్తంగా అంతం చేయడం, అనే థీమ్‌తో ఈ పర్యావరణ దినోత్సవాన్ని జరుపు కుంటున్నా మన్నారు. మన రాష్ట్రం, దేశమే కాకుండా యావత్ ప్రపంచమంతా ప్లాస్టిక్ సమస్యను పెద్దఎత్తున ఎదుర్కొంటున్న దన్నారు. దీనిలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలన వైపు మనమంతా దృష్టి సారించాలన్నారు. 1960, 1970ల నుంచి సముద్రాల్లో ప్లాస్టిక్ పెద్దఎత్తున్న పేరుకు పోతున్నట్లు శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. భారతదేశం ప్రతి యేటా 12.65 కోట్ల కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోందని, నిపుణులు చెబుతున్నారన్నారు. ప్రతినిమిషం ప్రపంచవ్యాప్తంగా 20 లక్షల సింగిల్‌యూస్ ప్లాస్టిక్ సంచులు పంపిణీ అవుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ బాటిళ్ల కొనుగోలు అవుతున్నాయని,2026 నాటికి ఈ సంఖ్య 50 కోట్లకు పైగా ఉండబోతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారన్నారు. ఇదే ధోరణి కొనసాగితే, 2050 నాటికి ఈ సంఖ్య 1200 కోట్ల టన్నులకు చేరవచ్చున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నదని గుర్తు చేశారు. గత ఏడాది 20.2 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంటే 19.04 కోట్ల మొక్కలను నాటామని, అంటే 95శాతం టార్గెట్ రీచ్ అవడం చాలా గొప్ప విషయమన్నారు. ఇందుకు ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు, సిబ్బందిని తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం కూడా వనమహోత్సవాన్ని భారీస్థాయిలో చేపట్టాలని నిర్ణయం చేశామని తెలిపారు. పర్యావరణ మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకోటూరిజం, పార్కుల్లో కీలక మార్పులు చేపడుతున్నమన్నారు. .పాలసీ రూపకల్పనలు, నిర్వా హకులు, పౌరులు మనం ప్లాస్టిక్ నిర్మూలించేందుకు పని చేయాలన్నారు. సింగిల్ యూస్‌ప్లాస్టిక్‌లను తొలగించి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ప్రోత్స హించాలన్నారు. బాధ్యతాయుతమైన రీసైక్లింగ్, పునర్వి నియోగం కోసం మౌలిక సదుపాయాలను నిర్మించాలని అన్నారు. అందుకోసం తమ ప్రజా ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని సృష్టించేందుకు కట్టుబడి ఉందన్నారు. వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా రోజు కొన్ని మంచి నిర్ణయాలతో ప్లాస్టిక్ నివారణలో ముందంజ లో ఉంటామన్నారు. 2018లో భారతదేశం 2022 నాటికి సింగిల్‌యూస్ ప్లాస్టిక్‌లను తొలగించాలని ప్రతిజ్ఞ చేసిందన్నారు.వెల్లడించారు. ఈ చర్యే దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ సంచులు, కట్లరీలపై నిషేధానికి ప్రేరణగా నిలిచిందన్నారు. తెలంగాణ ఈ నిర్ణయం, విధానాన్ని మరింత ఉత్సాహంతో కొనసాగి స్తోందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు2025లో జెనీవాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి యావత్ ప్రపంచమంతా కీలక చర్చలు జరపనున్న దన్నారు. 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఆతిథ్యం ఇస్తున్న రిపబ్లిక్ ఆఫ్ కొరియా, ప్లాస్టిక్‌ను మరింత వేగంగా నిలువరించేందుకు వ్యూహాలు రచించనున్నదన్నారు. తెలంగాణ ప్రతి పౌరుడినీ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, రీసైక్లింగ్‌కు సహకరించాలని ఆ శాఖ మంత్రిగా కోరుతున్నా అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి చేసే ఈ అవగాహన కార్యక్రమంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడాన్ని ప్రారంభిస్తున్నం దుకు తనకు గర్వంగా ఉందన్నారు. మన రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అనివార్యత ఉందన్నారు. ఈ సందర్భంగా, ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు, సామాజిక సంస్థలు అందరూ కలిసి ఆదర్శవంతంగా పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించాలని మంత్రి సురేఖ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి గుగులోత్, పీసీబీ బోర్డు మెంబర్లు సత్యనారాయణ రెడ్డి, విజయలక్ష్మీ జయదేవ్, పిసిబి ఉద్యోగులు,సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




సీడ్ బాల్స్ పంపిణీ చేస్తున్న జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా

# రెండు లక్షల సీడ్‌బాల్స్ పంపిణీ చేస్తాం

## జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రా

**హైదరాబాద్ (సైదాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించడానికి జైళ్ల శాఖ తరపున తమవంతు కర్తవ్యంగా రాబోయే రోజుల్లో రెండు లక్షల సీడ్ బాల్స్‌ను పంపిణీ చేయనున్నట్లు జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చంచల్‌గూడలోని జైళ్ల శాఖ పెట్రోలు బంకు వద్ద జరిగిన కార్యక్రమానికి డిజి సౌమ్య మిశ్ర ముఖ్య అతిథిగా హాజరై సీడ్ బాల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిజి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జైళ్లలోని ఖైదీలతో రెండు లక్షల సీడ్ బాల్స్ తయారు చేయించి జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 30 పెట్రోలు బంకులకు వచ్చే వాహనదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడుతామని డిజి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజిలు వై.రాజేష్, ఎన్.మురళి బాబు, డిఐజిలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం.సంపత్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ఎన్.శివకుమార్ గౌడ్, ఐఒసిఎల్ డివిజనల్ మేనేజర్ ముతువేల్, సేల్స్ మేనేజర్ మహేంద్ర మీన తదితరులు పాల్గొన్నారు.




ఆర్కైవ్స్‌కు తాళాలు వేసి సోదాలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

# స్టేట్ ఆర్కైవ్స్‌లో విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 5, ప్రభాతవార్త:** తార్నాక లోని తెలంగాణ స్టేట్ ఆర్కైవ్స్ (తెలంగాణ రాష్ట్ర రాజ్యాభిలేక పరిశోధనాలయం)లో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఆర్కైవ్స్ లో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశాలు జారి చేసిన నేపథ్యంలో విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేపట్టింది. మధ్యాహ్నాం చేరుకున్న అధికారులు గేట్లు మూసివేసి లోపలి నుంచి తాళాలు వేసి తనిఖీలు చేపట్టారు. రాకపోకలు నిలిపివేసి ఆధారాల కోసం అన్వేసిస్తున్నారు. పలు దస్తావేజులను వారు పరిశీలిస్తున్నారు. రాజ్యాభిలేఖ పరిశోధనాలయంలో కొన్నేళ్లుగా అరాచకాలకు ఆలవాలంగా మారిందని ఇక్కడి సిబ్బంది పేర్కొంటున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందితో కొందరు భూకబ్జాదారులతో కుమ్మక్కయి విలువైన పత్రాలను దారి మళ్లిస్తున్నారనే ఆరోపనలు ఉన్నాయి. వాటి స్థానాంలో నఖిలీ పత్రాలు చేర్చి, అవే నిజమైనవంటూ రాజముద్ర వేసి మరీ ఇస్తున్నారని తెలిసింది. విలువైన భూములు కబ్జాదారుల పరమయ్యేందుకు న్యాయ వివాదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఈ సోదాలు రాత్రి వరకు కొనసాగుతున్నాయి. అందులో పాత్రధారులైన అవినీతి ఉద్యోగుల వివరాలు తెలియాల్సి ఉంది.

# మహిళా సంఘాలకు తపాలా శాఖ ద్వారా రుణాల చెల్లింపులు

## పలు సమస్యలకు పరిష్కారం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇది శుభవార్త. ఇకపై వారు తమ ఆర్థిక లావాదేవీలను ముఖ్యంగా రుణాల తిరిగి చెల్లింపులను, సమీపంలోని తపాలా కార్యాలయాల ద్వారా నిర్వహించుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు తక్కువగా ఉండటం, ప్రయాణ భారం, ఆలస్యమయ్యే చెల్లింపులతో ఎదురయ్యే ఇబ్బందులను ఇది తగ్గిస్తుంది. రంగారెడ్డి జిల్లాలో విజయవంతమైన పైలట్ ప్రాజెక్ట్‌ను జులై నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు గుడ్‌న్యూస్. ఇక నుంచి ఆర్థికపరమైన సేవలు సులభతరం కానుంది. సభ్యులు తమ ఆర్థిక లావాదేవీలను తపాలా శాఖ సేవలను ఉపయోగించుకొని నిర్వహించుకోవచ్చు. రుణాల తిరిగి చెల్లింపులు సులభతరం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మహిళా సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, వాటి ద్వారానే తిరిగి చెల్లిస్తున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకుల సంఖ్య తక్కువగా ఉండటం సభ్యులకు పెద్ద సమస్యగా మారింది. చెల్లింపులు చేయడానికి బ్యాంకులున్న ప్రాంతాలకు వెళ్లడం, సుదూర ప్రయాణాలు చేయడం, అక్కడ ఎదురయ్యే రద్దీ, నిరీక్షణ వంటివి సభ్యులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అంతేకాకుండా ఈ జాప్యం వల్ల కొన్నిసార్లు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి, ఇది వడ్డీ భారాన్ని పెంచుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయాల సేవలను వినియోగించుకోవాలని అధికారులు భావించారు. ఇందుకోసం స్త్రీనిధి సమాఖ్య అధికారులు ఇటీవల తపాలా శాఖ అధికారులతో చర్చలు జరిపారు. మహిళా సంఘాల సభ్యుల చెల్లింపులను స్వీకరించేందుకు వారు అంగీకరించారు. రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని 10 గ్రామాల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. స్త్రీనిధి యాప్ ద్వారా రుణాలను మహిళా సంఘాల సభ్యుల ఖాతాలతో అనుసంధానించి, చెల్లింపులను సులభతరం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో, ఈ విధానం సౌలభ్యంగా ఉందని అక్కడి మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ విధానాన్ని జులై నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలుచేయాలని నిర్ణయించారు. ఈ సేవలను వినియోగించుకున్నందుకు తపాలా శాఖకు తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఛార్జీలను చెల్లిస్తుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక లావాదేవీలు మరింత సులభతరం అవుతాయి. బ్యాంకులకు వెళ్లాల్సిన ప్రయాణ భారం చాలావరకు తగ్గుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది.

# సంతోష్‌నగర్ కార్పొరేటర్ గుండెపోటుతో మృతి



ముజాఫర్ హుస్సేన్(ఫైల్)

**హైదరాబాద్(సైదాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ముజాఫర్ హుస్సేన్(48) గుండెపోటుతో మృతి చెందారు. జిహెచ్ ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి హాజరై కుర్మగూడలోని తన నివాసానికి చేరుకున్న ఆయన రాత్రి 9 గంటల ప్రాంతంలో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఒవైసి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ముజాఫర్ హుస్సేన్ మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. సంతోష్‌నగర్ డివిజన్ నుంచి రెండోసారి కార్పొరేటర్‌గా ఆయన ఎంఐఎం పార్టీ నుంచి గెలుపొందారు. ముజాఫర్ హుస్సేన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎంఐఎం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కుర్మగూడలోని ఆయన నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

# బాలికల రక్షణకు స్నేహ కమిటీల ఏర్పాటు

## మేధోమథనం ముగింపు సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామని పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం మేధోమథన ముగింపు సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు ఈ సదస్సు ప్రాణం పోసిందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక అడ్వైజరీ కమిటీ నియమిస్తామన్నారు. బాలబాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేసి అంగన్వాడీ టీచర్లతో అమ్మాయిలకుగుడ్ టచ్,బ్యాడ్‌టచ్ అవగాహన కల్పిస్తామన్నారు.
మహిళా బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామన్నారు.ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువు అవుతుందన్నారు.అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీములను ఏర్పాటు చేస్తామన్నారు.అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని, అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళా భద్రత కోసం ప్రతిష్ట విధానాలను రూపొందిస్తామన్నారు.చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.చీమలు,కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయని,దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు.పుట్టిన బిడ్డలను పారేయకుండా ఏర్పాటు చేసిన ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను మేమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణ ఏర్పాటై పదేళ్లైనా ఇప్పటికీ బాల్యవివాహ నిరోధకచట్టాలు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోకపోవడం బాధాకరమన్నారు.త్వరలో రూల్స్ అడాప్ట్ చేసుకుంటామని, బాల్యవివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్ ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారని,ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింపజేశార న్నారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలని, అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామన్నారు.జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తిం చాలన్నారు. అంగన్‌వాడీ గదుల్లోని దేశ భవిష్యత్తు ఉందని, కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్‌వాడీ సిబ్బందని కొనియాడారు. కరీంనగర్లో ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారని, అదేవిధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను హాజరు శాతాన్ని పెంచాలన్నారు.

# బిసి గురుకుల జూనియర్ కాలేజీల రెండోదశ ఫలితాలు విడుదల

## అర్హులైన వారు నేటి నుంచి 9 వరకు కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకుల జూనియర్ కాలేజీలకు సంబంధించి రెండోదశ ఫలితాలను విడుదల చేశారు. బిసి గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి రెండవ దశ ఫలితాలను ప్రకటించినట్టు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. గత సంవత్సరాల వరకు ప్రవేశ పరీక్ష (ఎంట్రన్స్ టెస్ట్) ఆధారంగా సీట్లు కేటాయించబడగా.. ఈ ఏడాది నుండి ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా, 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతోందన్నారు. ఎంపికైన విద్యార్థులు తగిన డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని నేటి(జూన్ 6-శుక్రవారం) నుంచి ఈ నెల 9 వరకు సంబంధిత కాలేజీల్లో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు విద్యార్థులకు సూచించారు.

# డిఇఇసెట్-2025లో 78.18 శాతం అర్హత

## 9 నుంచి 13 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రెండేళ్ల కోర్సు అయిన డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఈడి), డిప్లమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన డిఈఈసెట్-2025 పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. పరీక్షకు హాజరైన వారిలో 78.18 శాతం మంది అర్హత సాధించారని డిఈఈసెట్-2025 కన్వీనర్ జి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన వారికి ఈ నెల 9 నుంచి 13 వరకు సర్టిపికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత ఈ నెల 14 నుంచి 17 వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. మే 25న డిఈఈ సెట్ పరీక్షను రాష్ట్రంలోని 87 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. డిఈఈ సెట్‌కి 46,615 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 33,821 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షకి హాజరైన వారిలో 26,442 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 78.18 శాతం మంది అర్హత సాధించారు. తెలుగు మీడియంకి 19,900 దరఖాస్తులు రాగా. వారిలో 15,476 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 11,266 మంది(72.79 శాతం) మంది అర్హత సాధించారు. ఇంగ్లీష్ మీడియంకి 22,051 దరఖాస్తు చేసుకోగా వారిలో 16,963మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 14,646 మంది(86.34 శాతం) అర్హత సాధించారు. ఉర్దూ మీడియంలో 1664 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1382 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో 530 మంది(38.35 శాతం) అర్హత సాధించారు. తెలుగు మీడియంలో తక్కళ్లపల్లి హారికకి అత్యధికంగా 77 మార్కులు సాధించింది. ఇంగ్లీష్ మీడియంలో పసునూరి అభినవ్ రెడ్డి 87 మార్కులు సాధించగా.. ఉర్దూ మీడియంలో ఫరాజ్ అహ్మద్ అత్యధికంగా 67 మార్కులు సాధించినట్టు డిఈఈ సెట్-2025 కన్వీనర్ జి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆపరేషన్ కగార్‌పై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు స్పందించాలి

## పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమానవీయంగా మావోయిస్టులను హతమార్చడం దారుణమని పిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కోరుతూ గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి మధుయాష్కీగౌడ్ హాజరై ప్రసంగించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హింసకు హింస సమాధానం కాదని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులతో పాటు అమాయక గిరిజనులను కూడా కాల్చి చంపుతున్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో చర్చ జరపాలని తమలాంటి వారు కోరితే అర్బన్ నక్సలైట్స్ అంటూ మాట్లాడు తున్నారని పేర్కొన్నారు. దేశంలో అత్యంత సంపన్న పార్టీ బిజెపి అని, 8వేల కోట్లకుపైగా నిధులను ఆదాని, అంబానీ లాంటి పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థల నుంచి ఈ మారణ హోమాన్ని ఆపేందుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము స్పందిం చాలన్నారు. సుప్రీంకోర్టు అయినా సుమోటోగా స్వీకరించి ఆపరేషన్‌ను నిలిపివేయించాలని కోరారు.

# పర్యావరణ రక్షణ జీవితంలో భాగం చేసుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరవరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఢిల్లీలోని అధికారిక నివాసంలో మొక్కలు నాటారు. ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన పలువురు విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వారికి శాలువా కప్పి అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గురించి వారికి వివరించారు.

# ఎసిబి వలలో బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, ప్రభాతవార్త :** తూముకుంట మున్సిపాలిటీ పరిధి శామీర్పేటలో బిల్ కలెక్టర్ గా పని చేస్తున్న రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్ 20 వెయ్యిలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. రెండు ఇండ్ల కొనుగోలు చేసి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి వద్ద 20 వెయ్యిలు డిమాండ్ చేశారని ఎసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. యేడాదిన్నర కాలంగా మ్యుటేషన్ కోసం తిరుగగా, శామీర్పేట్ వార్డు ఆఫీసులో పని చేసే బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్ పని చేయించేందుకు 20 వెయ్యిలు డిమాండ్ చేసినట్లు తమకు ఫిర్యాదు అందినట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ రోజు లంచం డబ్బులు తీసుకుంటుండగా వల పన్ని పట్టుకున్నట్లు ఎసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలియజేశారు. ఈ కేసుతో ఇంకా ఎవరెవరికి సంబందాలు ఉన్నాయనే కోణంలో ఇంకా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎసిబికి పట్టుబడిన బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్



సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, టి.చిరంజీవులు, బాలగోని బాలరాజుగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు

# ఈ యేడాదిలోనే కులగణన చేపట్టాలి

## రెండో వారంలో మేధావులతో సమావేశం: జాజుల


**హైదరాబాద్ (స్టేట్ బ్యూరో), జూన్ 5, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం 2025లో కులగణన ప్రారంభించి 2026లో పూర్తి చేయాలని, ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ బిసి మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు డిమాండ్ చేశారు. సమగ్ర కులగణన కోసం ఈ నెల రెండో వారంలో హైదరాబాద్ నగరంలో మేధావులతో భారీగా సమావేశాన్ని నిర్వహిస్తామని, జూలై మొదటి వారంలో ఢిల్లీలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు. గురువారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా బిసిలు చేస్తున్న పోరాటానికి తలవొగ్గిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కుల గణన చేపడతామని ప్రకటించిందే కాని 2027లో మొదలు పెడతామని ప్రకటించడాన్ని ఎవరూ అంగీకరించరని చెప్పారు. సమావేశంలో బిసి నేతలు బాలగోని బాలరాజుగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, శేఖర్ సగర, ఎం.చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలి

## అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ఏర్పాటు చేయాలని భావిస్తున్న ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా రాజోలిమండలం పెద్దదన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అక్రమంగా అరెస్ట్ చేసి, 12 మందిని రిమాండ్‌కు పంపడాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ కంపెనీ నిర్మాణానికి తీసుకున్న భూమికి సమీపంలో ప్రభుత్వం దళితులకిచ్చిన భూములు, ఇంటి స్థలాలు ఉండడం వల్ల వివిధ రకాల కాలుష్యం ఏర్పడుతందని చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. నెలల తరబడి ఆందోళనలు చేస్తున్నారని జాన్‌వెస్లీ తెలిపారు. గ్రామసభల తీర్మానం, గ్రామపంచాయతీ అనుమతి లేకపోయినా కంపెనీ యాజమాన్యం జేసీబీలు, టిప్పర్లు, కంటైనర్లతో పాటు, బయటినుండి కూలీలను తెచ్చి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని.. దానిని వ్యతిరేకించిన రైతులపై, మహిళలు, ప్రజలపై పోలీసులు లాఠీఛార్జీచేశారని ఆందోళన వ్యక్తం చేశారు.
స్థానికంగా రైతుల, ప్రజల ఆమోదం లేకుండా, వారి అనుమతి లేకుండా పరిశ్రమను ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయబోమని కాంగ్రెస్ హామీ ఇచ్చినా, ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. తక్షణమే రిమాండ్ చేసిన రైతులను విడుదల చేసి, అక్రమంగా బనాయించిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను శాంతియుతంగా జరపాలన్నారు. యేళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా తమ భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో చాలామంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ రెవెన్యూ సదస్సులో తమ సమస్య చెప్పడానికి వచ్చిన వృద్ధరైతు అల్లెపు వెంకటిని మెడపట్టి గెంటేసిన పోలీస్ అధికారిని సస్పెండ్ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాపితంగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఎలాంటి అవాంచనీయ సంఘటనలు, ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరిపి, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మిక నేతలు

# 'విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన 5,541 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి'

**హైదరాబాద్ (స్టేట్ బ్యూరో), జూన్ 5, ప్రభాతవార్త:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో గత 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ వేలాది మంది కార్మికులను తొలగించడం అన్యాయమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి, కార్మిక శాఖ టెక్స్‌టైల్, స్టీల్ డవలప్‌మెంట్ చైర్మన్ సభ్యుల బృందానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ నగరానికి విచ్చేసిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి, సభ్యుల బృందానికి పోరాట కమిటి చైర్మన్ ఆది నారాయణ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో యాజమాన్యం 5541 మంది కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయం తొలగించిందని, మూడున్నర దశాబ్దాలుగా వారు పనిచేశారని, అర్థాంతరంగా తొలగించడం దారుమన్నారు. వారిని విధుల్లోకి తీసుకుని పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌యాదవ్ (సిఐటియు), రెబ్బా (ఐఎన్‌టియుసి), రామారావు (హెచ్‌ఎంఎస్) తదితరులు ఉన్నారు.

# గురుకుల విద్యార్థుల ఆత్మహత్యలు

## ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆగ్రహం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు సత్వరం చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో వార్డెన్లను, కౌన్సెలర్లను నియమించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి చైల్డ్ రైట్స్ కమిషన్ సంబంధిత అధికారులకు మెమో జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా గురుకులాల్లో గత ఏడాదిన్నర కాలంలోనే అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అందుకు ప్రధాన కారణం గురుకులాల్లో అమలు చేస్తున్న టైంటేబులేనని ఆరోపిస్తూ రాష్ట్రానికి చెందిన ఒకరు ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

## ఒక వ్యక్తి సగటున 23.97 కిలోల వాడకం

# నాన్‌వెజ్ వినియోగంలో తెలంగాణ టాప్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** మాంసం వినియోగంలో మాత్రమే కాదు మాంసం ఉత్పత్తిలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మాంసాహారం వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. నాన్ వెజ్ వినియోగంలో జాతీయ సగటు కంటే ఎక్కువగా తెలంగాణలో వినియోగిస్తున్నారు. ఈ మేరకు నేషనల్ శాంపిల్ సర్వే, నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డేటా విడుదల చేసింది. దీని ప్రకారం దేశంలోనే మాంసాన్ని ఎక్కువగా భుజిస్తున్న ప్రజలున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఈ సర్వే లెక్కల ప్రకారం ఏడాదిలో తెలంగాణ రాష్ట్రంలోని ఒక వ్యక్తి సగటున ఏటా 23.97 కిలోలు మాంసం తింటున్నారు. అంటే దాదాపుగా ప్రతి నెల రెండు కిలోల చొప్పున రాష్ట్రంలోని ఒక్కో వ్యక్తి మాంసాన్ని తింటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు తింటున్న మాంసం దేశంలో మరే రాష్ట్రంలోని ప్రజలు తినడం లేదని సర్వేలో తేలింది. గత ఏడాది సైతం నాన్ వెజ్ వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో దేశంలో 70 కి పైగా ప్రజలు మాంసాహారాన్ని ఇష్టపడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. దేశం మొత్తంలో 16.6 శాతం మంది పురుషులు, 29.4 శాతం మంది మహిళలు తప్పించి మిగిలిన వారంతా నాన్ వెజ్‌ను అత్యంత ఇష్టంగా తింటున్నారు. దేశంలో నాన్ వెజ్ అత్యధికంగా తినే రాష్ట్రాల్లో 98.7 శాతంతో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 98.25 శాతం మంది నాన్ వెజ్ తింటున్నారు. తెలంగాణలో వారానికి మూడుసార్లు కనీసం నాన్ వెజ్ వినియోగిస్తున్నట్లు సర్వేలో తేలింది. ఒక వ్యక్తి ఏడాది వ్యవధిలో నాన్ వెజ్ కోసం ఖర్చు చేస్తున్న మొత్తం రూ.58వేలు ఉండటం గమనార్హం.

# భవిష్యత్తు తరాలకు హరిత భూమిని అందించాలి

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** వాతావరణ మార్పులపై పోరాటం, జీవ వైవిధ్య పరిరక్షణ, భవిష్యత్తు తరాలకు హరిత భూమిని అందించేందుకు వ్యక్తిగత, సామూహిక బాధ్యత ఎంతగానో అవసరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. జంతర్ మంతర్ -1లోని లాన్‌లో ఒక మొక్కను నాటారు. ఇది పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్రమానికి ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరై, ప్రకృతిని రక్షి ంచాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు తన కార్యాలయంలోని ప్రతి ఉద్యోగి తమ తల్లి పేరుతో ఒక్కో మొక్కను నాటాల్సిందిగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఏక్ పేడ్ మా కే నామ్ అనే భావోద్వేగ పూరిత ప్రచారంతో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. కుటుంబ సభ్యులు భాగస్వామ్యం కావాలని, మొక్కల ఫోటోలు, వివరాలు కార్యాలయానికి పంపాలని కూడా ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పర్యావరణ పరిరక్షణ అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నది లక్ష్యం అన్నారు.

# మున్సిపల్ కార్యాలయాలపై ఏసిబి అధికారుల దాడులు

## పట్టుబడిన నలుగురు ఉద్యోగులు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** లంచం తీసుకుంటూ నలుగురు మున్సిపల్ ఉద్యోగులు ఏసిబికి పట్టుబట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిర్మల్, రంగారెడ్డి జిల్లా తూంకుంట మున్సిపల్ కార్యాలయాలపై గురువారం దాడులు నిర్వహించారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న గైక్వాడ్ సంతోష్‌కుమార్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఎండి సోయబ్ అహ్మద్‌ను బాధితుడు కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నెంబర్ కేటాయించాలని సంప్రదించాడు. అయితే లంచం డిమాండ్ చేయడంతో ఏసిబిని ఆశ్రయించాడు. దీంతో అధికారులు వ్యూహం ప్రకారం బాధితుడి నుంచి రూ.6వేలు లంచం తీసుకుంటున్న ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు. విధుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడినందుకు ఇద్దరిని కరీంనగర్ ఏసిబి కోర్టులో హాజరు పరిచామని ఏసిబిఅధికారులు తెలిపారు.

**రంగారెడ్డి జిల్లాలో..**

రంగారెడ్డి జిల్లా తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట వార్డ్ కార్యాలయంలో బిల్ కలెక్టర్ కె రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ ఏ శ్రవణ్ రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కారు. బాధితుడు ఇంటికి సంబందించిన మ్యూటేషన్ పని కోసమని అధికారులను సంప్రదించగా డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని నాంపల్లి ఏసిబి కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు.

# సౌతాఫ్రికా బోత్స్‌వానాలో నగర యువకుడి మృతి

## ఉద్యోగానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జూన్ 5, ప్రభాతవార్త:** సౌతాఫ్రికా దేశంలోని బోత్స్వానాలో ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ మారుతీనగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... సైదాబాద్‌కు చెందిన దుర్గాపతి ప్రమోద్‌గౌడ్, శివరంజని దంపతులు గత కొంతకాలం నుండి మీర్‌పేట్ లోని మారుతీనగర్ కాలనీలో నివసిస్తున్నారు. వీరి కుమారుడు లిఖిత్‌గౌడ్ (27) ఉద్యోగ నిమిత్తం 2024లో సౌతాఫ్రి కాకు వెళ్ళి బోత్స్వ నాలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే ఉద్యోగ నిమిత్తం గత శుక్రవారం కారులో వెళ్తుండగా ఓ భారీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమా దంతో తీవ్రగాయాల పాలైన లిఖిత్‌గౌడ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అక్కడి అధికారులు వివరాలు సేకరించి భారత్ ఎంబసీకి సమాచారం అందించారు. దీంతో మీర్‌పేట్ మారుతీనగర్‌లో ఉంటున్న కుటుంబ సభ్యులకు లిఖిత్‌గౌడ్ మరణవార్త తెలిసింది. లిఖిత్‌గౌడ్ మృతి దుర్గాపతి ప్రమోద్‌గౌడ్ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. చేతికందిన కొడుకు విదేశాలకు ఉపాధి కోసం వెళ్ళి మృత్యువాత పడడంపై కన్నీరుమున్నీరవుతున్నారు. లిఖిత్‌గౌడ్ అకాల మృతి, అతని మృతదేహం రాక కోసం కుటుంబ సభ్యులు దీనంగా ఎదురు చూస్తుండడం పలువురిని కలచివేసింది.



లిఖిత్‌గౌడ్ (ఫైల్)

# ఎంపి మల్లు రవిపై అధిష్ఠానానికి సంపత్‌కుమార్ ఫిర్యాదు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మరోసారి బయటపడ్డాయి. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. క్షమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న నాగర్ కర్నూలు ఎంపి మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఎంపి మల్లు రవి తీరుపై ఆయన గురువారం ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ లైన్ క్రాస్ చేసి బిఆర్ఎస్ ఎమ్మెల్యే విజేయుడితో కలిసి ఎంపి మల్లురవి తిరుగుతున్నారంటూ సంపత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో పార్టీకి చాలా నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను సకాలంలో అందించాలి

## బిజెపి శాసనమండలి పక్ష నాయకుడు ఏవిఎన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యాసంవత్సరం మొదలు అవుతున్నా ఇంతవరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్ అందించలేదని బిజెపి శాసనమండలి పక్ష నాయకులు ఏవిఎన్ రెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వెంటనే పాఠ్య పుస్తకాలు యూనిఫామ్ సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 75 ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవని, 39 పాఠశాల్లో ప్రహరీ గోడలు లేవని, 23 స్కూళ్లలో తరగతి గదులు లేవు అన్నారు. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టి విద్యార్థులు ఇబ్బందులకు గురికాకుండా. ఆరోగ్యకరమయిన వాతావరణంలో విద్యనందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు మరుగుదొడ్లు అందుబాటులో లేని కారణంగా డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నాయన్నారు. మరుగుదొడ్లు నిర్మించి విద్యార్థినుల సంఖ్య పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

# సింగరేణిలో ప్లాస్టిక్ వాడకంపై సంపూర్ణ నిషేధం

## సంస్థ సిఎండి బలరామ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భం గా సింగరేణి హైదరాబాద్ లోని ప్రధాన కార్యాలయంతో పాటు, సంస్థకు చెందిన అన్ని ఏరియాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు సిఎండీ ఎన్. బలరామ్ వెల్లడించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లోపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కార్యాలయ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఇప్పటికే పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా సింగరేణి కార్యాలయాలు, గనులు, డిపార్ట్ మెంటులలో ప్లాస్టిక్‌తో తయారుచేసిన బాటిల్స్, ప్లేట్లు, వస్తువులు తదితరాలపై ఇక నుండి సంపూర్ణ నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. సంస్థలోని అధికారులను, కార్మికులు, ఉద్యోగులు దీనికి సహకరించాలని కోరారు. తమ ఇంటి వద్ద కూడా ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని సూచించారు. పర్యావరణం పట్ల అభిమా నం తో తాను ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా 19 వేల మొక్కల్ని నాటినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం 3 మొక్కలు నాటాలని, అటువంటి ఆసక్తి గల వారికి సింగరేణి సంస్థ ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం సింగరేణి ప్రాంతాల్లో ఎండాకాలం 50 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండేవని, సింగరేణి సంస్థ విస్తారంగా మొక్కలు నాటిన కారణంగా, ఆ మొక్కలు అడవులుగా పెరిగి వాతావరణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పడిపోయాయని పేర్కొన్నారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని ప్రాంతంలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న పరిస్థితుల్లో అక్కడ కూడా పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇడి ఎస్ డి ఎం. సుభాని, జిఎం ఎన్.వి. రాజశేఖర్ రావు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బలరామ్ బహుమతుల్ని అందజేశారు. అలాగే కార్యక్రమం లో పాల్గొన్న ఉద్యోగులకు జ్యూట్ బ్యాగుల్ని పంపిణీ చేశారు.

# నిధుల సమీకరణపై దృష్టి సారించాలి

## కేబినెట్ సబ్‌కమిటీలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అవసరాల నేపథ్యంలో అందుకు నిధుల సమీకరణపై అధికారులు దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. వివిధ విభాగాల్లో ఆదాయం వచ్చే అవకా శాలను పరిశీలిం చాలన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌లో గురు వారం విక్రమార్క అధ్యక్షతన జూపల్లి కృష్ణారావు సభ్యులుగా రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ కమిటీ సమావేశం ప్రతివారం జరుగుతుందని, తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు.
తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షి స్తామని తెలిపారు. రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, చేసిన సూచలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నిర్మించాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా అంశాలను సుదీర్ఘంగా సమీక్షి ంచారు. సమావేశంలో ఆర్థిక శాఖ, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, మైనింగ్ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజు, రిజ్వీ, శ్రీధర్, సిసిఎల్‌ఏ సెక్రటరీ నవీన్ మిట్టల్, కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కమిటీలతో జాప్యం కాకుండా సమస్యలను పరిష్కరించాలి

## ప్రభుత్వ సాచివేత ధోరణి సరైంది కాదు

## టియస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీలో తీర్మానం

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత దోరణి సరైంది కాదని.. కమిటీలతో కాలయాపన చేయకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టియస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన చేసే దోరణి సరైంది కాదని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పోరాటాలు చేయాల్సిన అనివార్యత కల్పించవద్దని సంఘం రాష్ట్ర కమిటి సమావేశం అభిప్రాయపడినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం సంఘం రాష్ట్ర కార్యాలయం దోమల్‌గూడలో జరిగిందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర చైర్మన్ యం రాజ శేఖర్‌రెడ్డితో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, రాష్ట్రకమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో సాచివేత దోరణితో కాలయాపన చేయడాన్ని క్షేత్రస్థాయిలో తీవ్రంగా నిరసిస్తున్నారని, అసంతృప్తి ఆందోళనగా మారుతోందని, ప్రభుత్వం గమనించకపోచే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. నెల మొదటి తారీఖున జీతం చెల్లిస్తున్నామనే ఒక్క అంశం తప్ప ఇతర సమస్యలేవి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం అవుతుందన్నారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కెజిబివి పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇప్పటికీ మొదటి తారీఖున వేతనాలు అందడంలేదన్నారు. ప్రతినెలా ఆలస్యంగా చెల్లిస్తున్నారని.. పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో నెలకు రూ.500 కోట్లు కేటాయించి పరిష్కారం చేస్తామని మార్చిలో ఇచ్చిన హామి కూడా అమలులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీ దృష్టికి ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లను తెచ్చినప్పటికి కనీసం ఆర్థికేతర డిమాండ్లను కూడా పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 5 పెండింగ్ డిఏలలో కనీసం మూడు డిఏలనైనా వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల పున:ప్రారంభానికి ముందే అన్ని గురుకుల పాఠశాల సమయ సారణిని ఉ 9 గంటల నుండి ప్రారంభమయ్యే విధంగా విద్యార్థుల దృష్ట్యా ఆలోచన చేయాలన్నారు. విద్యాశాఖాధికారులు తొందరపాటుగా ఇచ్చిన మెమో నెం. 1267 ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ మెమో.. నోటితో నవ్వి, నొసటితో వెక్కిరించినట్లుగా ఉందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా తల్లిదండ్రులు కోరుకుంటున్న సందర్భంలో నిబంధనలు సవరించి, విద్యార్థుల నమోదు పూర్తయిన తర్వాత ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలు చేయాలని, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్లు, ఎంఈఒ పోస్టులకు విద్యా శాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగస్తుల వివరాలపై తెలంగాణ బిసి కమిషన్ సమీక్ష

## 9, 10, 11 తేదీల్లో తొలగించబడిన

## 26 కులాలపై బహిరంగ విచారణ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల వివరాల సేకరణపై తెలంగాణ బిసి కమిషన్ దృష్టి సారించింది. ఇదే అంశంపై కమిషన్ గురువారం సమీక్ష నిర్వహించింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల వివరాల సేకరణపై సమీక్ష సమావేశం జరిగింది. సమీక్ష సమావేశంలో తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్‌తోపాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మీ, కమిషన్ సభ్య కార్యదర్శి బాల మాయదేవి, శ్రీనివాసరావు, సతీష్ కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కమిషన్ విధించిన గడువులోగా సమాచారం సమర్పించనటువంటి వివిధ శాఖల కార్యదర్శులతో కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 9, 10, 11 తేదీల్లో.. గతంలో బిసి జాబితా నుంచి తొలగించబడిన 26 కులాల విషయంలో కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను కమిషన్ సమీ క్షించింది.
సుప్రీంకోర్ట్‌కు కమిషన్ నివేదిక సమర్పించాల్సిన అవసరం ఉన్నందున తొలగిం చిన కులాల విషయంలో కులగణనలో నమోదైన జనాభా, సామాజిక ఆర్థిక, విద్య, వెనుకబాటు తనం వివరాలను అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాలని కమిషన్ నిర్ణయించింది. కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చవలసిన 40 కులాల విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించింది.

# టెన్త్ మూల్యాంకనం అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

## ఎపి మాజీమంత్రి ఆదిమూలపు సురేష్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ఎపిలో పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో అవకత వకలపై తక్షణం సమగ్ర విచారణ జరపాలని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన విద్యాశాఖ నిర్వాకంపై ఆశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి లోకేష్‌తో సహా బాధ్యులైన అందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వపరంగా విద్యాసంస్థల్లో ఇచ్చే అడ్మిషన్లను వాయిదా వేయాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో తీవ్రస్థాయిలో తప్పులు జరిగాయని దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థిలోకం భగ్గుమంటుందన్నారు.
విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదో తరగతి పరీక్షలను, జవాబు పత్రాల మూల్యాంకనంను లేనిపోని గొప్పలకు పోయి, అడ్డగోలుగా, నిరక్ష ్యంగా నిర్వహించారని మండిపడ్డారు. రికార్డు స్థాయిలో ఫలితాలను వెలువరిస్తామంటూ చేసిన హడావుడికి ఎందరో విద్యార్థులు నష్టపోయారని పరీక్షల నిర్వహణ నుంచి మూల్యాంకనం వరకు విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింన్నారు. వారం రోజుల్లోనే మూల్యాంకనాన్ని పూర్తి చేయాలంటూ టీచర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని సోషల్ స్టడీస్ జవాబు పత్రాల మూల్యాంకనం కేవలం అయిదు రోజుల్లో పూర్తి చేశారనే విషయం బయటపడిందన్నారు.
ఇటువంటి తప్పుల వల్ల పదోతరగతి విద్యార్థులు నష్టపోకుండా కోరిన ప్రతి విద్యార్థి జవాబు పత్రాలను ఉచితంగా రీవాల్యుయేషన్ చేయాలని దరఖాస్తు చేసుకోని వారికి కూడా గడువును పొడిగించాలన్నారు. తుది ఫలితాలు వచ్చే వరకు పాలిటెక్నిక్, రెసిడెన్షియల్, ట్రిపుల్ ఐటీల అడ్మిషన్లను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.




# సిఐడి అడిషనల్ డైరెక్టర్‌గా చారుసిన్హా బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్ర సీఐడీ అడిషనల్ డైరెక్టర్‌గా చారు సిన్హా గురువారం బాధ్యతలను స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఆమె డిప్యూటేషన్‌పై కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)లో ఏడు యేళ్లుగా సేవలందించి తెలంగాణకు వచ్చారు. బీహార్, జమ్ముకశ్మీర్, దక్షిణాది రాష్ట్రాల లోని నాలుగు విభాగాలకు నాయకత్వం వహించిన తొలి అధికారి. ప్రస్తుతం చారుసిన్హా రాష్ట్రంలో మహిళల భద్రత, షీటీమ్స్, భరోసా కేంద్రాలపై అదనపు బాధ్యతలు వహించనున్నారు.



# సింగరేణి సిఆర్‌టిలకు మినిమమ్ టైంస్కేల్ వర్తింపచేయాలి

## ఎండి బలరామ్‌కు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సిఆర్‌టి)కి మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింప చేయాలని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు కనీస మూలవేతనం వర్తింపచేస్తూ ..12 మాసముల వేతనం చెల్లించాలని కోరుతూ గురువారం సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాంని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఎండి త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తెలిపారు. అధ్యాపక, ఉపాధ్యాయులకు సింగరేణి ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందించాలన్న ఎమ్మెల్సీ ప్రతిపాదనపట్ల కూడా ఎండి సానుకూలంగా స్పందించారు. దాంతోపాటు సింగరేణి కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంస్థ కట్టుబడి ఉందని సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారని ఎమ్మెల్సీ చెప్పారు.

# రాష్ట్రంలో హ్యుందాయ్ భారీ పెట్టుబడులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన దక్షిణ కొరియా ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటారు కంపెనీ తెలంగాణలో కార్ల మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించనుంది. దాని భారతీయ విభాగమైన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజి నీరింగ్(హెచ్ఎంఐఈ) ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఈ పని చేయనుంది. ఇందులో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతోపాటు అత్యాధునిక కార్ల తయారీ సౌకర్యం(విద్యుత్ వాహనాలు సహా) ఉంటుంది. ఈ కంపెనీ జహీరాబాద్‌లోని నిమ్జ్‌లో 675 ఎకరాల్లో సుమారు రూ.8,528 కోట్ల భారీ పెట్టుబడులు పెట్టనుంది. రాష్ట్రంలో ముందుగా గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్ అండ్ డీ) సెంటర్‌ను మాత్రమే స్థాపించాలని హ్యుందాయ్ మోటార్స్ భావించగా, తాజాగా నిమ్జ్‌లో టెస్టింగ్ కార్ల తయారీ పరిశ్రమను కూడా ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయాలను పరిశ్రమ వర్గాలు తెలుపుతున్నాయి.
ఈ కంపెనీ రావడం వల్ల సుమారు 4,200 మంది స్థానిక యువతకు ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అలాగే కంపెనీ ప్రతినిధులు ఈనెలలోనే రాష్ట్రానికి రానున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తమ కంపెనీ తెలంగాణలో ప్రారంభించనున్న ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఆ సంస్థకు చెందిన ఇంజినీరింగ్ కేంద్రం పునరుద్ధరణ, విస్తరణ, ఆధునీకరణ ద్వారా హెచ్ఎంఐఈ భారత్ సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మరింత మందికి ఉపాధిని కూడా కల్పించనుంది. గతేడాది ఆగస్టులో దక్షిణ కొరియాలో రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహా ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. పర్యటన సందర్భంగా సియోల్‌లో హ్యుందాయ్ మోటార్ కంపెనీ అధికారులతో ఆ బృందం సమావేశమయింది. గతంలోనే నిమ్జ్‌లో సుమారు రూ.3 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు హ్యుందాయ్ సంస్థ ముందుకు వచ్చింది. ఇప్పుడు మళ్లీ సీఎం రేవంత్ చొరవతో మరో రూ.5,528 కోట్ల పెట్టుబడులను పెట్టడానికి ఆ సంస్థ ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర పెట్టుబడుల ప్రచార మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల సమావేశమై కంపెనీ స్థాపనకు అనుకూలంగా పచ్చజెండా సైతం ఊపింది. ఈ పరిశ్రమలో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, ప్రొటో టైపింగ్ సిస్టమ్, పైలట్ టెస్ట్ ట్రాక్‌లు ఉండనున్నాయి.

# పాకిస్థాన్‌ను వణికిస్తున్న వరుస భూకంపాలు

**కరాచి, జూన్ 5:** పొరుగుదేశం పాకిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. ఆ దేశంలో అతిపెద్ద నగరమైన కరాచీ లో 48 గంటల్లో ఏకంగా 20కిపైగా భూ ప్రకంపనలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి 48 గంటల్లో దాదాపు 21సార్లు భూమి కంపించింది. ఈ ప్రకంపనల తీవ్రత రిక్టరు స్కేలుపై 2.1 నుంచి 3.6 మధ్య ఉన్నాయి. ఆదివారం రాత్రి 3.6 తీవ్రతతో సంభవించిన భూకంపం అత్యంత శక్తివంతమైందిగా అక్కడి అధికారులు తెలిపారు. ఈ ప్రకంపనల ధాటికి మాలిర్ జిల్లా జైలు గోడ పాక్షికంగా కూలిపోయింది. దీంతో దాదాపు 216 మంది ఖైదీలు పరారయ్యారు. ఇలా కొన్ని గంటల వ్యవధిలోనే వరుసగా స్వల్ప స్థాయిలో భూమి కంపిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇది దేనికి సంకేతమో అంటూ ఆందోళన చెందుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రమాదకరమైన భూకంపం వచ్చే అవకాశం ఉందేమోనని భయపడుతున్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదంటూ అక్కడి అధికారులు సూచిస్తున్నారు. అయితే, కొన్ని స్వతంత్ర సంస్థలు మాత్రం ప్రమాదం పొంచి ఉందంటూ హెచ్చరిస్తున్నాయి. మరోవైపు 48 గంటల్లోనే దాదాపు 21 సార్లు భూమి కంపించినప్పటికీ యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే, భారతదేశానికి చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ మాత్రం ఆదివారం నుంచి కరాచీ ప్రాంతంలో ఎలాంటి భూకంప కార్యకలాపాలు నమోదు చేయలేదు. దీంతో పాక్ వ్యవస్థలపై పలు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి


# 'లక్ష్మీ నరసింహా' రీరిలీజ్ బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ లక్ష్మీ నరసింహా మరోసారి థియేటర్స్‌లో అలరించడానికి సిద్ధమైయింది. జయంత్ సి.పరాన్జీ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత బెల్లం కొండ సురేష్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైన ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్‌లో జూన్ 8న థియేటర్స్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రీ రిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ వెర్షన్‌లో కొత్త పాట యాడ్ చేశారు. మందేసినోడు అంటూ సాగే పాటని భీమ్స్ సిసిరోలియో అన్‌స్టాపబుల్ వైబ్‌తో కంపోజ్ చేశారు. స్వరాగ్ కీర్తన్ హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్‌కి ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ మాస్‌ని కట్టిపడేసే లిరిక్స్ అందించారు. రీరిలీజ్ ప్రెస్ మీట్‌లో ఈ సాంగ్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ప్రెస్ మీట్‌లో నిర్మాత బెల్లం కొండ సురేష్ మాట్లాడుతూ, అందరికీనమస్కారం. ఈ సినిమా రీరిలీజ్‌ని లైఫ్‌లో మర్చిపోలేను. 21 ఏళ్ల తర్వాత లక్ష్మీ నరసింహా సినిమాని రీరిలీజ్ చేస్తున్నానంటే నందమూరి అభిమానులకు ఏదో ఒక స్పెషల్, సర్ప్రైజ్ ఇవ్వాలి. ఎలాంటి సర్ ప్రైజ్ అని ఆలోచన వచ్చినప్పుడు.. ఈ సినిమా కోసం రెండు సాంగ్స్ చేశాం. ఒక సాంగ్‌ని షూట్ చేసాంగాని సినిమాలో లేదు. ఆ సాంగ్‌ని ఎలాగైనా రీరిలీజ్‌లో యాడ్ చేయాలి అని ఆలోచన వచ్చింది. ప్రసాద్ ల్యాబ్స్‌లో నెగిటివ్ దొరికింది. కానీ సౌండ్ దొరకలేదు సౌండ్ లేదు. ఓన్లీ పిక్చర్ ఉంది. పిక్చర్ ప్రింట్ చేసి ఫస్ట్ చంద్రబోస్‌కి, తర్వాత డైరెక్టర్‌కి, భీమ్స్‌కి పంపించాను. వాయిస్, లిరిక్ రాసి రికార్డు చేయాలని చెప్పాను. బోస్ ఇది ఎలా పాజిబుల్ అన్నారు. చేస్తేనే పాజిబుల్ అవుతుందని చెప్పాను. ఒకసారి ప్రయత్నించమని చెప్పాను. అయితే ఈ ప్రయత్నాన్ని అద్భుతంగా చేశారు. ఈ పాటని డిస్ట్రిబ్యూటర్స్‌కి వినిపిస్తే పాట అద్భుతంగా ఉంది. కొత్త సినిమాల్లో పెట్టండి బ్లాక్ బస్టర్ అవుతుంది అని చెప్పారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావాలని మన



స్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ జయంత్ సి.పరాన్జీ మాట్లాడుతూ, అందరికినమస్కారం. సురేష్‌కి థాంక్యూ. ఇలాంటి కొత్త ఐడియాలన్నీ సురేష్‌కి వస్తాయి. ఆడియో లేని ఈ సాంగ్‌కి ఏదైనా చేద్దామని ఆయన అన్నప్పుడు నేను ఇంపాజిబుల్ అని చెప్పాను. ఆయన, చంద్రబోస్, భీమ్స్ కలిసి ఈ అద్భుతం చేశారు. ఒక ఇంపాజిబుల్ టాస్‌ని పాజిబుల్ చేసి చూపించారు. ఇళయరాజా ఇలాంటి ఒక ప్రయోగం చేశారని ఎప్పుడో విన్నాను. అయితే అది ఒక మాంటేజ్ సాంగ్.

## 'రానా నాయుడు సీజన్ 2': నాగనాయుడు పాత్ర సూపర్బ్



ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్ చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమోళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10, 2012 న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రథన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్‌గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## 13న 'అందాల రాక్షసి' రీరిలీజ్

ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్‌చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమోళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10, 2012న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రథన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్ గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## 'చౌకీదార్' నుంచి సాంగ్

డైలాగ్ కింగ్ సాయి కుమార్ ప్రస్తుతం ఏ చిత్రంలో నటిస్తే ఆ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఆయన నటించిన సినిమాలన్నీ కూడా బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. ఇక ఆయన నటించిన కమిటీ కుర్రోళ్లు, లక్కీ భాస్కర్, సరిపోదా శనివారం, మెర్సీ కిల్లింగ్ వంటి చిత్రాలకు గద్దర్ అవార్డులు కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి సాయి కుమార్ ప్రస్తుతం తెలుగు, కన్నడ భాషల్లో చౌకీదార్ అనే సినిమాను చేస్తున్నారు. ఈ చిత్రంలో పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా నటిస్తున్నారు. చౌకీదార్ మూవీని వీఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద డా.కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మిస్తుండగా, చంద్రశేఖర్ బండియప్ప తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈచిత్రానికి సంబంధించిన ఓ ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. నాన్న గొప్పదనం చాటి చెప్పేలా గుండెను పిండేసేలా ఓ చక్కటి బాణీని అందించారు. నాన్నా అంటూ సాగే ఈ పాటను సంతోష్ వెంకీ రచించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. సచిన్‌బస్రూర్ అందించిన బాణీ అయితే ప్రతీ ఒక్కరినీ కదిలించేలా ఉంది. తండ్రి త్యాగాల్ని, మోసే బాధ్యతల్ని, చూపించే ప్రేమను చాటేలా పాటను రచించారు. ఇక లిరికల్ వీడియో చూస్తుంటే సాయి కుమార్ తండ్రిగా మరోసారి ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉన్నారు. పృథ్వీ అంబర్, సాయి కుమార్ మధ్య మంచి ఎమోషనల్ సీన్స్ ఉండేట్టుగా కనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు.





శ్రీనిధి శెట్టి నయా లుక్

## 13న 'కట్టప్ప జడ్జిమెంట్' విడుదల

అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మాతగా బాహుబలి కట్టప్ప సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం కట్టప్ప జడ్జిమెంట్. తీర్పుగల్ విర్కపడుమ్ తమిళ చిత్రాన్ని తెలుగులో కట్టప్ప జడ్జిమెంట్ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత వెంకట స్వామి. బాహుబలి కట్టప్ప అంటే తెలుగులో తెలియని ప్రేక్షకులు వుండరు. అంతలాఎడతెగని అనుబంధం ఉంది తెలుగులో సత్యరాజ్ గారికి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఏ సర్టిఫికెట్ అందుకుంది. జూన్ 13న తెలుగులో విడుదల చేయడానికి నిర్మాత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యర్థి పాత్రలో మధు సూదనరావు అద్భుతంగా నటించారు. పూర్తి మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చాడో వెండితెరపై చూసి తెలుసుకోండి. ఈ చిత్రానికి ధీరన్ దర్శకత్వం వహించారు. మరియు స్మృతి వెంకట్, సత్యరాజ్, హారీష్ ఉత్తమన్ మరియు మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు.



## 90స్‌లో నగ్మా యూత్ కలల రాకుమారి

90స్‌లో యూత్ కలల రాకుమారి. 1994లో విడుదలైన తమిళ చిత్రం కాదలన్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో కట్టిపడేసింది. తెలుగు, తమిలం, మలయాళం, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇంతకీ హీరోయిన్ నగ్మా గుర్తుందా..?



ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 1994లో విడుదలైన కాదలన్ అనే తమిళ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించింది. సూపర్ స్టా రజినీకాంత్ జోడిగా బాషా చిత్రంతో సూపర్ హిట్ అందుకుంది. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించింది. సినీరంగంలో నగ్మా చెల్లెల్లు సైతం హీరోయిన్లుగా రాణించారు. నగ్మా చెల్లెల్లు మరెవరో కాదు.. జ్యోతిక, రోషిణి. దశాబ్దాలపాటు సినీరంగంలో వరుస సినిమాలతో అలరించిన నగ్మా.. 2008 నుంచి సినిమాలకు దూరంగా ఉండిపోయారు. చాలా కాలం తర్వాత నగ్మా ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఇటీవలే సూర్య, జ్యోతిక దంపతుల కుమార్తె దియా ఇంటర్ పూర్తి చేసింది. తాజాగా ఆమె గ్రాడ్యుయేషన్ వేడుకలకు సంబంధించిన ఫోటోస్ షేర్ చేస్తూ తల్లిదండ్రులుగా తాము గర్వపడుతున్నామంటూ రాసుకొచ్చింది జ్యోతిక. అయితే ఈ కార్యక్రమంలో నటి నగ్మా కూడా పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది నగ్మా. అందులో ఆమె గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

## ఎస్ఎల్‌వి సినిమాస్ గ్రాండ్ లాంచ్

ఎలక్ట్రిక్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎఫర్ట్ లెస్ యాక్టింగ్, అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో అలరించే మాస్ మహారాజా రవితేజ, ఫ్యామిలీ ఎంటర్టైనర్ల మాస్టర్, దర్శకుడు కిషోర్ తిరుమలతో కలిసి ఆర్‌టి76 ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. క్యాలిటీ, హై ఎంటర్ టైన్మెంట్ వాల్యూస్‌తో సినిమాలని అందించడంలో పాపులరైన ప్రతిష్టాత్మక ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం ఈరోజు ముహూర్తపు వేడుకతో ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ సిగ్నేచర్ స్టయిల్, కామెడీతో కూడిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌ని రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ కథలో రవితేజ తనదైన ఎనర్జీతో అలరించనున్నారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో రవితేజ వెరీ స్టైలిష్ అవతార్‌లో, డిజైనర్ సూట్ ధరించి కనిపిస్తున్నారు. ఎయిర్ క్రాఫ్ట్ సీటులో హాయిగా కూర్చున్న అతను, ముందు సీటుపై ఒక కాలు క్యాజువల్‌గా ఆనించి, ఒక చేతిలో వైన్ బాటిల్, మరో చేతిలో పుస్తకంతో కనిపించడం అదిరిపోయింది. ఇది ఇప్పటివరకు రవితేజ మోస్ట్ స్టైలిష్ లుక్‌ను సూచిస్తుంది. అతను పట్టుకున్న పుస్తకంలో సీ ఇట్ అండ్ సే ఇట్ స్పానిష్‌లో ఉంది, ఇది అతని పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. బ్లాక్‌బస్టర్ ధమాకా కోసం చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించిన తర్వాత భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి రవితేజతో మళ్ళీ వర్క్ చేస్తున్నారు. ప్రసాద్ మూరెళ్ల డీవోపీగా పని చేస్తున్నారు. అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఆర్‌టి76 రెగ్యులర్ షూటింగ్ జూన్ 16 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుంది. ఈ చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో రిలీజ్ కానుంది. తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, బ్యానర్:ఎస్ఎల్‌వి సినిమాస్ డీవోపీ: ప్రసాద్ మూరెళ్ల సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్ ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి.



## మైసూర్ శాండల్‌కు ప్రచారకర్తగా తమన్నా భాటియా

బుద్ధి చిన్నది అయితే అన్నీ వివాదాలుగానే ఉంటాయి. కర్ణాటకలో జరుగుతున్న మైసూర్ శాండల్ సబ్బు ప్రచారకర్త నియామకం విషయంలో అదే జరుగుతోంది. మైసూర్ శాండల్ సబ్బును తయారు చేసే కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జంట్స్ కంపెనీ తమ ఉత్పత్తుల ప్రచార కర్తగా తమన్నా భాటియాను నియమించుకుంది. రెండేళ్లకు ఆరు కోట్ల రూపాయుల చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే మన సబ్బుకుతమన్నా ఎందుకని కన్నడ నటీమణులు లేరా అని అక్కడి కన్నడ ఉద్యమ సంఘాలు తమ పని ప్రారంభించాయి. మైసూర్ సబ్బును మైసూర్ లోనో.. కర్ణాటకలోనే అమ్మడం లేదని.. దేశ వ్యాప్తంగా అమ్ముతున్నామని.. దేశవ్యాప్త మార్కెట్ కోసం అందర్నీ పరిశీలించిన తర్వాతనే తమన్నాను ఎంపిక చేసుకున్నామని ఆ సంస్థ చెబుతోంది. దీపికా పదుకొనే, రష్మికను కూడా పరిశీలించామని.. కానీ అన్ని అంశాలను చూసిన తరవాత తమన్నానే ఎంపిక చేసుకున్నామన్నారు. తమన్నాకు నేషనల్ వైడ్ పాపులారిటీ ఉంది. సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోయర్లున్నారు. కేఎస్డీఎల్ అనేది ప్రభుత్వ సంస్థ. అందుకే ఇది మరింత వివాదాస్పదం చేస్తున్నారు. మరో మూడేళ్లలో మైసూర్ శాండల్ సోప్ మార్కెట్‌ను ఐదు వేల కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అది నార్త్‌లో మార్కెట్ పెంచు కుంటేనే సాధ్యమవుతుందని అనుకుంటున్నారు. కానీ అక్కడ కన్నడ సంఘాలు మాత్రం.. మా సబ్బు.. మా నటి అని వితండవాదం చేస్తున్నారు.



## నభా నటేష్ ఎమోషనల్ పోస్ట్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫోటోను షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ చేసింది హీరోయిన్ నభా నటేష్. ఆమె ఇన్‌స్టా గ్రామ్ ద్వారా చేసిన ఈ పోస్ట్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్ట్‌తో నేచర్ గురించి నభా బ్యూటిఫుల్ మెసేజ్ ఇచ్చిందంటూ నెటిజన్స్ కామెంట్స్ రాస్తున్నారు. తన సోషల్ మీడియా పోస్ట్‌లో నభా స్పందిస్తూ ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను...ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది. ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతి ని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్‌కి రుణ పడి ఉంటాను. అని పేర్కొంది. ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ మూవీస్‌లో నటిస్తోంది నభా నటేష్. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభుతో పాటు మరో ప్రెస్టీజియస్ మూవీ నాగబంధంలో నటిస్తోంది.



# 19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు

## ఉత్తర్వులు జారీచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధానకారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితులు వర్తిస్తాయి. పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విషయంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు. 2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది. కాగా, 2017లో ట్రంప్ విధించిన ప్రయాణ నిషేధం, ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలను లక్ష్యంగాచేసుకున్నప్పుడు అనేక న్యాయస్థానాల్లో సవాళ్లను ఎదుర్కొంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు నెలల తరబడి జాగ్రత్తగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటువంటి ఆంక్షలు విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని ట్రంప్ వర్సెస్ హవాయి కేసులో సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిందని వైట్ హౌస్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ గుర్తు చేసింది. అయితే, ఈ కొత్త ప్రయాణ నిషేధంనుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు గ్రీన్ కార్డ్ హోల్డర్లు, ఇప్పటికే వీసాలు కలిగి ఉన్న వారు, కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీల వారికి, అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమైన వ్యక్తుల ప్రవేశానికిమినహాయింపులు కల్పించారు. ఈ చర్యను అధ్యక్షుడు ట్రంప్ విదేశీ తీవ్రవాదులు, ఇతర జాతీయ భద్రత, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే వారినుంచి అమెరికాను రక్షించడానికి ఉద్దేశించిన సాధారణ భద్రతా ప్రమాణాలు అని వివరించారు.

# నేరాల హబ్‌గా బీహార్!

## ఎఐసిసి నేత రాహుల్ ధ్వజం



**పాట్నా, జూన్ 5:** ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆధ్వర్యంలో బీహార్ నేరాల హబ్‌గా మారిపోయిందని, నిరుద్యోగం మరింతగా వృద్ధిచెందిందని దీనివల్ల ప్రజలంతా ఉపాధిలేక వలసలు పోతున్నారని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. గయలో ఇటీవల జరిగిన సంఘటనను పురస్కరించుకని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అత్యాచార బాధితురాలి తల్లి అస్వస్థతకు గురయితే చికిత్స చేసేందుకువెళ్లిన వైద్యుడిని చెట్టుకు కట్టి తీవ్రంగా కొట్టిన సంఘటనను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలుచేస్తూ పోస్టుపెట్టారు. అంతేకాకుండా చెట్టుకు కట్టేసి డాక్టర్‌ను కొట్టిన విడియోను కూడా ఆయన జతచేసారు. డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారని ఈకేసులో నిందితులే ఈ ఘాతుకానికి పాల్పడినా ప్రభుత్వంనుంచి స్పందనలేదని ఆయన దుయ్యబట్టారు. అత్యాచార బాధితురాలు తల్లికి చికిత్స చేసినందుకే ఈ రేప్‌కేసు నిందితులు దారుణంగా డాక్టర్‌ను కొట్టారని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రం నేరాలకు హబ్‌గా మారిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని, వలసలు అందుకే పోతున్నారని ఆరోపించారు. ఇవే నితీష్‌కుమార్ బిజెపి ప్రభుత్వం వాస్తవ స్వరూపమని రాహుల్ ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రతినిధి షమా మహ్మద్ కూడా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్రస్థాయిలో విమర్శలుచేసారు. తొమ్మిదేళ్ల అత్యాచార బాధితురాలికి వైద్యం నిరాకరించడంవల్లనే ఆమె చనిపోయిందని ఆరో పించారు. బీహార్‌ను నేరస్తులే నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. మోడీని తీష్‌కుమార్ ప్రభుత్వం పూర్తిగా నేరస్తులకు, నేరముఠాలకు, దౌర్జన్యకారులకు లొంగిపోయిందని విమర్శించారు.

## బిఎస్‌ఎఫ్ జవాన్ కిడ్నాప్

**ముర్షిదాబాద్, జూన్ 4:** సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఓ జవాన్‌ను బంగ్లాదేశ్ వాసులు కిడ్నాప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ బీఎస్‌ఎఫ్ జవాన్‌ను బంగ్లాదేశీయులు కిడ్నాప్ చేసి అతడిని బందీగా ఉంచారు. కొన్ని గంటల తర్వాత అతడిని విడుదల చేశారు. నుర్పూర్ జిల్లాలోని కథాలియా అనే గ్రామం దగ్గర ఉన్న అంతర్జాతీయ సరిహద్దు దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. సుతిర బీఎస్‌ఎఫ్ క్యాంప్ సమీపంలోని చాందనిచౌక్ దగ్గర గల అంతర్జాతీయ సరిహద్దు నుంచి కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిని ఆ బిఎస్‌ఎఫ్ జవాన్ అడ్డుకున్నాడు. దాంతో అతడిని ఆ ముష్కరులు కిడ్నాప్ చేసి బందీ చేశారు. వారందరూ బంగ్లాదేశ్‌లోని చపాయ్ నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన వారేనని తెలుస్తోంది. బిఎస్‌ఎఫ్ జవాన్ కిడ్నాప్ అయిన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని గంటల్లోనే ఆ జవాన్‌ను ముష్కరులు విడిచిపెట్టేశారు. ప్రస్తుతం ఆ జవాన్ క్షేమంగానే ఉన్నాడని సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ బిఎస్‌ఎఫ్ వెల్లడించింది. అయితే ఈ కిడ్నాప్ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# తల్లితండ్రులను పట్టించుకోని సంతానంపై కఠినచర్యలకు ప్రత్యేక చట్టం

## అసోం ప్రభుత్వం 2017 చట్టం పూర్తి స్థాయిలో అమలు



**గువాహతి, జూన్ 5:** అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2017లో తీసుకువచ్చిన ప్రాణం చట్టం అనేది ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు, దివ్యాంగ సోదరుల సంరక్షణ కోసం తీసుకువచ్చిన ప్రత్యేక చట్టం. ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న సంస్థలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , కంపెనీ చట్టం ప్రకారం నిర్వచించిన ప్రభుత్వ కంపెనీలు వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై వర్తిస్తుంది. ఈ చట్టం ద్వారా ఉద్యోగులపై తల్లిదండ్రుల పట్ల బాధ్యతను చట్టబద్ధంగా విధించడం జరిగింది. ఈ చట్టం ఎందుకు అవసరమైంది, సామాజిక మార్పులు, పట్టణీకరణ పెరగడంతో కుటుంబ వ్యవస్థలో మార్పులు వస్తున్నాయి. పెద్దలు కొడుకులపై ఆధారపడే పరిస్థితుల్లో, కొంతమంది వారి బాధ్యతను తేలికగా తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అనాథల్లా మారకూడదన్న ఉద్దేశంతో అసోం ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది కేవలం కుటుంబ విలువలను పరిరక్షించడమే కాదు, ఉద్యోగులను ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా చేస్తుంది. ఈ చట్టం అన్ని స్థాయి ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, ప్రభుత్వ అనుబంధం ఉన్న సంస్థల్లో, కంపెనీ చట్టం కింద ఉన్న సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఈ ఉద్యోగులపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు, వివాహం కాని దివ్యాంగ సోదరులు ఈ చట్టం ద్వారా రక్షణ పొందవచ్చు. ఉద్యోగిపై ఆధారపడే తల్లిదండ్రులు లేదా దివ్యాంగ సోదరులు ఈ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చు. ఉద్యోగి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, లేదా మౌలిక అవసరాలు కలిగించకపోతే, వారు అధికారుల వద్ద రాయితీగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం "ఆధారిత తల్లిదండ్రులు" అంటే తమకు ఆదాయ మార్గాలు లేకపోయి, కొడుకు లేదా కుమార్తెపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు. వారు పెన్షన్ పొందకపోవడం, సొంత ఆదాయ మార్గం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఉంటే, వారిని ఈ చట్టం రక్షిస్తుంది. ఆధారిత దివ్యాంగ సోదరుడు/సోదరి అంటే వైకల్యం ఉన్న, వివాహం కాని వ్యక్తి. అటువంటి సోదరుడు/సోదరి తన జీవనాన్ని కొనసాగించడానికి తగిన ఆదాయం లేక, ఉద్యోగిపై ఆధారపడే వారిగా పరిగణించబడతారు.

వారిని తగిన విధంగా సంరక్షించడం ఉద్యోగి బాధ్యతగా ఈ చట్టం పేర్కొంటుంది. ఆధారిత తల్లిదండ్రులులేదా దివ్యాంగ సోదరులు ఫారమ్‌లో నియమిత అధికారికి ఫిర్యాదు ఇవ్వవచ్చు. ఇది రాతపూర్వకంగా ఉండాలి. ఎప్పుడు అయినా ఫిర్యాదు చేయొచ్చు. అధికారి దానిని స్వీకరించి విచారణకు తీసుకుంటారు. వారు ఫిర్యాదులను పరిశీలించి, 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

## పినాకిమిశ్రాను వివాహమాడిన మహువామొయిత్రా

### ఇద్దరూ ఎంపీలే, రెండురాష్ట్రాల్లో ప్రాతినిధ్యం



**కోల్‌కత్తా, జూన్ 5:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మోయిత్రా బిజెడి ఎంపి పినాకి మిశ్రాను వివాహమాడినట్లు తెలిసింది జర్మనీ నగరం బెర్లిన్‌లో గతనెల మూడో తేదీ జరిగిన ఈ వివాహానికి సంబందించిన వారి ఫోటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయింది. రెండు పర్యాయాలు లోక్‌సభ ఎంపిగా కృష్ణనగర్ నియోజక వర్గంనుంచి ఎన్నికైన మొయిత్రా పినాకి మిశ్రాను వివాహమాడారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంనుంచి మిశ్రా ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న మొయిత్రా ఒంటినిండా బంగారు నగలతో మిశ్రాతో నడుస్తున్నట్లు కనిపించారు. 1974 అక్టోబరు 12వ తేదీ అస్సాంలో జన్మించిన మొయిత్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత 2010లో టిఎంసిలో చేరారు. కృష్ణనగర్‌నుంచి 2019లో మొదటిసారి ఎన్నికకాగా మళ్లీ 2024లో కూడా ఎన్నికయ్యారు. పార్లమెంటులో నియంత్రృత్వానికి సంబంధించిన ఆరు సూచనలు అన్న అంశంపై ఆమెచేసిన ప్రసంగంతో అందరిదృష్టిలోకి వచ్చారు. ఇక పినాకి మిశ్రా 1959 అక్టోబరు 23న ఒడిశాలోని పూరిలోజన్మించారు. సీనియర్ రాజకీయవేత్త, న్యాయవాదికూడా ఢిల్లీ వర్సిటీ నుంచి లా డిగ్రీ సాధించారు. మిశ్రా తన రాజకీయ ప్రయాణం ఐఎన్‌సినుంచే ప్రారంభించారు. 1996లో పూరి సీటును ఎన్నికయ్యారు. ఆ తర్వాత నవీన్ పట్నాయక్ బిజుజనతాదళ్‌లో ఎన్నికయి అనేకసార్లు అంటే 2009, 2024, 2019ల్లో కూడా ఎన్నికయ్యారు.

# అమెరికాలో వలసదారుల అరెస్టులు

## ఒక్కరోజులోనే 2200 మంది

**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికాలో వలసదారుల అరెస్టులు ప్రారంభమైనాయి. ఆ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2,200 మందిని అరెస్ట్ చేశారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఒక్క రోజులోనే 3 వేల మందిని అరెస్ట్ చేయాలని ఆదేశించారని పేర్కొనడంతో ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయని తెలిపింది. అయితే ఒక్క రోజులోనే ఇంత మందిని అరెస్ట్ చేయడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమమని స్పష్టం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసిఇ అధికారులు అల్టర్‌నేటివ్ టు డిటెక్షన్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కింద పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా.. యాంకిల్ ద్వారా స్మార్ట్ యాప్స్‌తోపాటు జియో లోకేషన్ పరికరాల ద్వారా వారిని పర్యవేక్షిస్తుంటారు. అలాగే వారు తరచూ ఐసిఇ కేంద్రాలకు రావాల్సి ఉంటుందని ఇప్పటికే వారికి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఎడిటిలో నమోదైన వలసదారులు ఐసిఇ కార్యాలయాలకు రావాలంటూ సందేశాలు పంపుతున్నారు. అలా వచ్చిన వారిని అరెస్ట్ చేసి కార్లలో తరలిస్తున్నారు. గతంలో ఐసిఇ పిలుపు వచ్చినా హాజరు కానీ వారిని దేశం విడిచి వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో వలసదారులను వెనక్కి పంపిస్తామని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలికి బెయిల్



**కోల్‌కత్తా, జూన్ 5:** ఆపరేషన్‌సింధూర్‌పై అభ్యంతరకరపోస్టులుపెట్టిన న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలికి కోల్‌కత్తా హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ఆమెపై కోల్‌కత్తాపోలీసులు కేసులు నమోదుచేసిన సంగతి తెలిసిందే. రూ.10 వేల పూచీకత్తుతో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గురుగ్రామ్‌లో అరెస్టు అయిన పనోలి ఈనెల 13వ రకూ జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆపరేషన్ సిందూర్‌పై బాలివుడ్ నటుల మౌనం ప్రశ్నిస్తూ ఆమె ఇన్‌స్టాలో విడియోను పోస్టు చేసింది. ఆపోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. అనేకమంది సోషల్‌మీడియా యూజర్లు ఆమెను హెచ్చరిస్తూ వ్యాఖ్యలుపెట్టారు. దీనితో ఆమె ఆ విడియోను తొలగించి బహిరంగ క్షమాపణలు చెప్పింది. బెంగాల్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో పనోలిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని ఆమె తరపు న్యాయవాది వాదించారు. వజాఖత్ ఖాన్ ఖాద్రి అనే వ్యక్తి గార్డెన్ రీచ్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదుచేసారు. విచిత్రం ఏమిటంటే ఫిర్యాదుచేసిన ఖాద్రికూడా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇపుడు అంశంపై ముమ్మర దర్యాప్తుచేస్తున్నారు. ఒక మతపరమైన ట్రస్టు శ్రీరామ్ స్వాభిమాన్ పరిషద్ సంస్థ గార్డెన్‌రీచ్‌పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదుచేసింది. ముంబయి, అస్సాం, దేశంలోని ఇతర ప్రాంతాల్లోకూడా ఖాద్రిపై కేసులు నమోదయ్యాయి. విద్వేషకర ప్రసంగాలు చేస్తున్నారని, దీనివల్ల ఉద్రిక్తతలు,హింస పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఫిర్యాదులు నమోదయ్యాయి.

# ఆర్సీబీ విజయోత్సవాల వేళ విధుల్లో 1000 మంది పోలీసులు

## హైకోర్టుకు వెల్లడించిన కర్ణాటక ప్రభుత్వం

**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబి విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే అంతకుముందు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ ఆర్సీబి ఈవెంట్‌కు 5 వేల మంది పోలీసులులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం. తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది.ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం. అన్నవి ఆలోచించాలి అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ ఈ స్టేడియం సామర్థ్యం 35 వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30 వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5 లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవగా సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# తొక్కిసలాట ఘటనను రాజకీయంచేస్తున్న బిజెపి

## కన్నీటి పర్యంతం అయిన కర్ణాటక డిప్యూటీ సిఎం



**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబీ విజయం సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటను ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని, ఇది రాజకీయాలుచేసే సమయం కాదని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతు జరిగిన సంఘటనపట్ల క్షమాపణలు చెపుతున్నానని, ఇది ఎంతో ఘోరమని ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. బెంగళూరు ప్రతిష్టను ప్రతిపక్షాలు మరింత దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. పోలీసులు అనుమతులివ్వలేదన్న వార్తలపై ఆయనస్పందిస్తూ బిజెపి నేతల విమర్శలపై తానుస్పందించబోనని నేను కర్ణాటక ప్రజలకు జవాబుదారీ అని దేశ ప్రజలకు జవాబుదారీ అని ఆయనఅన్నారు. బిజెపి నాయకులే ఇలాంటి విషప్రచారానికి కుట్రదారులని డికె ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు శవరాజకీయాలుచేసుకోనీయండి, ఎన్ని మృతదేహాలపై వారు శవరాజకీయాలు చేసారన్నదానిపై నేను జాబితారూపొందిస్తానని అన్నారు. ఎంతో బాధగాఉంది. బాధితులు మన రాష్ట్రంవారు, బెంగళూరువారు మన సొంతకుటుంబం వారే. బెంగళూరు, కర్ణాటక ప్రతిష్ట పూర్తిగా పోయిందని మేం బాధ్యత తీసుకుంటున్నాం, ఎవ్వరినీ నిందించడంలేదని ఈ సంఘటన అనూహ్యంగా జరిగిందని, ఇంత భారీస్థాయిలో అభిమానులు వస్తారని ఎవ్వరూ ఊహించలేదని ఆయన అన్నారు.

# యుఎస్ వీసా కోసం సోషల్ మీడియా ఖాతాల తొలగింపు!

## 'వెట్టింగ్' ప్రభావం..





**వాషింగ్టన్, జూన్ 5:** వలసదారుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడానికి ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేస్తామని అమెరికా ప్రభుత్వం చెప్పింది. ఈ పరిణామాలు అమెరికాలో చదవాలని కలలు కంటోన్న భారతీయ విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. దాంతో వివాదానికి దారితీస్తాయని భావిస్తోన్న పోస్టులను వారి డిలీట్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగిస్తున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

వీసా ఇంటర్వ్యూల సమయంలో వారి రాజకీయపరమైన అభిప్రాయాలు తప్పుగా అర్థం చేసుకుంటారేమోననే ఆందోళన ఇందుకు కారణమవుతోంది. మామూలుగా చేసే కామెంట్, ఎలాంటి హాని తలపెట్టని పోస్టును కూడా పరిగణనలోకి తీసుకొని వీసాను ఎక్కడ తిరస్కరిస్తారోనని వారు భయపడుతున్నారు. అమెరికా అధికారులు అనుమతించని కంటెంట్‌ను లైక్ లేక షేర్ చేయడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని, ఇలా ఆకస్మికంగా పోస్టులు, ఖాతాలు తొలగించడం కూడా అనుమానాలు రేకెత్తిస్తుందని వీసా కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు గత ఐదు సంవత్సరాల కాలానికి సంబంధించి సోషల్ మీడియా వివరాలు అందించాలని ఇమిగ్రేషన్ అధికారులు కోరతారని నిపుణులువెల్లడించారు. దాంతో వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుందన్నారు. వారినేపథ్యం వీసా లక్ష్యాలకు సరిపోతుందా లేదా?అని తనిఖీ చేస్తారు. చిన్నపాటి రాజకీయ కార్యకలాపాలు, వివాదాస్పద కామెంట్లను వీసా పరిశీలన సమయంలో అనుమానాస్పదంగానే పరిగణిస్తారని హెచ్చరిస్తున్నారు.

**ఏమిటీ సోషల్ మీడియా వెట్టింగ్..?**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్ని 'సోషల్ మీడియావెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

# పాక్ 'మేడమ్-ఎన్' వలలో భారత్ ఇన్‌ఫ్లూయెన్సర్లు!



**ఇస్లామాబాద్, జూన్ 5:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కింద పనిచేసే.. ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. షెహజాదకు నిఘా సంస్థ ఐఎస్ఐతో బలమైన సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'.

హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డులో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతో ఉన్న బలమైన సంబంధాలు తెలుస్తాయి. ఈమె సంస్థ భారత్‌లోని ఢిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని ప్రశ్నించగా.. షెహజాద పాత్ర వెలుగు చూసింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్‌సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, ఆర్మీనుంచి ఆమెకు స్పష్టమైన సూచ నలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. మన దేశంలోని దాదాపు 3,000 మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు గత ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడిఉంది. అక్కడి ఫస్ట్‌సెక్రటరీ (వీసా) సైహైల్‌కమర్,కౌన్సిలర్‌ఉమర్ ప్రేయర్‌తో బలమైన సంబంధాలున్నాయి. ఆమెనుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్‌రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసావచ్చేసేది. జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూడటంతో డానిష్‌ను భారత్‌నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే.



# టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ కెప్టెన్‌గా పాట్ కమిన్స్

## భారత్ నుంచి యశస్వి, బుమ్రాలకు చోటు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ మ్యాచ్ ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌తో డబ్ల్యూటీసీ మూడో సైకిల్ ముగుస్తుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు టెస్టు ఛాంపియన్ షిప్ కోసంపోటీపడనున్నాయి. ఈనేపథ్యంలో క్రికెట్ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 2023 -25 టీమ్ ఆఫ్‌ది టోర్నమెంట్‌ను ప్రకటించింది. మూడో సైకిల్‌లో రాణించినఆటగాళ్లతో కూడిన ఎలెవన్‌ను ప్రకటించింది. ఈ జట్టును ప్రకటించేందుకు కేవలం ఆటగాళ్ల గణాంకాల పైన మాత్రమే ఆధారపడలేదు. వివిధ పరిస్థితుల్లో ఆటగాళ్ల చూపిన ప్రదర్శన ఆధారంగా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ జట్టులో భారత్ కు చెందిన ఇద్దరు ఆటగాళ్ల చోటు దక్కించుకున్నారు. ఇందులో ఒకరు యువఆటగాడు యశస్వి జైస్వాల్ కాగా, రెండోఆటగాడు బుమ్రాకావడం విశేషం. డబ్ల్యూటీసీ మూడోసైకిల్‌లో జైస్వాల్ 19 టెస్టులు ఆడి 1798 పరుగులు చేశాడు. ఇందులో 4శతకాలు, 10 అర్ధశతకాలు ఉన్నాయి. మరోవైపు బుమ్రా 15 టెస్టులు ఆడి 77వికెట్లు తీశాడు. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో 32 వికెట్లు పడ గొట్టాడు. ఆస్ట్రేలియాకు చెందిన పాట్‌కమిన్స్ కెప్టెన్‌గా ఎంపిక అయ్యాడు. ఆసీస్‌కే చెందిన ఉస్మాన్ ఖవాజా, అలెక్స్ కేరీలు కూడాజట్టులో చోటుదక్కించుకున్నారు. న్యూజిలాండ్ నుంచి కేన్ విలిమయ్సన్, మాట్ హెన్రీలు చోటు దక్కించుకోగా ఇంగ్లాండ్ నుంచి జోరూట్, హ్యారీ బ్రూక్‌లు అవకాశం దక్కించుకున్నారు. శ్రీలంక నుంచి కమిందు మెండిస్,పాకిస్థాన్ నుంచి నోమన్ అలీలు జట్టులో చోటు దక్కించుకున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2023-25 టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ జట్టులో పాట్ కమిన్స్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఉస్మాన్ ఖవాజా, కేన్ విలియమ్సన్, జో రూట్, హ్యారీ బ్రూక్, కమిందు మెండిస్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, మాట్ హెన్రీ, నోమన్ అలీ, కగిసో రబాడను 12వ ఆటగాడిగా తీసుకుంది.



### ఆర్చరీ మహిళల ప్రపంచ కప్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ టీమ్

## రికర్వ్ ఈవెంట్‌లో మిశ్రమ ఫలితాలు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 లో మధుర ధమన్ గోంకర్ తన అద్భుతమైన పరుగును కొనసాగించింది, కాంపౌండ్ మహిళల అర్హత రౌండ్‌లో నాల్గవ స్థానంలో నిలిచింది, గురువారం జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించడంతో భారత్ మూడవ సీడింగ్‌ను సాధించడానికి మరియు క్వార్టర్ ఫైనల్స్‌కు నేరుగా ప్రవేశించడానికి సహాయపడింది. మూడేళ్ల తర్వాత గత నెలలో అంతర్జాతీయ సర్క్యూట్‌లోకి అద్భుతంగా పునరాగమనం చేసిన మధుర, షాంఘై స్టేజ్ 2లో అభిషేక్ వర్మతో కలిసి వ్యక్తిగత స్వర్ణం, మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం మరియు మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో మూడు పతకాలను గెలుచుకుంది. అంటాల్యలో, ఆమె దక్షి ణ కొరియాకు చెందిన హాన్ సెంగ్యోన్ (603) కంటే కేవలం మూడు పాయింట్లు వెనుకబడి ఉంది. ఆమె టాప్‌ఫోర్ ఫినిషింగ్‌తో, మధుర వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్ యొక్క రెండవ రౌండ్‌లో కూడా బై పొందింది. పోటీలో ఉన్న ఇతర భారతీయ మహిళలలో, చికిత్స తనిపర్తి 11వ స్థానంలో నిలిచి తర్వాతి స్థానంలో నిలిచింది, అయితే బహుళ ప్రపంచ కప్ బంగారు పతక విజేత జ్యోతి సురేఖ వెన్నం స్వల్ప ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో 19వ స్థానంలో నిలిచింది. ఇక పురుషుల కాంపౌండ్ విభాగంలో, భారత్ జట్టు ఈవెంట్‌లో ఐదవ స్థానాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత అర్హతలో రిషబ్ యాదవ్ భారత త్రయంలో అత్యుత్తమంగా 13వ స్థానంలో నిలిచాడు, అనుభవజ్ఞుడైన అభిషేక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఓజాస్ డియోటలే వరుసగా 29వ మరియు 34వ స్థానాల్లో నిలిచారు. కాగా భారత్‌కు రికర్వ్ ఈవెంట్‌లు మిశ్రమ ఫలితాలను వచ్చాయి. పురుషుల అర్హత రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర 13వ స్థానంలో, అతాను దాస్ 15వ స్థానంలో, గత ప్రపంచ కప్ దశలో కాంస్యం గెలిచిన పార్థ్ సలుంఖే 26వ స్థానంలో నిలిచారు, జట్టు ఐదవ ర్యాంకింగ్‌తో ముగిసింది. అయితే భారత మహిళల రికర్వ్ ఆర్చర్లు ఇబ్బంది పడ్డారు. మాజీ ప్రపంచ నంబర్ 1 దీపికా కుమారి 35వ స్థానంలో నిలవగా, అంకితా భకత్ (33వ) అత్యుత్తమ స్థానంలో నిలిచింది. సిమ్రంజీత్ కౌర్ 54వ స్థానంలో నిలిచారు, మహిళల జట్టు 12వ స్థానంలో నిలిచింది.

### చరిత్ర సృష్టించిన

# జకోవిచ్

## వరల్డ్ మూడో ర్యాంకర్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ 2025 టోర్నీలో సెమీఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు. పురుషుల క్వార్టర్ ఫైనల్లో 38 ఏళ్ల వయసున్న నొవాక్ జకోవిచ్ 4-6, 6-3, 6-2, 6-4తో ప్రపంచ మూడో ర్యాంకర్



అయిన అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)ని ఓడించాడు. ఈ విజయంతో జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 100 విజయాలు పూర్తి చేసుకున్నాడు. రఫెల్ నాథల్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా జకోవిచ్ నిలిచాడు. అంతేకాకుండా జకోవిచ్‌కు ఇది 51వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్. ఇది ఒక కొత్త రికార్డు. మూడు గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. తొలి సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన జ్వెరెవ్ 6 4తో సొంతం చేసుకున్నాడు. మొదటి సెట్ కోల్పోయిన తర్వాత జకోవిచ్ తన ఆటను మెరుగుపర్చుకున్నాడు. అద్భుతమైన డ్రాప్ షాట్స్, బలమైన డిఫెన్స్‌తో జ్వెరెవ్‌ను ఇబ్బంది పెట్టాడు. జకోవిచ్ తన అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌పై పట్టు సాధించాడు. కీలక సమయాల్లో బ్రేక్ పాయింట్లను మార్చుకోవడంలో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏస్‌లతో పాటు 42 విన్నర్లు కొట్టాడు. 29 తప్పిదాలు చేసిన అతడు 35 డ్రాప్ షాట్స్ ఆడి 121 పాయింట్స్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ 4 ఏస్‌లు, 38 విన్నర్స్ కొట్టాడు. 44 అనవసర తప్పిదాలు చేసిన జ్వెరెవ్ 12 డ్రాప్ షాట్స్ మాత్రమే ఆడి 101 పాయింట్స్ సాధించాడు.



### ఇండోనేసియా ఓపెన్‌లో..

# సింధు, ట్రీసా-గాయత్రీ ఔట్

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్-2025 టోర్నమెంట్ నుండి భారత క్రీడాకారిణి పివి సింధు వైదొలగింది. గురువారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో థాయిలాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్ చేతిలో ఓడిపోవడంతో సింధు ఇండోనేషియా ఓపెన్ 2025 నుండి నిష్క్రమించక తప్పలేదు. ఈ టోర్నీమెంట్‌లో సింధు ఉత్సాహంగా ఆరంభించి, 10-16తో వెనుకబడినప్పటి నుండి కోలుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే, చోచువాంగ్ రెండవ గేమ్‌లో ధీటుగా స్పందించి, 21-10తో ఆధిక్యాన్ని ముగించే ముందు 10 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

నిర్ణయాత్మక జట్టు చాలా వరకు హోరాహోరీగా సాగింది, కానీ చివరి దశలో చోచువాంగ్ ఆడి మ్యాచ్‌ను 21-18తో ముగించింది. ఇక మహిళల డబుల్స్ ద్వయం ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 16వ రౌండ్ దశలో జపాన్‌కు చెందిన యుకీ ఫుకుషిమా మరియు మయు మట్సుమోటో చేతిలో 13-21, 22-24 తేడాతో ఓడిపోయారు.

### వాలీబాల్ నేషన్స్ లీగ్‌లో

## ఛాంపియన్‌గా

# ఇరాన్

## 3-0తో భారత్ క్లీన్ స్వీప్



**న్యూఢిల్లీ:** పురుషుల నేషన్స్ లీగ్-2025 టోర్నీ ఫైనల్లో ఇరాన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన ఫైనల్‌లో టాప్ సీడ్ ఇరాన్‌వరుస గేమ్‌లతో విజయం సాధించి భారత్‌ను క్వీన్ స్వీప్ చేసింది. దీంతో భారత్ 0-3 తేడాతో ఓటమి పాలైంది. ఉజ్బెకిస్తాన్‌లోని ఫెర్గానాలో జరిగిన సిఎవిఎ నేషన్స్ లీగ్ ఫైనల్‌లో భారత పురుషుల వాలీబాల్ జట్టు ప్రచారం ముగిసింది. చాలా ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ఇరానియన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ప్రపంచ 15వ ర్యాంక్‌లో ఉన్న టాప్ సీడ్ ఇరానియన్ జట్టు, రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ ఈవెంట్‌లో ఆడుతున్న అనుభవం లేని భారత జట్టుపై 25 -17, 25-20, 25-19 సునాయాసంగా విజయం సాధించింది. కాగా గ్రూప్ దశలో భారత్ ఇరాన్‌పై విజయం సాధించింది. కానీ ఈసారి ఆసియాలో రెండవ అత్యుత్తమ జట్టుకు పెద్దగా సవాలు విసరలేకపోయింది, నెట్‌లో వారి అనేక డిఫెన్సివ్ బ్లాక్‌లను పూర్తి చేయడంలో విఫలమైంది. అన్‌సీడెడ్ జట్టు అయినప్పటికీ, భారతదేశం తన తొలి ప్రచారాన్ని పూర్తిగా ఉపయోగించుకుంది. రెండవ దశలో పాకిస్తాన్ మరియు కజకిస్తాన్‌పై గట్టి విజయాలు సాధించడంతో సహా వరుసగా నాలుగు విజయాలతో ఫైనల్‌కు చేరుకుంది. సీనియర్ పోటీలు ముగియడంతో, అందరి దృష్టి ఇప్పుడు సిఎవిఎ అండర్ 16 బాలుర వాలీబాల్ ఛాంపియన్ షిప్ మరియు యు19 పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ వైపు మళ్లుతుంది. ఈ రెండూ జూన్ 10న తాష్కెంట్‌లో ప్రారంభమవుతాయి. అండర్ 16 ఈవెంట్‌లో ఆరు జట్లు పాల్గొంటాయి. కజకిస్తాన్,పాకిస్తాన్, ఇరాన్,కిర్గిజ్స్తాన్, అండర్ 19 పోటీలో భారత్, ఇరాన్, కిర్గిజ్స్తాన్ పాల్గొంటాయి.

# ఆర్‌బిఐ రేట్ల కోత అంచనాలతో సూచీల్లో లాభాలు

**ముంబై, జూన్ 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలతో సూచీలు రాణించాయి. ఐటీ, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోలుదారులుగా నిలవడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 800 పాయింట్లు మేర రాణించింది. సెన్సెక్స్ ఉదయం 81,196.08 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచీ ఇంట్రాడేలో 81,911.13



వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 443 పాయింట్ల లాభంతో 81,442 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,899 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 130 పాయింట్ల లాభంతో 24,750 వద్ద ముగిసింది. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.10 డాలర్ల వద్ద ట్రేడగగా, బంగారం ఔన్సు 3,413 డాలర్ల వద్ద కొనసాగింది.

# బ్రిటానియా ఫ్యాక్టరీ మూసివేత, కారణాలు

**ముంబై, జూన్ 5:** బ్రిటానియా ఇండస్ట్రీస్. ఇది దాదాపు 132 సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రతి ఇంట్లో తెలిసిన పేరు. బిస్కెట్ల వంటి అత్యంత ప్రాథమిక ఆహార పదార్థాల ఉత్పత్తిలో భారత దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడమే కాకుండా, దేశం లోని మొట్టమొదటి ఎఫ్ఎంసిజి కంపెనీలలో ఇది ఒకటి. కానీ



నేడు భారతదేశం నుండి పెద్ద మొత్తంలో బిస్కెట్లు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు బ్రిటానియాఇండస్ట్రీస్ దాని పురాతన కర్మాగారాలలో ఒక దాన్ని మూసివేయబోతోంది. దీనికి దేశ స్వాతంత్రంతో సంబంధం కూడా ఉంది. ముంబై హైకోర్టు నిర్ణయాన్ని కొట్టి వేస్తూ సుప్రీం కోర్టు, మూడు దశాబ్దాలకు పైగా బిస్కెట్లు తయారు చేసిన బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిఐఎల్) కంపెనీని మూసి వేయడానికి అనుమతి ఇచ్చింది. ఫిబ్రవరి 17, 2023 నాటి హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా హరి నగర్ షుగర్ మిల్స్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎంఎల్) దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ మరియు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఈ తీర్పు ఇచ్చారు. హెచ్ఎస్ఎంఎల్ గతంలో తన ఉద్యోగులకు రూ.10 కోట్లు గుడ్‌విల్‌గా ఇవ్వడానికి ముందుకొచ్చింది. కానీ కోర్టు ఈమొత్తాన్ని రూ.15కోట్లకు పెంచింది. ఎనిమిది వారాల్లోపు చెల్లించాలని కూడా కోరింది. ఈ కంపెనీని మూసి వేయడం వల్ల కొంతమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉందని, మరికొందరు ఎటువంటి తప్పు లేకుండా నిరుద్యోగులుగా మారే అవకాశంఉందని పరిగణనలోకి తీసుకుని హెచ్ఎస్ఎంఎల్ తీసుకున్న ఈ చర్యను మేము అభినందిస్తున్నాము. అలాంటి ప్రకటనలు రికార్డులో నమోదు చేసినట్లు కోర్టు పేర్కొంది. హెచ్ఎస్ఎంఎల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, గుడ్‌విల్ మొత్తాన్ని పెంచడంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను కోర్టుకే వదిలేశారు. అప్పీలుదారుల ఆఫర్‌ను రూ.5 కోట్లు పెంచడం న్యాయమైనదని తాము భావిస్తున్నామని తెలిపింది. అందువల్ల, మా ఆర్డర్‌లో ఆ మొత్తం రూ.10 కోట్లకు బదులుగా రూ.15 కోట్లు అవుతుంది. మొత్తాన్ని విడుదల చేయడానికి ఎనిమిది వారాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదని సూచించింది.

# ఎఐతో ఉద్యోగాలు పోవడం కంటే అదే డేంజర్: డీప్ మైండ్ సిఇఒ

**వాషింగ్టన్, జూన్ 5:** కృత్రిమ మేధ (ఎఐ) ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని రాకతో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సర్వం ఎఐ మయమవుతుందన్న వాదనలు వినిపిస్తున్న వేళ ఈ సాంకేతికతపై గూగుల్ డీప్‌మైండ్ సిఇఒ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. కృత్రిమ మేధ దుర్వినియోగంపై డెమిస్ ఆందోళన వ్యక్తం చేశారు. మనుషుల ఉద్యోగాలను ఎఐ భర్తీ చేస్తుందనే విషయం తనకు ఆందోళన కలిగించడం లేదని ఆ సాంకేతికత చెడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తేనే అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిమాణాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు. అయితే ఈ శక్తివంతమైన సాంకేతికతను ఉపయోగించి అద్భుతమైన పనుల్ని సజావుగా నిర్వహించవచ్చని తెలిపారు. ఎఐ వల్ల ఎంట్రీ లెవల్ వైట్-కాలర్ ఉద్యోగాలు తగ్గుముఖం పడతాయని డెమిస్ అన్నారు. సాధారణ పన్నుల్ని ఎఐ చేయడంతో మానవులు మరింత ముఖ్యమైన పనులపై దృష్టిపెట్టగలరని తెలిపారు. అప్పుడు మరింత నైపుణ్యంతో కూడిన ఉద్యోగావకాశాలు వస్తాన్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఎఐ శక్తి, వినియోగం పెరిగేకొద్దీ దాని దుర్వినియోగాన్ని ఆపేందుకు ప్రపంచవ్యాప్తంగా సహకారం అవసరమన్నారు.



# పన్నుల చెల్లింపుల్లో అదానీ రికార్డు

**ముంబై, జూన్ 5:** దేశీయ పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ రికార్డు సృష్టించింది. లిస్టెడ్ సంస్థల పోర్ట్‌ఫోలియో ద్వారా 2025 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 74,945 కోట్ల రూపాయల పన్నులను చెల్లించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం 2023 24తో పోల్చుకుంటే 29 శాతం అధికం. ఆ ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ మొత్తం 58,104 కోట్ల రూపాయల మేర పన్నులు చెల్లించగా, ఇప్పుడీ మొత్తం 74,945 కోట్ల రూపాయలకు చేరింది. ఈ మొత్తం దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పర్చడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో అదానీ గ్రూప్ ఏ స్థాయిలో భాగస్వామ్యం వహిస్తోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 74,945 కోట్ల రూపాయల్లో ప్రత్యక్ష పన్నుల వాటా 28,720 కోట్ల రూపాయలు. పరోక్ష పన్నుల వాటా 45,407 కోట్ల రూపాయలు. ఇతరత్ర పన్నుల మొత్తం 818 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. పన్నుల చెల్లింపులో రికార్డు సృష్టించిన అదానీ కోట్లాది మంది ప్రజలకు మోలిక సదుపాయాలను కల్పిస్తుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించడానికి అవసరం అయ్యే ఖర్చుతో దాదాపుగా ఇది సమానం. ఆధునిక ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి కూడా ఈ మొత్తం దాదాపు సరిపోతుంది. అలాగే కోట్లాది మంది ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో జీవనాడిగా నిలుస్తుందని అదాని గ్రూప్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అదానీ గ్రూప్ పబ్లిక్ లిస్టెడ్ సంస్థల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ సిమెంట్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. ఈ పన్నుల చెల్లింపుల్లో కీలకంగా మారాయి. పన్నుల రూపేణా వేల కోట్ల రూపాయల మేర నిధులను ప్రభుత్వ ఖజానాకు సమకూర్చాయి. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్, అదానీ పవర్ లిమిటెడ్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్‌తో పాటు ఎన్డీటీవీ, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్ కూడా పన్నులు చెల్లించిన లిస్టెడ్ సంస్థల జాబితాలో ఉన్నాయి. ఈ గ్రూప్.. తన ఏడు సంస్థల వెబ్‌సైట్లలో బేసిస్ ఆఫ్ ప్రిపరేషన్ అండ్ అప్రోచ్ టు ట్యాక్స్ అనే పేరుతో ఓ డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచింది. పన్నుల చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరిచింది. ప్రపంచవ్యాప్తంగా పోర్ట్‌ఫోలియో కంపెనీలు కొనసాగించే వ్యాపార, వాణిజ్య లావాదేవీల ద్వారా వచ్చే పన్నులు, సుంకాలు, ఇతర ఛార్జీలను ప్రత్యక్ష పన్నుల జాబితాలో చేర్చిందీ సంస్థ. ఇతర స్టేక్ హోల్డర్ల నుంచి సేకరించిన పోర్ట్‌ఫోలియో కంపెనీలకు సంబంధించిన మొత్తం చెల్లింపులను ఇండైరెక్ట్ ట్యాక్సుల్లో కలిపింది. అదానీ గ్రూప్ పన్ను పార



దర్శకతను సంస్థ కార్యకలాల్లో కీలకంగా పరిగణిస్తోంది. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తోన్నామని పేర్కొంది. సకాలంలో పన్నుల చెల్లింపు తమ సంస్థ పారదర్శకత, దేశ సమగ్రాభివృద్ధిలో చిత్తశుద్ధికి అద్దం పడుతోందని వెల్లడించింది.

# వాణిజ్యం

### మార్కెట్లో

## టాటా వర్సెస్ హ్యుండాయ్

**ముంబై, జూన్ 5:** టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్ బ్యాక్ 2025 ఆల్ట్రోజ్ రిఫ్రెష్ చేసింది. ఈ ప్రీమియం కారు రూ.6.89లక్షల నుంచి రూ.11.49 లక్షల (ఎక్స్ షోరూమ్) ప్రారంభధరలతో అందుబాటులో ఉంది. ఈ అప్డేట్ ఆల్ట్రోజ్‌ను ఈ విభాగంలోని కీలక పోటీదారులైన హ్యుందాయ్ ఐ20, మారుతి బాలెనో మరియు టయోటా గ్లాంజాతో పోటీ పడేలా చేసింది. ధర, సెగ్మెంట్ ప్లేస్మెంట్ పోల్చదగినవి అయినప్పటికీ ఫేస్లిఫ్ట్ ఆల్ట్రోజ్ ఆకర్షణను విస్తృతం చేయడంలో సహాయపడ టానికి మరిన్ని ఫీచర్లు, విస్తృత శ్రేణి పవర్ ట్రెయిన్ ఎంపికలను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఆల్ట్రోజ్ కారుకు హ్యుందాయ్ ఐ20తో కార్ల మధ్య ప్రధాన తేడాలను చూద్దాం. 2025 ఆల్ట్రోజ్ లుక్‌లో మాత్రం పెద్దగా మార్పు లేదు. ఫ్లష్‌టైప్ డోర్ హ్యాండిల్స్ అవుటర్ లుక్‌కు ఆధునిక, అధునాతన రూపాన్ని ఇస్తున్నాయి. ఈ కారు వెనుక కనెక్ట్ చేసిన ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్‌ను ఆధునిక టచ్‌ను అందిస్తాయి. ఈ కారు ఫ్రంట్ ఎండ్ లైటింగ్లో కూడా అప్ గ్రేడ్‌తో వస్తుంది. ఆటో



మేటిక్ ఎల్ఈడీ హెడ్‌లైట్‌లు, ఎల్ఈడీ ఫాగ్ లాంప్‌లు కార్నరింగ్ ఫంక్షన్‌తో ఆకట్టుకుంటుంది ఈ రెండు అప్‌గ్రేడ్‌లు ఫ్రంట్ ఎండ్ స్టైలింగ్‌ను మెరుగుపరుస్తాయి. ఆటోఫోల్డింగ్ అవుట్ సైడ్ మిర్రర్లు, 16 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ కూడా వాహనానికి సంబంధించిన కర్బ్ సైడ్ ఆకర్షణకు సహాయపడతాయి. అందువల్ల ఆల్ట్రోజ్ సెగ్మెంట్‌లోని మరింత విలాసవంతమైన హ్యాచ్‌బ్యాక్‌లతో పోటీపడడానికి ఉన్నత స్థాయి అనుభూతిని ఇస్తుంది. 2025 టాటా ఆల్ట్రోజ్, హ్యుందాయ్ 20 ఫీచర్లలో దగ్గరగా సరిపోతాయి. అయితే కొన్ని కీలక అంశాలలో విభిన్నంగా ఉంటాయి. అవుటర్ వ్యూలో రెండూ ఎల్ఈడీ హెడ్‌లైట్లు, డీఆర్ఎల్‌లు, అల్లాయ్‌వీల్స్, ఆటో ఫోల్డింగ్ ఓఆర్‌వీఎంలతో వస్తాయి. ఆల్ట్రోజ్ కార్నరింగ్, కనెక్టెడ్ టెయిల్ లైట్లు, ఫ్లష్‌టైప్‌డోర్ హ్యాండిల్స్ ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్లతో ఆకట్టుకుంటుంది. అయితే ఐ20లో పుడిల్ ల్యాంప్‌లతో ఆకట్టుకుంటున్నాయి. ఇంటీరియర్ విషయానికి వస్తే ఆల్ట్రోజ్‌లో బ్లాక్‌బీజ్ థీమ్, ఫ్యాబ్రిక్ అప్హోల్స్టరీ, మల్టీ కలర్ యాంబియంట్ లైటింగ్, టచ్‌బేస్డ్ ఏసీ ప్యానెల్‌తో కూల్డ్ గ్లోబ్బాక్స్‌లతో ఆకట్టుకుంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.